www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 17-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 62 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: షష్ఠి మ.2.47 తదుపరి సప్తమి, నక్షత్రం: శతభిషం రా.1.02 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.8.22-9.57, దుర్ముహూర్తం: ఉ.8.21-9.13, రా.10.22-11.04, అమృతఘడియలు: సా.5.53-7.28, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆమెను చెట్టుకు కట్టేసి..

అప్పు తీర్చాలంటూ వేధింపులు

భర్త తీసుకున్న రుణానికి భార్యకు శిక్ష

చిత్తూరు జిల్లా కుప్పంలో దారుణం

చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురంలో శిరీషను చెట్టుకు కట్టేసిన దృశ్యం

14

ఆరోగ్యాంధ్రే లక్ష్యం

ప్రధాని సమక్షంలో విశాఖ యోగా డిక్లరేషన్

21న బీచ్ రోడ్డులో 5 లక్షల మందితో యోగాంధ్ర: సీఎం చంద్రబాబు



విశాఖలో యోగా డే ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 11 ఏళ్లు
- విశాఖలో కార్యక్రమం చేపట్టాలని మోదీ అడిగారు
- దీంతో చరిత్రలో నిలిచేలా కార్యక్రమానికి శ్రీకారం
- లక్ష ప్రాంతాల్లో నిర్వహణ.. లక్ష్యం 2 కోట్ల మంది
- 22 అంశాల్లో గిన్నిస్ రికార్డుకు యత్నం
- 20న మాక్ ఈవెంట్.. పొరపాటుంటే సరిచేస్తాం
- 21న ఉద్యోగులు, విద్యార్థులకు సెలవు
- రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి
- గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి చిత్తూరులో పైలట్ ప్రాజెక్టు
- ఆ తర్వాత రాష్ట్రమంతా అమలు: సీఎం
- విశాఖలో యోగా వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

> ● ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు చేపట్టాం. చిత్తూరులో ఆరు నెలల్లో పూర్తవుతుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా చేస్తాం.
>
> ● యోగాంధ్రను ప్రతి ఒక్కరూ పాజిటివ్‌గా తీసుకోవాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. కలుషిత ఆలోచనలతో రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తే వారికి ఆ విధమైన ఫలితాలే వస్తాయి.
>
> "- సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నామని, అందులో భాగంగా 21న విశాఖలో 'యోగాంధ్ర'ను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా ఆ రోజు ప్రధాని మోదీ సమక్షంలో నిర్వహించే ఈ కార్యక్రమ సన్నాహాలను సమీక్షించేందుకు సోమవారం చంద్రబాబు విశాఖ వచ్చారు. క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్కే బీచ్‌రోడ్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానాలను సందర్శించారు. అనంతరం నోవాటెల్ హోటల్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. తర్వాత విలేకరులతో మాట్లాడారు. భారతీయ వారసత్వ సంపదగా వచ్చిన యోగా వల్ల అందరికీ ప్రయోజనాలు ఉన్నాయని గుర్తించిన ప్రధాని.. దీనిని ఐక్యరాజ్యసమితికి చెప్పి 'జూన్ 21'ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటింపజేసి పదేళ్లు పూర్తయిందని గుర్తుచేశారు. 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టనున్న తరుణంలో విశాఖలో భారీ కార్యక్రమం నిర్వహించాలని ఆయన కోరగా తాను అంగీకరించినట్లు తెలిపారు. ఇందుకోసం 'యోగాంధ్ర'కు నెల క్రితమే

మిగతా 13వ పేజీలో...

బారులు తీరిన తల్లులకు వం'ధనం'





'తల్లికి వందనం' డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. ఒక్కొక్కరికి కనీసం రూ.13 వేలు! చదువుకునే పిల్లలు ఎందరుంటే తల్లుల ఖాతాల్లో అన్ని 13 వేలు! అయితే.. తల్లుల్లో చాలామందికి డెబిట్ కార్డుల్లేవు. ఫోన్ ద్వారా యూపీఐ సేవలు వాడుకోలేని వారూ ఉన్నారు. దీంతో నగదు విత్‌డ్రా కోసం బ్యాంకులకు పోటెత్తారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం రద్దీ మరింత ఎక్కువైంది. కృష్ణా జిల్లా గుడివాడలోని పోస్టాఫీసు... విజయవాడ కృష్ణలంక యూనియన్ బ్యాంక్ శాఖల్లో నగదు కోసం బారులు తీరిన మహిళల చిత్రాలివి!

మళ్లీ మొదలెట్టారు!

డీపట్టా భూములపై వైసీపీ 'డీల్' అమలుకు యత్నాలు

- పెందుర్తిలో ఆ భూములపై నాడు వైసీపీ పెద్దల కన్ను
- ఫ్రీహోల్డ్ జీవో వస్తుందని తెలిసి
- 100 ఎకరాలకు అప్పట్లో అనధికార ఒప్పందాలు
- 50 ఎకరాలకు అడ్వాన్స్ ఇచ్చిన అప్పటి ఉన్నతాధికారి
- ఎన్నికల కోడ్ రావడంతో ఆగిన ఫ్రీహోల్డ్ ప్రక్రియ
- కూటమి రావడంతో తన డబ్బు రాబట్టుకునే యత్నం
- సహకరిస్తున్న రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారి?



పెందుర్తి మండలం ఎస్ఆర్. పురంలో డీపట్టా భూములు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

విశాఖ శివార్లలోని పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో (సౌభాగ్యరాయపురం) సుమారు 100 ఎకరాల డీ పట్టా భూములను చేజిక్కించుకునేందుకు వైసీపీ హయాంలో అప్పటి పెద్దలు, ప్రభుత్వంలోని కీలక ఉన్నతాధికారి ప్రయత్నించారు. ఎన్నికల కోడ్ రావడంతో వారి ప్రయత్నాలకు కళ్లెం పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరి భూదందాకు శాశ్వతంగా తెరపడినట్టేనని భావించారు. కానీ, ఆ భూములు దక్కించుకోవడానికి తెర వెనుక మంత్రాంగాన్ని మళ్లీ మొదలెట్టారు. రెవెన్యూ శాఖలోని ఓ కీలక వ్యక్తి తరఫున విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు పావులు కదుపుతున్నారనీ, ప్రభుత్వంలోని కీలక ఉన్నతాధికారి సాయం కోరుతున్నారనీ తెలుస్తోంది. ఈ అంశం రెవెన్యూశాఖ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ వివరాల్లోకి వెళితే...రాష్ట్రంలో రైతుల సాగులో ఉన్న డీ ఫారం భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయాలని గత ప్రభుత్వం 2022లో

మిగతా 14వ పేజీలో...

తోక కట్ చేస్తా

- అధికారంలో ఉన్నప్పుడు రౌడీయిజం చేశారు.. ఇప్పుడూ చేస్తానంటే కుదరదు
- ఇక్కడున్నది సీబీఎన్ అని గుర్తుంచుకోండి.. జగన్‌కు ముఖ్యమంత్రి హెచ్చరిక
- పరామర్శలు చేసుకోండి.. పోలీసులపై నోరుపారేసుకోవడం సరికాదు
- నోరు మూయించే సత్తా టీడీపీకి ఉంది.. వ్యవస్థలు నాశనం.. ఆర్థికం ఛిన్నాభిన్నం
- విశాఖ సహజసిద్ధ నగరం.. ముంబైకి దీటుగా అభివృద్ధి చేస్తా: చంద్రబాబు

12

జనగణనకు నోటిఫికేషన్

- విడుదల చేసిన కేంద్ర హోం శాఖ.. మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో
- 2026 అక్టోబరు 1 నాటికే పూర్తి.. మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1కి
- 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో నిర్వహణ
- అంచనా వ్యయం రూ.13 వేల కోట్లు.. డేటా లీక్ కాకుండా గట్టి చర్యలు
- నోటిఫికేషన్‌లో కుల గణన ప్రస్తావనే లేదు.. ఇది మోదీ యూటర్నా?: జైరాం
- కులగణన కూడా ఇందులో భాగమే: కేంద్ర హోం శాఖ

13

మద్యం స్కాంలో మిథున్‌రెడ్డిదే

కీలక పాత్ర

- ముడుపులు ఇచ్చిన కంపెనీలకే ఆర్డర్లిచ్చారు
- షెల్ కంపెనీల ద్వారా సొమ్ము మళ్లించారు
- పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు చేరిన రూ.5 కోట్లు
- ఆయనను అదుపులోకి తీసుకుని విచారించాలి
- పిటిషనర్‌కు పూర్వ నేరచరిత్ర కూడా ఉంది
- హైకోర్టులో సీనియర్ న్యాయవాది లూథ్రా వాదన
- డీకార్ట్ లాజిస్టిక్స్ సొమ్మును తిరిగి ఇచ్చారు
- సొమ్ము మిథున్‌రెడ్డికి చేరినట్లు ఆధారాలు లేవు
- ఎంపీ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు

పాలసీ రూపకల్పన, అమలులో ప్రధాన భూమిక



అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు తెలిపారు. అప్పట్లో లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలులో మిథున్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించారని చెప్పారు. ముడుపులు చెల్లించిన కంపెనీలకే మద్యం

మిగతా 14వ పేజీలో...



14

విజయవాడలో ప్రారంభించిన ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం

ఇక రాష్ట్రం నుంచే

సేవలు

- విజయవాడలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం
- చాంబర్లకు గోదావరి, తుంగభద్రగా నామకరణం

స్కిల్ ప్రాజెక్ట్ కోసం

కోటి స్థలం విరాళం

తెనాలిలో ఓ మహిళ దాతృత్వం

12

హోరాహోరీ!

- ఆగని ఇజ్రాయెల్-ఇరాన్ పోరు
- టెహ్రాన్ లక్ష్యంగా దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్
- ప్రజలు వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు
- ప్రాణరక్షణ కోసం పొరుగు దేశాలకు పారిపోతున్న ఇరాన్ ప్రజలు
- ఇజ్రాయెల్‌పై దాడులను పెంచిన ఇరాన్
- టెల్‌అవీవ్ శివార్లలో భారీ విధ్వంసం
- తాజాగా 11 మంది మృతి
- హైఫాలోని చమురు ప్లాంట్‌పై దాడి
- చెలరేగుతున్న మంటలు.. ప్లాంట్ భద్రం
- ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: నెతన్యాహు
- అణు ఒప్పందం నుంచి తప్పుకొంటాం
- మాపై అణుబాంబు వేస్తే.. పాకిస్థాన్ గట్టిగా స్పందిస్తుంది: ఇరాన్



ఇరాన్ క్షిపణుల ధాటికి ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో జరిగిన భారీ పేలుడు

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 16: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను ఇజ్రాయెల్ టార్గెట్‌గా చేసుకుంటోంది. "మీరంతా వీలైనంత త్వరగా టెహ్రాన్‌ను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి" అంటూ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అధికారులు అరబిక్, పర్షియా భాషల్లో టెహ్రాన్ పౌరులకు సందేశాలు పంపుతున్నారు. దాంతో.. వేల మంది ఇరానీలు టెహ్రాన్ నగరాన్ని వీడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే ఇరాన్‌లోని ఇతర ప్రావిన్సులతోపాటు.. పాకిస్థాన్, అజర్‌బైజాన్, తుర్కియే, తుర్క్‌మెనిస్థాన్ దేశాలకు తరలివెళ్తున్నారు. దీంతో.. టెహ్రాన్ వీధులన్నీ కార్లతో నిండిపోయాయి. పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరానీలు గేట్లను

మిగతా 2వ పేజీలో...

బదిలీలు సంపూర్ణం

67,732 మంది టీచర్ల బదిలీ

- అత్యధికంగా 31 వేల ఎస్జీటీలు
- 4,477 మందికి పదోన్నతులు
- 25 రోజుల్లో పూర్తిచేసిన విద్యాశాఖ

11

షార్‌కు బాంబు బెదిరింపు

- చెన్నై పోలీసు కంట్రోల్ రూంకు అర్ధరాత్రి ఫోన్‌కాల్
- తమిళనాడు అధికారుల సమాచారంతో తనిఖీలు
- ఫేక్ కాల్‌గా నిర్ధారణ.. నిందితుడి అరెస్ట్

13



13

సీఎం హెలికాప్టర్‌లో

సాంకేతిక లోపం

- కేంద్ర మంత్రి పర్యటనకు అదే చాపర్
- కృష్ణపట్నం పర్యటన రద్దు చేసుకున్న గోయల్
- సాంకేతిక సమస్యలపై సమగ్ర నివేదిక కోరిన డీజీపీ

ఎట్టకేలకు కదిలిన

నైరుతి

- తిరిగి వేగం పుంజుకున్న రుతుపవనాలు
- మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌కు విస్తరణ
- ముంబైను ముంచుతున్న భారీ వర్షాలు
- కేరళలోనూ కుండపోత

12

ముగ్గురేసి పిల్లలను కనండి

» మూడో బిడ్డ బాధ్యత వీహెచ్‌పీదే: ప్రవీణ్ తొగాడియా

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శక్తిమంతమైన హిందూ దేశ నిర్మాణం కోసం హిందువుల జనాభా పెరగాలని, కనుక ప్రతి హిందూ జంట ముగ్గురేసి పిల్లలకు జన్మనివ్వాలని అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ సంస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా పిలుపునిచ్చారు. మూడోబిడ్డ బాధ్యత చదువు, ఫీజులు తదితర బాధ్యతను విశ్వహిందూ పరిషత్ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. హుబ్బళ్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హిందువులకోసం దేశవ్యాప్తంగా హెల్ప్ లైన్ ప్రారంభించామని, అడ్వకేట్ హెల్ప్‌లైన్, 10వేల మంది డాక్టర్లతో హిందువుల రక్షణకు సలహాలు, సేవలు అందించే విభాగం పనిచేస్తున్నాయని తెలిపారు. ముష్టి(పిడికిలి) బియ్యం పథకాన్ని ప్రారంభించామని, దేశంలో ఏ హిందువూ ఆకలితో బాధపడకూడనేదే దీని లక్ష్యమని చెప్పారు. ప్రతి హిందువు రోజూ గుప్పెడు బియ్యం పక్కనతీసి వంట చేసుకోవాలని, ఆ బియ్యాన్ని నెలకోసారి హిందువులకు పంచాలని కోరారు. తద్వారా ఏ హిందువూ ఆకలితో అలమటించరని అన్నారు.

విమాన ప్రమాదంపై కమిటీ తొలి భేటీ

» సీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్న ఏఏఐబీ అధికారులు

న్యూఢిల్లీ, జూన్ 16: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ తొలిసారి సమావేశమైంది. విమాన ప్రమాదానికి దారి తీసిన కారణాలపై చర్చించింది. సోమవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. విమాన ప్రమాదానికి గల కారణాలపై అందరి అభిప్రాయాలు తీసుకొని.. భేటీలో చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు.. విమాన ప్రమాదంపై ప్రత్యేక దర్యాప్తు జరుపుతున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) ప్రమాదం స్థలంలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్)ను గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఇటు అమెరికాకు చెందిన స్వతంత్ర దర్యాప్తు సంస్థ జాతీయ రవాణా భద్రతా బోర్డు (ఎన్‌టీఎస్‌బీ) కూడా రంగంలోకి దిగింది. విమాన ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు అనేక మంది అంతర్జాతీయ నిపుణులను ప్రమాద స్థలానికి రప్పించింది.

15 సెకన్లలోనే యూపీఐలో నగదు బదిలీ

న్యూఢిల్లీ, జూన్ 16: ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ వినియోగదారులకు శుభవార్త. దేశవ్యాప్తంగా యూపీఐ లావాదేవీలు ఇక నుంచి 15సెకన్లలోనే పూర్తవుతాయి. యూపీఐ లావాదేవీలు ప్రాసెస్ కావడానికి పట్టే సమయం తగ్గేలా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. సోమవారం నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి. ఇప్పటి వరకు యూపీఐ ద్వారా నగదు బదిలీ, స్వీకరణకు సాధారణంగా 30 సెకన్ల వరకు సమయం పట్టేది. గతంలో చెల్లింపులు ఆగిపోయినపుడు నగదు డెబిట్ అయిందా లేక తిరిగి జమ అయిందా అని తెలియడానికి 30 సెకన్లు, అంతకంటే ఎక్కువ సమయం పట్టేది. ఇప్పుడు 10 సెకన్లలోనే ఆ వివరాలు తెలిసిపోతాయి. అలాగే బ్యాంకులు, చెల్లింపు యాప్‌లు పెండింగ్ లేదా నిలిచిపోయిన లావాదేవీల వివరాలను ధ్రువీకరించడానికి 90 సెకన్ల వరకు పట్టగా, ఇప్పుడు 45 నుంచి 60 సెకన్లు మాత్రమే తీసుకుంటుంది.

రైల్వేలో 6,374 పోస్టుల భర్తీకి చర్యలు

న్యూఢిల్లీ, జూన్ 16: రైల్వేలో ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ సహా 51 కేటగిరీల్లోని గ్రేడ్-సి పోస్టులు భర్తీ కానున్నాయి. దేశంలోని 17 జోన్లు, ఉత్పాదక యూనిట్లలో ఈ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం పేర్కొన్న పోస్టుల సంఖ్య కన్నా ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సిగ్నల్, టెలికాం విభాగంలో చివరిసారిగా 2017లో పోస్టుల భర్తీ జరిగింది.

కేదార్‌నాథ్ యాత్ర పునఃప్రారంభం

రుద్రప్రయాగ, జూన్ 16: కేదార్‌నాథ్ యాత్ర సోమవారం పునఃప్రారంభమైంది. ఆదివారం రుద్రప్రయాగ జిల్లాలోని పలుప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడడంతో ఓ వ్యక్తి మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ క్రమంలో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రకు వెళ్లే మార్గంలో పడిన కొండచరియలను తొలగించడంతో సోమవారం పునరుద్ధరించారు. ఈ వారం మొత్తం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లే నడక నడక మార్గాన్ని మూసివేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు.

'ఉపాధి' వ్యయంపై పరిమితి దారుణం: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 16: పేదల జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం 'ఎక్స్'లో ఆరోపించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ వ్యయంపై కేంద్రం పరిమితి విధించిందని, ఇది 'రాజ్యాంగ వ్యతిరేకం' అని విమర్శించారు. ఉపాధి హామీ పథకం వ్యయాన్ని ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలలకు 60 శాతంగా నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. పేదల జేబుల నుంచి రూ.25 వేల కోట్లు దోచుకొనేందుకు మోదీ ప్రభుత్వం ఇలా చేస్తోందా? అని ఖర్గే ప్రశ్నించారు.

మంత్రివర్గ ఆమోదం లేకుండా చెల్లింపులేంటి?

» ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ ప్రశ్నలు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): "ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణకు మంత్రివర్గ ఆమోదం లేకుండా నిధులు చెల్లింపులు ఎందుకు చేశారు? రేసు నిర్వహణ నుంచి మధ్యలో తప్పుకొన్న ఏస్ నెక్స్‌జెన్ మీ పార్టీకి రూ.49 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో ఎందుకు చెల్లించింది? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మీరు అధికారులకు నేరుగా (మౌఖిక) ఆదేశాలు ఎలా ఇచ్చారు?" ..అంటూ తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు ఏడుగంటలకుపైగా సాగిన విచారణలో వారు ఆయన్ను 60 దాకా ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగంపై ఏసీబీ నమోదు చేసిన కేసులో కేటీఆర్ దర్యాప్తు అధికారుల ఎదుట రెండోసారి విచారణకు హాజరయ్యారు. విచారణలో కేటీఆర్ ఫోన్ సీజ్ చేసేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్నించగా.. తాను ఫోన్ వెంట తీసుకురాలేదని ఆయన చెప్పినట్లు తెలిసింది. దీంతో.. 2021-2024 మధ్యకాలంలో ఉపయోగించిన సెల్‌ఫోన్లను 18వ తేదీ (బుధవారం)లోగా అప్పగించాలని ఆదేశించారు.

హోరాహోరీ!


ఇరాన్‌లో తగలబడిపోతున్న ఐఆర్ఐబీ భవనం

(మొదటి పేజీ తరువాయి)

తోసుకుంటూ లోనికి వెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "టెహ్రాన్ పౌరులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సందేశాలు పంపాం. మేము టార్గెట్‌గా చేసుకోబోతున్న ప్రాంతాల వివరాలను అందజేశాం" అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి మేజర్ కమల్ పిన్సాసీ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ కూడా ఇవే హెచ్చరికలు చేశారు. దీంతో.. సోమవారం అర్ధరాత్రి నుంచి టెహ్రాన్‌పై భీకర దాడులు చేసేందుకు ఐడీఎఫ్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

వైమానిక దాడులకు చాన్స్!

టెహ్రాన్ వాసులకు హెచ్చరికలు జారీ చేయడానికి ముందు కాట్జ్ ఓ ప్రకటన చేశారు. "ఇరాన్‌లోని మూడోవంతు గగనతల రక్షణ వ్యవస్థలను మేం నిర్వీర్యం చేశాం. ఇప్పుడు టెహ్రాన్‌తోపాటు.. కీలక ప్రాంతాల్లో గగనతలాన్ని మేం నియంత్రించగలం" అని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని నిర్ధారించారు. దీన్ని బట్టి సోమవారం అర్ధరాత్రి దాటాక టెహ్రాన్‌పై భీకర వైమానిక దాడులు జరుగుతాయని తెలుస్తోంది. కడపటి వార్తలందేసరికి ఇరాన్ సెంట్రల్ కమాండ్‌లోని పలు లక్ష్యాలపై, ఇస్ఫహాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. టెహ్రాన్ వైమానిక స్థావరంపై జరిపిన దాడిలో రెండు ఎఫ్-14 ఫైటర్ జెట్లు ధ్వంసమయ్యాయి. వీటితోపాటు.. ఇరాన్ డ్రోన్ల యూనిట్‌ను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. క్షిపణులను తరలిస్తున్న ట్రక్కులను టార్గెట్లుగా చేసుకుని, దాడులు చేసినట్లు తెలిపింది. పశ్చిమ, మధ్య ఇరాన్‌లోనూ డజన్ల కొద్దీ డ్రోన్ దాడులు జరిగాయి. ఈ ప్రాంతాల్లో ఉన్న ఇరాన్ క్షిపణి, యూఏవీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ 'వైనెట్' వెల్లడించింది. కాగా.. సోమవారం ఉదయం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన ఖుద్స్ ఫోర్స్ ప్రధాన కార్యాలయం ధ్వంసమైంది. ఇరాన్ సైన్యం ప్రధాన కార్యాలయంపైనా క్షిపణి దాడులు జరిగాయి. క్షిపణి దాడుల కారణంగా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్(ఐఆర్ఐబీ) భవనం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ భవనంలో ఇరాన్ అధికారిక వార్తాసంస్థలు-- ప్రెస్‌టీవీ, అల్-ఆలమ్, హిస్పాన్ టీవీ కొనసాగుతున్నాయి. మరో వార్తాసంస్థ 'సహర్ టీవీ' భవనంపైనా బాంబులు పడడంతో తీవ్రంగా దెబ్బతిన్నది. యాంకర్ లైవ్‌లో ఉండగానే క్షిపణి దాడి జరిగింది. ప్రేక్షకులు ఈ దృశాలను మీడియాలో చూశారు. ఈ రెండు ఘటనల్లో పలువురు మృతి చెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా జరుగుతున్న యుద్ధంలో 400 మంది మరణించారని, వారిలో 197 మంది సాధారణ పౌరులని ఇరాన్‌లోని మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి.

ఇజ్రాయెల్‌లో భారీ నష్టం

ఇరాన్ క్షిపణి దాడులతో నాలుగో రోజు కూడా ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్ శివార్లలోని పలు పట్టణాలు భారీగా నష్టపోయాయి. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 24 మరణాలు నమోదైనట్లు, 500 మందికిపైగా గాయపడ్డట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. సోమవారం తెల్లవారుజాము వరకు హైఫా ప్రాంతంలో క్షిపణుల వర్షం కురిసింది. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ వాటిని చాలా వరకు గాల్లోనే అడ్డుకున్నా.. పలు క్షిపణులు బాజాన్ చమురు క్షేత్రాన్ని తాకాయి. అయితే.. చమురు క్షేత్రం వద్ద పార్క్ చేసి ఉన్న భారీ ట్యాంకర్ ట్రక్కులు, పైప్‌లైన్ మాత్రమే ధ్వంసమైనట్లు ఐడీఎఫ్ వర్గాలు తెలిపాయి. ప్రధాన ప్లాంట్ క్షేమంగా ఉందని చెప్పాయి. ఈ ప్రాంతంతో పాటు.. పేటాతిక్వా, క్రయోట్‌లో మరణాలు ఎక్కువగా సంభవించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం తమ పౌరులను బంకర్లకు తరలించడంతో.. ప్రాణనష్టం తక్కువగా ఉన్నా.. భవనాలు, ఆకాశహర్మ్యాలు, దెబ్బతిన్నాయి. సోమవారం రాత్రి ఇరాన్ జరిపిన దాడుల్లో ఉత్తరాదిలోని పలు ప్రాంతాల్లో నష్టం జరిగినట్లు తెలిసింది.


ఇజ్రాయెల్‌లోని పేటాతిక్వాలో ధ్వంసమైన భవనం

పాకిస్థాన్ రంగంలోకి దిగుతుంది: ఇరాన్

ఇజ్రాయెల్ తమపై అణుబాంబుతో దాడిచేస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగుతుందంటూ ఐఆర్‌జీసీ జనరల్ మొహిసన్ రెజాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ చూస్తూ ఊరుకోదని, ఇజ్రాయెల్‌పై తన అణ్వాయుధాలను ప్రయోగిస్తుందని హెచ్చరించారు. ఆ మేరకు తమకు పాకిస్థాన్ నుంచి హామీ లభించిందని చెప్పారు. అంతేకాకుండా.. తుర్కియే, సౌదీఅరేబియా, పాకిస్థాన్ తదితర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటు చేయాలని మొహిసిన్ పిలుపునిచ్చారు. కాగా.. మొహిసిన్ అణు దాడి వ్యాఖ్యలను పాకిస్థాన్ ఖండించింది.

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: నెతన్యాహు

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్రపన్నిందంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సంచలన ఆరోపణలు చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని, అందుకే ఆయనను చంపాలని ఇరాన్ చూస్తోందని ఆరోపించారు. కాగా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వానికి తాము సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఓ ప్రకటన చేశారు. "మేం గతంలోనే ఇరాన్‌కు ఒక ప్రతిపాదన చేశాం. రష్యా గడ్డపై ఇరాన్ యురేనియంను నిల్వ చేయాలి. ఈ ప్రతిపాదన ఇప్పటికీ సముచితమైనదే" అని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు మధ్యవర్తిత్వానికి ఒప్పించేలా అమెరికాను కోరాలని ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్‌లకు ఇరాన్ విజ్ఞప్తి చేసినట్లు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది.

భారతీయ విద్యార్థులకు మార్గం సుగమం

ఇరాన్‌లో చిక్కుకుపోయిన సుమారు 10 వేల మంది భారతీయ విద్యార్థులను వెనక్కి రప్పించడానికి విదేశాంగ శాఖ మార్గం సుగమం చేసింది. భారత విజ్ఞప్తి మేరకు అజర్‌బైజాన్, తుర్కిమెనిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్ మీదుగా రోడ్డు మార్గంలో విద్యార్థులు వెనక్కి వెళ్లేందుకు ఇరాన్ సర్కారు అనుమతినిచ్చింది. కాగా.. టెహ్రాన్ వైద్య విశ్వవిద్యాలయంపై సోమవారం ఇజ్రాయెల్ క్షిపణులు పడ్డాయి. ఈ ఘటనలో జమ్మూకశ్మీర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి.

భారత్‌ను కాపీ కొడుతున్న ఇరాన్!

ఇజ్రాయెల్‌తో యుద్ధంపై ప్రెస్ బ్రీఫింగ్‌లో ఇరాన్ భారత్‌ను కాపీ కొడుతున్నట్లు కనబడుతోంది. 1979 పేం,ఇ ఏనాడూ ఫ్రంట్‌లైన్‌లో మహిళా అధికారులను ఇరాన్ నియమించలేదు. కానీ, ఇజ్రాయెల్‌తో యుద్ధం సందర్భంగా మొట్టమొదటిసారి ఫాతిమా మెహాజిరాని అనే మహిళను అధికార ప్రతినిధిగా నియమించారు. ప్రెస్ బ్రీఫింగ్ బాధ్యతలను పూర్తిస్థాయిలో ఆమెకే అప్పగించారు.

లోకం తీరు



ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంది

» జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సు

కనానాస్కిస్, జూన్ 16: ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉందని కెనడాలో జరుగుతోన్న జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సు స్పష్టం చేసింది. అదే సమయంలో ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండరాదని కూడా ఓ ముసాయిదా ప్రకటన ద్వారా తేల్చి చెప్పింది. ప్రాంతీయ సుస్థిరత కోసం రెండు దేశాలు ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని ముసాయిదాలో సూచించాయి. మరోవైపు సదస్సులో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధంలో ఇరాన్ గెలవదన్నారు. ఆలస్యం కాకముందే ఇరాన్ సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభిస్తే మేలని సూచించారు. అమెరికా సంస్థలపై దాడి చేస్తే కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిదాడులు చేస్తామని ఇరాన్‌ను హెచ్చరించారు. జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సు ముసాయిదా ప్రకటనపై సంతకం చేసేందుకు ట్రంప్ నిరాకరించారని సమాచారం.ఔ కాగా, ప్రధాని మోదీ సైప్రస్ పర్యటన ముగించుకుని జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కెనడా చేరుకున్నారు.

ఆగస్టులో ట్రంప్ మొబైల్ ఫోన్లు

వాషింగ్టన్ డీసీ, జూన్ 16: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొబైల్ ఫోన్ మార్కెట్‌లోకి అడుగుపెట్టారు. ఆయన సొంత సంస్థ(ట్రంప్ ఆర్గనైజేషన్) ట్రంప్ మొబైల్ పేరిట స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరించింది. టీ1 పేరిట గోల్డెన్ కలర్ ఫోన్‌ను ఆగస్టులో మార్కెట్‌లోకి తీసుకురానున్నారు. దీని ఖరీదు 499 డాలర్లు. అమెరికాలో ఏటా ఆరు కోట్ల మొబైల్ ఫోన్లు అమ్ముడుపోతున్నా ఉత్పత్తి మాత్రం బయట దేశాల్లోనే జరుగుతోంది. అయితే ట్రంప్ ఫోన్లు మాత్రం పూర్తి స్థాయిలో అమెరికాలోనే తయారవుతాయి. ట్రంప్ ఫోన్ నెలవారీ ప్లాన్లలో 47 డాలర్లకే హై స్పీడ్‌తో 20జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాల్స్, సందేశాలు పంపే అవకాశమిచ్చారు.

కాంగ్రెస్ వల్లే నేపాల్‌లో రాచరిక వ్యవస్థ పతనం

బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే

న్యూఢిల్లీ, జూన్ 16: ఏకైక హిందూ దేశమైన నేపాల్‌లో రాచరిక వ్యవస్థ పతనానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపించారు. నేపాల్ రాజు బీరేంద్రను గద్దె దించి రాచరిక వ్యవస్థను పతనం చేయడంతో పాటు అనంతర కాలంలో చైనా మద్దతున్న ప్రచండను ప్రధానిగా చేసిందన్నారు. రా (రీసర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) అధికారి అమర్ భూషణ్‌కు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. నాడు కాంగ్రెస్ అనుసరించిన తీరు వల్ల నేడు భారత్ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు దూబే సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. "1988లో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ కుటుంబ సమేతంగా నేపాల్ వెళ్లారు. పర్యటనలో భాగంగా అక్కడి పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించాలనుకున్నారు. హైందవేతరులకు ఆలయంలోకి ప్రవేశం లేదంటూ ఆలయ కమిటీ సభ్యులు సోనియా గాంధీకి అనుమతి నిరాకరించారు. దీనికి ప్రతీకారంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నేపాల్‌పై కక్షగట్టింది. నేపాల్‌కు వెళ్లే వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ విధించడంతో పాటు ఆంక్షలు విధించింది. దీంతో నాటి నేపాల్ రాజు బీరేంద్ర.. చైనాతో ఆయుధాలు, ఆహార పదార్థాలకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నారు. తద్వారా నేపాల్ చైనా ఒడిలోకి వెళ్లినట్లైంది. అంతటితో ఆగక రా అధికారి అమర్ భూషణ్ ద్వారా నేపాల్‌లో రాచరిక వ్యవస్థ పతనమయ్యేలా చేయడంతో పాటు.. అనంతర కాలంలో ప్రచండను ప్రధానిని చేశారు" అని దూబే సోషల్ మీడియా పోస్టులో ఆరోపించారు.

బాబోయ్.. విమాన ప్రయాణాలు!

బాంబు బెదిరింపులు, సాంకేతిక సమస్యలు, ప్రమాదాలతో జనంలో ఆందోళన



లండన్/హైదరాబాద్, జూన్ 16: జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన లుఫ్తాన్సా విమానం.. బాంబు బెదిరింపు కారణంగా వెనక్కి మళ్లింది. ఫ్రాంక్‌ఫర్ట్ స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2.14 గంటలకు (భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5.44గంటలు) బయల్దేరిన ఎల్‌హెచ్752 (బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్) విమానం.. షెడ్యూలు ప్రకారం సోమవారం ఉదయానికి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోవాలి. కానీ, బయల్దేరిన రెండు గంటలకే.. బాంబు బెదిరింపు కారణంగా విమానం యూటర్న్ తీసుకుని తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్‌కు చేరుకుంది. విమానయాన సంస్థ.. సోమవారం ఉదయం 10 గంటలకు(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు) అదే విమానంలో వారిని హైదరాబాద్‌కు పంపింది. మరోవైపు.. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఈ విమానానికి సంబంధించి బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చినట్లు శంషాబాద్ విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. మరోవైపు.. లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్టు నుంచి చెన్నైకి బయల్దేరిన బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ (బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఫ్లైట్ బీఏ35).. సాంకేతిక సమస్యల కారణంగా మళ్లీ లండన్‌కు చేరుకుంది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే విమానాన్ని వెనక్కి మళ్లించినట్లు బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ విమానం మళ్లీ సోమవారం మధ్యాహ్నం చెన్నైకి బయల్దేరిందని.. మంగళవారం ఉదయం చెన్నైలో ల్యాండ్ కానుందని తెలిపింది. ఇక.. హాంకాంగ్ నుంచి సోమవారం ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా(బోయింగ్ 787-8) విమానంలో సాంకేతిక సమస్య ఉందని పైలట్ అనుమానించడంతో.. దాన్ని తిరిగి హాంకాంగ్‌కే మళ్లించి అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేశారు. అటు.. జెద్దా నుంచి లక్నవూకు 242 మంది హజ్ యాత్రికులతో వచ్చిన సౌదీ ఎయిర్‌లైన్స్ విమాన చక్రాల నుంచి పొగలు, నిప్పురవ్వలు రావడం కలకలం సృష్టించింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగకుండా చూశారు.

దించి.. ఎక్కించి..

గువాహటి నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగించింది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సీట్లలో కూర్చొన్న ప్రయాణికులను రెండుసార్లు కిందికి దింపాల్సి వచ్చింది. 18 గంటల పాటు వేచి చూసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో చివరకు మరో ప్రత్యేక విమానంలో కోల్‌కతాకు పంపాల్సి వచ్చింది. గువాహటి విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 9.20 గంటలకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం బయలుదేరాల్సి ఉండగా సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో విమానంలోని 170 మంది ప్రయాణికులను కిందికి దించారు. సమస్య పరిష్కారమయిందని చెప్పి ప్రయాణికులను మళ్లీ కూర్చోమన్నారు. తిరిగి అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో మరోసారి అందర్నీ కిందికి దించారు. తిరిగి ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రయాణికులంతా విమానం ఎక్కారు. సాంకేతిక సమస్య ఉందని చెప్పి ఇంకోసారి అందర్నీ కిందికి దించేశారు. చివరకు మరో విమానం ఏర్పాటు చేసి సాయంత్రం 3.34 గంటల సమయంలో ప్రయాణికులను కోల్‌కతా పంపించారు. మరోవైపు.. ఆదివారం సాయంత్రం 6.51 గంటలకు ఢిల్లీ నుంచి వడోదరకు బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని ల్యాండింగ్ గేర్‌లో సమస్య కారణంగా 7.20 గంటలకు తిరిగి ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు.

సైప్రస్‌లో తుర్కియేకు మోదీ గట్టి సందేశం

» త్వరలో ఈయూ కౌన్సిల్ బాధ్యతలు చేపట్టనున్న సైప్రస్

» భారత్‌కు పలు అంశాల్లో అనుకూలం

న్యూఢిల్లీ, నికోసియా(సైప్రస్), జూన్ 16 : ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ పర్యటన దానికి పొరుగు దేశం తుర్కియేకు గట్టి సందేశమేనని విశ్లేషకుల అంచనా. 1974లో ఆ దేశంలోని మూడోవంతు భాగాన్ని తుర్కియే ఆక్రమించుకొంది. అప్పటి నుంచి ఆ రెండు దేశాల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. అంతేగాక భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే పాకిస్థాన్‌కు అండగా నిలిచింది. అదే సమయంలో సైప్రస్ భారత్‌కు మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత ప్రధాని సైప్రస్ పర్యటన అర్థవంతమైనదిగానే విశ్లేషకులు భావిస్తున్నారు. సైప్రస్ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడలిడీస్ ఆహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ 100 మంది అధికారుల బృందంతో ఆ దేశ పర్యటనకు వెళ్లడం విశేషం. ఈ పర్యటన వ్యూహాత్మకంగా, దౌత్యపరంగా, ఆర్థికంగా, ప్రపంచ రాజకీయాల కోణంలోనూ కీలకమైనదిగా భావిస్తున్నారు. 2026లో సైప్రస్ యూరోపియన్ యూనియన్(ఈయూ) కౌన్సిల్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనతో భారత్-ఈయూల మధ్య వాణిజ్యం, భద్రత అంశాల్లో మరింత మెరుగైన సహకారం పెంపొందేందుకు ఆ దేశం కృషి చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ దేశ అత్యున్నత పురస్కారం "గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ మెకరియోస్-3"ని ప్రదానం చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న నిజమైన స్నేహానికి ఈ పురస్కారం నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. రెండు దేశాల సంబంధాలు మరింత ఉన్నత స్థాయికి చేరతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మన అణ్వస్త్రాలు పెరుగుతున్నాయ్

» ఈ ఏడాది 180కి చేరే అవకాశం

» పాకిస్థాన్ వద్ద 170 వార్‌హెడ్లు

» ఏడాదికి వంద సిద్ధం చేస్తున్న చైనా

» స్టాక్‌హోం రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 16: భారత్ గతేడాది తన అణ్వస్త్రాలను స్వల్పంగా పెంచుకోవడంతోపాటు వినూత్న అణు సరఫరా వ్యవస్థల అభివృద్ధిని కొనసాగిస్తోంది. ప్రస్తుతం దాని వద్ద 172 అణ్వస్త్రాలు ఉన్నాయని.. ఈ ఏడాది వాటి సంఖ్య 180కి చేరుకుంటుందని స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధక సంస్థ (సిప్రీ) అంచనా వేసింది. ప్రపంచ దేశాలు మోహరించిన వార్‌హెడ్లు.. వాటి సైన్యాల అమ్ములపొదిలో ఎన్ని అణ్వస్త్రాలు ఉన్నాయో సోమవారం తన నివేదికలో తెలిపింది. భారత్ సరికొత్తగా కంటైనర్‌లలో ఉండే తర్వాతి తరం క్షిపణులను అభివృద్ధి చేస్తోందని.. వాటిలో సదరు క్షిపణులకు ముందే అణు వార్‌హెడ్లను మరింత సురక్షితంగా అమర్చే సౌకర్యం ఉంటుందని పేర్కొంది. 'తర్వాతి తరం నూతన డెలివరీ ప్లాట్‌ఫాంలలో అగ్ని ప్రైమ్ (అగ్ని-పీ) క్షిపణి, మల్టీ ఇండిపెండెంట్‌లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సామర్థ్యం కల అగ్ని-5 క్షిపణి వ్యవస్థ ఉన్నాయి. అగ్ని సిరీస్ క్షిపణుల్లో అగ్ని-5 అత్యంత అధునాతనమైనది. దీని టార్గెట్ రేంజ్ వెయ్యి కిలోమీటర్ల నుంచి 2 వేల కిలోమీటర్లకు ఉంటుంది' అని తెలిపింది. మరోవైపు.. పాకిస్థాన్ కూడా ఈ ఏడాది తన అణు వార్‌హెడ్ల సంఖ్యను 170కి పెంచుకోవాలని నిర్ణయించిందని 'సిప్రీ' వెల్లడించింది.'అణుసంబంధ మిలిటరీ మౌలిక వసతులపై దాడులకు మూడో వ్యక్తులిచ్చే తప్పుడు సమాచార వ్యాప్తి కూడా తోడైతే సంప్రదాయ యుద్ధం అణుసంక్షోభంగా మారుతుంది' అని సిప్రీ సీనియర్ పరిశోధకుడు మ్యాట్ కోర్డా హెచ్చరించారు. చైనా అతివేగంగా అణు వార్‌హెడ్లను తయారుచేస్తోందని సిప్రీ తెలిపింది. అమెరికా, రష్యాలతో పోటీపడుతూ.. ఏడాదికి వంద చొప్పున సిద్ధం చేస్తోందని.. ఈ ఏడాది మరో వంద తయారీలో నిమగ్నమైందన్నది. గత జనవరికల్లా 350 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను (ఐసీబీఎం) నిల్వచేసే భూగర్భ కేంద్రాలను పూర్తిచేసిందని పేర్కొంది. అమెరికా, రష్యా వద్ద ఉన్న అణు వార్‌హెడ్లలో మూడోవంతు మాత్రమే చైనా వద్ద ఉండటంతో 2035కల్లా 1,500 వార్‌హెడ్ల తయారీ లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. గత జనవరికల్లా ప్రపంచ దేశాల వద్ద 12,241 వార్‌హెడ్లున్నాయని తెలిపింది. అయితే సిప్రీ నివేదికపై స్పందించేందుకు నిరాకరించిన చైనా.. ఏటా వంద వార్‌హెడ్లు తయారుచేస్తున్నా.. కని ష్ఫంగానే తన ఉత్పత్తి ఉందని పేర్కొంది. అమెరికా, రష్యాలతో అణు రే సులో లేమని స్పష్టంచేసింది. తమ అణ్వస్త్ర కార్యక్రమం పూర్తిగా ఆత్మరక్షణకేనని చైనా విదేశాంగ ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు.

సింధూపై భారీ జల ప్రణాళిక

» పాక్‌కు పోతున్న మిగులు జలాలకు చెక్

» సీరియస్‌గా అధ్యయనం చేస్తున్న భారత్

న్యూఢిల్లీ, జూన్ 16 : పూర్తి స్థాయిలో సింధూనదీలోని తన వాటా జలాల వినియోగానికి భారత్ భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. జమ్మూకశ్మీర్ గుండా పాక్‌కు పోతున్న మిగులు జలాలను 113 కిమీ పొడవైన కాలువ ద్వారా పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లకు మళ్లించాలని యోచిస్తోంది. కాలువ నిర్మాణ సాధ్యాసాధ్యాలపై కేంద్రం లోతుగా అధ్యయనం చేస్తోందని ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. పాక్‌కు సింధూజలాలను నిలిపివేస్తున్నట్టు పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సింధూ నదీజలాల మళ్లింపు ప్రణాళికను మోదీ ప్రభుత్వం సిద్ధం చేస్తున్నదని ఆ కథనం పేర్కొంది. సింధూ పరివాహకంలోని చినాబ్‌ను రావి-బియాస్-సట్లెజ్‌తో ఈ కాలువ అనుసంధానిస్తుందని శనివారం బీజేపీ శిక్షణా శిబిరంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సూచనప్రాయంగా వెల్లడించారు. జమ్మూకశ్మీర్ నుంచి పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌ల్లో గల కాలువలను కలుపుకుంటూ కొత్త కాలువ నిర్మాణం చేపడతారు. అంతిమంగా రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ కాలువ వ్యవస్థతో అనుసంధానిస్తారు. దీనికోసం బ్యారేజ్‌లు, టన్నెళ్లు నిర్మిస్తారు. రణబీర్ కాలువను డబుల్ చేస్తూ 60 కిమీ నుంచి 120 కిమీకు విస్తరిస్తారు. కథువా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉజ్ బహుళార్థ సాధక ప్రాజెక్టును పునరుద్ధరిస్తారు. ఉజ్‌కు దిగువన రెండో రావి-బియాస్ లింక్‌ను గతంలో తలపెట్టారు. పాకిస్థాన్‌లోకి ప్రవహించే మిగులు రావి జలాలను ఆపటం అప్పట్లో దీని లక్ష్యం. దీనిని కూడా కాలువ నెట్‌వర్క్‌లో అంతర్భాగం చేయాలని తాజాగా యోచిస్తున్నారు. దీనికోసం ఒక బ్యారేజ్, టన్నెల్‌ను నిర్మించి.. బియాస్ నదీ బేసిన్‌కు జలాలను మళ్లిస్తారు. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో పాకల్ దల్ ప్రాజెక్టును తలపెట్టింది. రెటిల్ (850మెగావాట్లు), కిరూ (624 మెగావాట్లు) క్వార్ (540 మెగావాట్లు) ప్రాజెక్టులను చేపడుతోందని ఆ కథనం తెలిపింది.

25 ఏళ్లు పూర్తి చేసుకున్న 'సెర్ప్'

» భాగస్వాములైన మహిళలకు, ఉద్యోగులకు సీఎం అభినందనలు

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తన చేతుల మీదుగా పురుడుపోసుకున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సెర్ప్‌లో భాగస్వాములైన మహిళలకు.. ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. 'సరిగ్గా పాతికేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు అనే ఒక మారుమూల ప్రాంతంలో వెలుగు అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాను. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల ఆర్థికాభివృద్ధిని సాధించడమే నాటి ప్రాజెక్టు లక్ష్యం. అది కాలక్రమంలో సెర్ప్‌గా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి లక్షలాది గ్రామీణ మహిళల జీవితాల్లో, వేలాది గ్రామాల్లో నిరంతరం అభివృద్ధి వెలుగులు నింపుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనకు సెర్ప్ నిరంతరం కృషి చేస్తోంది. సెర్ప్ కార్యకలాపాల్లో భాగస్వాములవుతూ.. నవ సమాజ నిర్మాతలై గ్రామీణ పేదరిక నిర్మూలనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్న గ్రామీణ మహిళలకు.. వారిని ప్రగతిపథంలో నడిపిస్తున్న సెర్ప్ ఉద్యోగులకు 25 ఏళ్ల పండుగ సందర్భంగా అభినందనలు' అని సీఎం పేర్కొన్నారు.

యోగాంధ్రకు మున్సిపల్ అధికారుల డిప్యుటేషన్

యోగాంధ్ర 2025 కార్యక్రమానికి పలువురు మున్సిపల్ అధికారులను డిప్యుటేషన్‌పై నియమిస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. విజయవాడ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు హెచ్‌ఎం ధ్యానచంద్ర, పి.శ్రీనివాసులు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం ఆర్‌డీఎంఏలు వరరవీంద్ర, నాగ నరసింహారావులతోపాటు మరో 10 మంది నాన్ కేడర్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించింది.

13 మంది పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు బదిలీ

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 13 మంది ప్రిన్సిపాళ్లను బదిలీ చేస్తూ నైపుణ్యాభివృద్ధి శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

రేషన్ బియ్యం..
డీలర్లకు 'తరుగు'... పైవారికి 'మెరుగు'!



ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఆగని అక్రమాలు.. కొనసాగుతున్న జగన్ జమానా ముచ్చట

» 50 కిలోల బస్తాలో 2-3 కేజీల తగ్గుదల
» ప్రతినెలా 60 వేల క్వింటాళ్లు పక్కదారి
» ముడుపులు పిండుకుంటున్న అధికారులు
» తూకం లేకుండానే షాపులకు తరలింపు
» అడిగితే బెదిరింపులు.. తర్వాత వేధింపులు
» నష్టాలను భరించలేమంటూ డీలర్లు గగ్గోలు

పౌరసరఫరాల సంస్థ పేదలకు పంపిణీ చేసే బియ్యంలో అవినీతి రాళ్లు తగులుతున్నాయి. రేషన్ డీలర్లకు వచ్చే బియ్యం బస్తాల్లో ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్దే ఒక్కొక్క దాని నుంచి 2-3 కిలోలు నొక్కేస్తున్నారు. బియ్యాన్ని కాటా వేయకుండా నేరుగా డీలర్లకు పంపేస్తున్నారు. నొక్కేసిన బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి మిల్లర్లకు చేరి.. నగదు రూపంలో అధికారుల జేబుల్లోకి మళ్లుతుండగా, బియ్యం తరుగు కారణంగా డీలర్లు లబోదిబోమంటున్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"రాష్ట్రంలో రేషన్ పంపిణీ విధానాన్ని సమీక్షించి.. పౌరసరఫరాల వ్యవస్థను పటిష్ఠం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు హామీ ఇచ్చాం. దీనిని నిలబెట్టుకుంటూ జూన్ 1 నుంచి మళ్లీ రేషన్ దుకాణాలు ప్రారంభించాం. రేషన్ పంపిణీలో ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా డీలర్లు పారదర్శకంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి" ..పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 3న విజయవాడలో రేషన్ షాపుల తనిఖీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలివి. కానీ, క్షేత్రస్థాయిలో 'పారదర్శకత' మాత్రం నేతిబీర చందంగా మారింది. కీలకమైన ఎంఎల్‌ఎస్ పాయింట్లు అక్రమాలకు అడ్డాగా మారాయి. జగన్ హయాంలో జరిగిన అక్రమాలే కొనసాగుతున్నాయి.

ఏం జరుగుతోంది?

ఒక రేషన్ షాపు పరిధిలో 400 కార్డులు ఉంటే.. ఒక్కో కార్డులో సగటున నలుగురు చొప్పున 1,600 మంది లబ్ధిదారులు ఉంటారు. ఒక్కో లబ్ధిదారునికి 5 కిలోలు చొప్పున 80 క్వింటాళ్ల బియ్యం అవసరం. మండలస్థాయి గోడౌన్ నుంచి 80 క్వింటాళ్ల బియ్యం బస్తాలను తూకం వేయకుండా రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు. వీటిలో తరుగు 150 నుంచి 200 కేజీల వరకు వస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత భారీస్థాయిలో తరుగు వస్తుంటే కార్డుదారులకు ఖచ్చితమైన తూకంతో రేషన్ బియ్యం పంపిణీ చేయడం ఎలా సాధ్యం? ఈ భారీ లోటును భర్తీ చేసుకోవాలంటే రేషన్ డీలర్లు తూకాల్లో అక్రమాలకు పాల్పడాల్సిందే కదా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

పాయింట్లలోనే పట్టు తప్పింది!

రాష్ట్రంలో ప్రజాపంపిణీ అవసరాల కోసం ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తారు. ఆ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి, బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థకు అందిస్తారు. ఈ బియ్యాన్ని అన్ని జిల్లాల్లో ఉన్న గోడౌన్లలో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి ప్రతి నెలా ప్రజా పంపిణీ కోసం స్టేజ్-1 రవాణా కాంట్రాక్టర్ల ద్వారా తొలుత ఎఫ్‌సీఐ గోడౌన్లకు, అక్కడ నుంచి మండల స్థాయి గోడౌన్ల(ఎంఎల్‌ఎస్ పాయింట్ల)కు తరలిస్తారు. ఈ రెండు చోట్లా తూకం వేసిన తర్వాత స్టేజ్-2 కాంట్రాక్టర్ల ద్వారా బియ్యాన్ని రేషన్ షాపులకు తరలించాలి. కానీ, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు తూకం వేయకుండా బియ్యాన్ని రేషన్ షాపులకు తరలిస్తున్నారు. దీంతో 50 కేజీల బియ్యం బస్తాలో 2 నుంచి 3 కేజీలు తక్కువగా ఉంటున్నాయని డీలర్లు వాపోతున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తప్పనిసరిగా తూకం వేసిన తర్వాతే రేషన్ దుకాణాలకు బియ్యాన్ని తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే ఈ తరుగు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని చెబుతున్నారు.

నేరుగా రీసైక్లింగ్‌కు..

రాష్ట్రంలో సుమారు 30 వేల రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు ప్రతినెలా బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి వస్తున్న తరుగు సగటున 2 క్వింటాళ్ల చొప్పున లెక్కిస్తే.. ప్రతినెలా 60 వేల క్వింటాళ్ల బియ్యం తరుగు రూపంలో పక్కదారి పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంఎల్‌ఎస్ పాయింట్లలోనే జరుగుతున్న ఈ అక్రమాల వ్యవహారం వైసీపీ పాలించిన ఐదేళ్లలోనే వ్యవస్థీకృతమైందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై డీలర్లు అనేకసార్లు పౌరసరఫరాలశాఖ కమిషనర్ దృష్టికి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీకి ఫిర్యాదులు చేసినా ఫలితం కనిపించలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదని డీలర్లు వాపోతున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో బహిరంగంగా జరుగుతున్న బియ్యం దోపిడీపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు సైతం వెనకాడుతున్నారని చెబుతున్నారు. ఎంఎస్‌ఎల్ పాయింట్లలో పనిచేస్తున్న అధికారుల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు నెలావారీ ముడుపులు అందుతున్నాయని ఆరోపిస్తున్నారు. కనీసం తనిఖీలు లేకుండా పెద్దఎత్తున లాబీయింగ్ జరుగుతోందని చెబుతున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తరుగు రూపంలో మిగుల్చుకుంటున్న బియ్యాన్ని దళారుల ద్వారా వ్యాపారులకు ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఆ రేషన్ బియ్యం తిరిగి మిల్లర్ల వద్దకే చేరుతుండటంతో మిల్లర్లు వాటిని రీసైక్లింగ్ చేసి బహిరంగ మార్కెట్లో కిలో రూ.24 నుంచి రూ.28 వరకు అమ్ముకుంటున్నారు. రెండోసారి పాలిష్ పట్టిన పీడీఎస్ బియ్యమే పోర్టుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారని చెబుతున్నారు. తద్వారా అక్రమార్కులు రూ.కోట్లలో కూడబెట్టుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

రూ.1000 కూడా మిగలట్లేదు!

ప్రభుత్వం ఇచ్చే కమీషన్ కోసం పని చేస్తున్న తమ ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారిపోతోందని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. రేషన్ సరకుల అమ్మకాల ద్వారా తమకు నెలకు సరాసరిన రూ.7 వేలు వస్తుందని చెబుతున్నారు. అయితే, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తూకం వేయకుండా బియ్యం ఇవ్వడం వల్ల అమ్మకాలు మొదలు పెట్టకుండానే తరుగు రూపంలో రూ.2 నుంచి రూ.3 వేలు నష్టపోతున్నామని చెబుతున్నారు. ఫలితంగా షాపు అద్దెలు, కరెంటు బిల్లులు పోను నెలకు రూ.500 నుంచి రూ.1000 కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ఎలా బతకాలని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో డీలర్ల బయోమెట్రిక్ తీసుకుని వారి సమక్షంలోనే తూకం వేసి బియ్యాన్ని రేషన్ షాపులకు పంపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు ప్రయత్నించిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

రూ.మూడు లక్షలు ఇచ్చి.. ఎకరం కొట్టేశాడు

» గుంజుకున్న వడ్డీలకు ఇది అదనం.. ప్రశ్నిస్తే బెదిరింపులు
» దిక్కుతోచక రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం
» బాపట్ల పోలీసు కార్యాలయం ఎదుట ఘటన

బాపట్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆ రైతుకు రూ.మూడు లక్షలు అప్పుగా ఇచ్చాడు. దానికి వడ్డీ మీద వడ్డీలు వసూలు చేశాడు. అదీ సరిపోక... రైతును మోసగించి ఎకరం రొయ్యల చెరువును రాయించేసుకున్నాడు. ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో దిక్కుతోచని ఆ కుటుంబం సోమవారం బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే... నిజాంపట్నం మండలం హరిస్‌పేటకు చెందిన కొపనాతి శ్రీనివాసరావుకు రెండెకరాల రొయ్యల చెరువు ఉంది. అతను పాతహరిస్‌పేటకు చెందిన మోపిదేవి పోతురాజు దగ్గర రూ.మూడు లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పునకు పోతురాజు వడ్డీల మీద వడ్డీలు వసూలు చేశాడు. అంతేగాకుండా 'నేనొక పొలం కొన్నాను. రిజిస్ట్రేషన్ ఉంది. సాక్షి సంతకం పెట్టాలి' అని నమ్మించి శ్రీనివాసరావును తీసుకెళ్లాడు. తీరాచూస్తే శ్రీనివాసరావుకు ఉన్న రెండెకరాల రొయ్యల చెరువులో ఒక ఎకరాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నాడు. ఈ భూమిని కొద్దిరోజుల తర్వాత మరొకరికి అమ్మేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన శ్రీనివాసరావు.. పోతురాజును ప్రశ్నిస్తే.. తనకు ఇవ్వాల్సిన డబ్బుల కింద చెరువు రాయించుకున్నానని చెప్పాడు. గట్టిగా అడిగితే చంపుతానని బెదిరించాడని శ్రీనివాసరావు భార్య ఝాన్సీ తెలిపారు. తమకు మిగిలిన ఎకరం చెరువు దగ్గరకు కూడా వెళ్లనీయకుండా దుర్భాషలాడుతూ, కొట్టడానికి వస్తున్నాడని, మురుగు కాల్వ కట్టమీద కూడా నడవనీయటం లేదని వాపోయింది. తమను ఇబ్బందులకు గురిచేయటమే కాకుండా అడవులదీవి పోలీసుస్టేషన్‌లో కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడని చెప్పారు. దీంతో దిక్కుతోచక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. వారి ఆత్మహత్యాయత్నాన్ని పోలీసులు అడ్డుకుని, ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్పీ తుషార్ డూడి తీవ్రంగా స్పందించారు. శ్రీనివాసరావు కుటుంబానికి ఎస్కార్ట్ ఇచ్చి రేపల్లె రూరల్ సీఐ దగ్గరకు పంపించారు. నిజాంపట్నం తహసీల్దార్‌తో కలిసి గ్రామానికి వెళ్లి.. విచారణ జరిపి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు.

రేపు సెప్టెంబరు నెల ఆర్జితసేవల కోటా విడుదల

తిరుమల, జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి సెప్టెంబరు నెల లక్కీడిప్ కోటాను టీటీడీ బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి కోసం భక్తులు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో సేవలు పొందిన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నంలోపు టికెట్ సొమ్ము చెల్లించి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇక, 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవ టికెట్లను విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి టోకెన్లు జారీ చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలోని వసతి గదుల కోటాను విడుదల చేస్తారు. 25న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారిసేవ, పరకామణిసేవ, నవనీతసేవ, గ్రూప్ సూపర్‌వైజర్ల సేవల ఆగస్టు నెలా కోటాను విడుదల చేయనున్నారు. కాగా, గడిచిన మూడురోజుల్లో తిరుమల శ్రీవారిని 2.57 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ మూడురోజుల్లో రూ.12.25 కోట్ల హుండీ ఆదాయం లభించగా, 1,15,947 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

టీటీడీ ప్రతిష్ఠ పెంచేలా ఢిల్లీ ఎస్వీ కళాశాల నిర్వహణ

» టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జూన్16(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రతిష్ఠను మరింత పెంచేలా ఢిల్లీలోని శ్రీవేంకటేశ్వర కళాశాలను నిర్వహించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో ఈవో శ్యామలరావు, గవర్నింగ్ బాడీ సభ్యులతో సోమవారం 155వ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్వీ కళాశాల గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు ఎంపికయ్యారు. అనంతరం దాదాపు 39 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ కళాశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు.

నేడు టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం

తిరుమలలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి అత్యవసర సమావే శం జరుగనుంది. న్యాయపరమైన వివిధ అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.

ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున పరిహారం: అచ్చెన్న

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గుల్లదామోదర గ్రామానికి చెందిన నాగిడి రాము, సంగమేశ్వరం గ్రామానికి చెందిన తమ్ము పోతురాజు వేటకు వెళ్లి, అంతర్వేది వద్ద బోటు నుంచి జారిపడి చనిపోయారు. ఈ ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు.

నేడు కొల్లేరుకు సాధికార కమిటీ

» రెండ్రోజులు వాస్తవ పరిస్థితుల అధ్యయనం.. అనంతరం సుప్రీంకోర్టుకు నివేదిక

ఏలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సులో ఆక్రమణలకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను పరిశీలించి సుప్రీంకోర్టుకు నివేదించేందుకు సాధికార కమిటీ రానుంది. కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మంగళ, బుధవారాల్లో పర్యటించి.. కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలున్నాయి, జిరాయితీ భూములు, డి-ఫారం పట్టా భూములు ఎంత మేర విస్తీర్ణంలో ఉన్నాయి, వాటి స్థితిగతులేమిటి, ప్రజల అవసరాలు, వారు కోరుకుంటున్నదేమిటి, 2006లో జరిగిన కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఇప్పటి వరకు నెలకొన్న పరిస్థితులపై స్వయంగా అధ్యయనం చేస్తుంది. కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలు, సరస్సు పరిరక్షణకు ఇప్పటి దాకా తీసుకున్న చర్యలను కూడా తెలుసుకుంటారు. మానవీయ కోణంలో స్థానికుల అభ్యర్థనలను, సూచనలను కూడా స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలోనే కొల్లేరు ప్రాంత వాసులతో గడిచిన పక్షం రోజులుగా క్షేత్రస్థాయిలో ఏయే సమస్యలు కమిటీ దృష్టికి తీసుకెళ్లాలి.. రాతపూర్వక అభ్యర్థనలు అందజేసే ప్రక్రియపై స్థానికులు ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించారు. గత రెండు దశాబ్దాల కాలంలో కొల్లేరు నుంచి తరచూ వలస వెళ్లే పరిస్థితి నెలకొనడాన్ని సాధికార కమిటీ ముందుకు తీసుకెళ్లబోతున్నారు. ఇంకోవైపు.. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఉంగుటూరు ఎమ్మెల్యే వత్సవాయి ధర్మరాజు, కైకలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌లతో కలిసి ఆయా ప్రాంతాలను సోమవారం సందర్శించారు. కమిటీ బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష నిర్వహించడమే కాకుండా.. ప్రజాప్రతినిధులు, స్థానికుల నుంచి విజ్ఞాపనలు కూడా స్వీకరిస్తుందని కలెక్టర్ వెల్లడించారు. పరిశీలన అనంతరం కమిటీ సర్వోన్నత న్యాయస్థానానికి తన నివేదిక సమర్పించనుంది.

కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కైవసం

» ఒక్క ఓటు తేడాతో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక
» హైకోర్టు తీర్పుతో ముగిసిన మున్సిపాలిటీ వివాదం



ప్రమాణస్వీకారం చేస్తున్న టీడీపీ నేత చిట్టిబాబు

ఇబ్రహీంపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగిన మూడున్నరేళ్ల తర్వాత సోమవారం హైకోర్టు నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లోని ఫలితాలను ఎన్నికల అధికారి, విజయవాడ ఆర్డీవో కె. చైతన్య టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల సమక్షంలో చదివి వినిపించారు. హైకోర్టు నుంచి వచ్చిన తీర్పు ప్రకారం 2021లో నాటి విజయవాడ ఎంపీ కేశినేని నాని ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో వేసిన ఓటుతో టీడీపీ చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబుకు 16 ఓట్లు వచ్చాయి. నాటి వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో వేసిన ఓటుతో వైసీపీ చైర్మన్ అభ్యర్థికి 15 ఓట్లు వచ్చాయి. దీంతో చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబు ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. అలాగే, వైస్ చైర్మన్లుగా టీడీపీకి చెందిన కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావుకు ఒక ఓటు చొప్పున మెజారిటీ వచ్చింది. దీంతో చైర్మన్ సహా ఇద్దరు వైస్ చైర్మన్లకు నియామక పత్రాలు అందించి ప్రమాణస్వీకారం చేయించారు. మూడున్నరేళ్ల నిరీక్షణ అనంతరం కొండపల్లి మున్సిపాలిటీని టీడీపీ దక్కించుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్ గార్గ్

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి కేతన్ గార్గ్‌ను నియమిస్తూ సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కేతన్ గార్గ్ రాజమండ్రి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన బదిలీ కావడంతో రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యతలను తూర్పు గోదావరి కలెక్టర్‌కు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటి పనులకు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు!

» ఓ ఉన్నతాధికారి నిర్వాకం.. చెప్పుకోలేక బాధితుల సతమతం

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో ఓ ఉన్నతాధికారి అధికారదర్పం అంతా ఇంతా కాదు! స్టేషన్లలో పనిచేయాల్సిన ఎక్సైజ్ కానిస్టేబుళ్లను తన ఇంట్లో పనులకు వినియోగించుకొనేంత! ఈ అంశం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కానిస్టేబుళ్లను ఇంటి పనులకు ఉపయోగించుకోవడమే తప్పు అయితే.. అందులోనూ సరిగా పనిచేయడం లేదని వేధింపులకు కూడా గురిచేస్తున్నట్లు తెలిసింది. ఆ ఉన్నతాధికారి ఏకంగా ఆరుగురు కానిస్టేబుళ్లను తన ఇంట్లో వ్యక్తిగత పనుల కోసం అనధికారికంగా పెట్టుకున్నారు. విజయవాడ, గన్నవరం ఎక్సైజ్ స్టేషన్లకు చెందిన ఆ కానిస్టేబుళ్లకు వాటినే అధికారిక విధులుగా మార్చారు. నలుగురు అయితే గత ఆర్నెల్లుగా పూర్తిగా ఇంటి పనులకే పరిమితం కాగా.. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. మరో ఇద్దరితో ప్రత్యామ్నాయ రోజుల్లో పనిచేయించుకొంటున్నారు. దీనిపై కానిస్టేబుళ్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారి కావడంతో ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

దాసరి కుల సర్టిఫికెట్‌లో 'భిక్షాటన' తొలగింపు

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీసీ ఏ-సీరియల్ నం.6లో ఉన్న దాసరి కులానికి సంబంధించి కుల ధ్రువీకరణ పత్రంలో ఇక నుంచి బ్రాకెట్‌లో పూర్వం భిక్షాటన/బెగ్గర్ అనే పదం వాడకుండా ఇవ్వాలని బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. దాసరి రిజర్వేషన్ పోరాట సమితి అభ్యంతరంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఈ మేరకు సవరణ ఉతర్వులు జారీ చేసింది.

ప్రత్యేకాధికారుల పదవీకాలం పొడిగింపు

రాజాం, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేకాధికారుల పదవీకాలాన్ని మరో ఆర్నెల్లు పొడిగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతోపాటు భీమవరానికి ప్రత్యేకాధికారిగా భీమవరం ఆర్డీఓను నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధోన్మాదం!

సత్వరమే ఆగనిపక్షంలో ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణ అన్ని హద్దులూ దాటే ప్రమాదం ఉంది. తనకు గొప్పలు చెప్పడం ఇష్టం ఉండదని అంటూనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోమారు ఇటీవలి భారత్-పాక్ ఘర్షణ ప్రస్తావన తెచ్చారు. తనమాట వినే ఈ రెండుదేశాలూ తక్షణమే దారికొచ్చాయనీ, అదేమాదిరిగా ఇరాన్-ఇజ్రాయెల్ కూడా ఒప్పందం కుదర్చుకోవాలనీ అన్నారు. అయితే, అది ఇప్పట్లో సాధ్యం కాదన్న సందేశం కూడా ఆయనే ఇచ్చేశారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇజ్రాయెల్ అతి దుర్మార్గంగా ఇరాన్‌లోకి చొరబడి సైనికస్థావరాలతో పాటు యురేనియం శుద్ధి కేంద్రాలను కూడా ధ్వంసం చేస్తే, ఇరాన్‌కు మంచిశాస్తి జరిగిందని, మరిన్ని దెబ్బలు తినాల్సివస్తుందని ట్రంప్ సమర్థించుకొచ్చారు. అమెరికా ఆశీస్సులూ అండదండలతోనే ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్ మీద విరుచుకుపడి, మరో కొత్తయుద్ధానికి తెరదీసిందన్నది వాస్తవం. ఇరాన్‌ను గాజా తరహాలో దుంపనాశనం చేసిన తరువాతే ఒప్పందాల సంగతని ట్రంప్ వ్యాఖ్యల్లో మర్మం.

యుద్ధం ఎంతకాలం సాగుతుందన్నది ఇరాన్ సైనికపాటవం మీద ఆధారపడివుంది. హమాస్ దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ అనేక పక్షాలతో ఏకకాలంలో యుద్ధం చేస్తూ వచ్చింది. అక్టోబర్ 7ఘటనకు ముందువరకూ ఇరాన్‌కు రక్షణకవచాల్లాగా వ్యవహరిస్తూవచ్చిన హమాస్, హిజ్బొల్లాలు ఇజ్రాయెల్ దెబ్బకు గట్టిగా ఎదురుదెబ్బతీయలేని స్థితికి జారుకున్నాయి. యెమెన్‌లో హౌతీలను బలహీనపరచడంలోనూ ఇజ్రాయెల్‌దే పైచేయి అయింది. గత ఏడాది ఏప్రిల్, అక్టోబర్‌లలో ఇరాన్‌మీద జరిపిన దాడి ఇజ్రాయెల్‌కు ఒక ట్రయల్‌రన్‌లాగా ఉపకరించిందని అంటారు. అయితే, అప్పుడూ ఇప్పుడూ కూడా ఇరాన్ జవాబు గమనించినప్పుడు దానిదగ్గర డ్రోన్లు, క్షిపణులు ఇత్యాది ఆయుధాలు దండిగానే ఉన్న విషయం అర్థమవుతోంది. అయితే, అవన్నీ హరించుకుపోయాక ఇరాన్ నిస్సహాయంగా చేతులెత్తేసి శత్రువుల ముందు సాగిలబడుతుందని ఎవరూ నమ్మడం లేదు. అమెరికా-ఇజ్రాయెల్ పరిభాషలో చెప్పాలంటే, నిరంకుశులైన ఇరాన్ పాలకులు అంత సునాయాసంగా దేశాన్ని అప్పచెబుతారనుకోలేం. అమెరికా సైనిక స్థావరాలమీద దాడులు చేసి దానిని యుద్ధబరిలోకి లాగి ఇస్లామిక్ దేశాలను ఇరుకునపెట్టే ప్రయత్నం కూడా పద్ధతి ప్రకారం జరగవచ్చు. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ప్రశ్నించనందుకు ఇప్పటికే ప్రజాగ్రహాన్ని చవిచూస్తున్న అమెరికా మిత్రదేశాలకు మరో కొత్త పరీక్ష మొదలవుతోంది.

ఇరాన్‌తో అణుఒప్పందం కోసం ఒకపక్క చర్చలు సాగుతూండగా, ఇజ్రాయెల్‌తో మరోపక్క దాడిచేయించి గొప్ప ఎత్తువేశానని ట్రంప్ అనుకొని ఉండవచ్చు. మెట్టుదిగేది లేదని ఇరాన్ పాలకులు భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నా, వారిని గద్దెదించేవరకూ వదిలేది లేదని ఇజ్రాయెల్ కూడా అంటోంది. అనేక అణుబాంబులు సిద్ధంచేయగల స్థితిలో ఉన్నదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరాన్, ఈ ఇజ్రాయెల్ దాడి తరువాత, వీసమెత్తు అవకాశం ఉన్నా అణుబాంబు తయారీని వదులుకోదన్నది వాస్తవం. అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు ఇరవై యేళ్ళ తరువాత ఒక్కసారిగా ఇరాన్ అతిభయంకరంగా ఎందుకు కనిపించిందో తెలియదు.

అణుబాంబులున్నాయన్న ఆరోపణతో, బ్రిటన్ వంటి తొత్తులను వెంటేసుకొని ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను కూల్చింది అమెరికా. ఇరాక్‌లో ప్రజారంజకమైన పాలనేమీ జరగడంలేదు కానీ, అమెరికా అనుకూల పాలనతో అమెరికా కంపెనీలు చక్కగా చమురు తోడుకుంటూ అప్పటి యుద్ధం లక్ష్యాన్ని నెరవేర్చుతున్నాయి. సద్దాం మరణానంతర పరిస్థితులు ఐసిస్‌వంటి ఉగ్రసంస్థల ఆవిర్భావానికి దోహదం చేసి, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించే పేరిట తమకు గిట్టని, తమ మాటవినని వారిని మట్టుబెట్టడం అమెరికాకు అలవాటే. ఖమేనీలను కూల్చి ఇరానియన్లకు అతిత్వరలో విముక్తి ప్రసాదిస్తానని నెతన్యాహూ వీరంగం వేస్తున్నారు. ఇరాన్ పాలకులను కూల్చడమంటూ జరిగితే, తదనంతరకాలంలో మిగతా ప్రపంచం ఏ కొత్త ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందన్నదే భయం. ఇజ్రాయెల్‌ను ప్రపంచపటం నుంచి చెరిపేస్తారన్న ఆరోపణతో ఇరాన్‌పాలకుల మీద విరుచుకుపడిన నెతన్యాహూ వరుస యుద్ధాలతో తన ఎజెండా కొనసాగిస్తూ ప్రపంచాన్ని కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. తాను యుద్ధవ్యతిరేకిననీ, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని యుద్ధాలనూ ముగించేస్తానని హామీ ఇచ్చిన ట్రంప్, పూర్తిభిన్నంగా కొత్తకుంపట్లు రగిలిస్తున్నారు.

చరిత్ర సృష్టించిన 'దౌత్య విజయం'

ప్రపంచంలో సుస్థిరమైన శాంతిని నెలకొల్పాలన్న పరమాశయంతో 'పంచశీలాలు' రూపొందించిన దేశం– భారత్. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ వ్యవహారాల శాఖను తన వద్దనే ఉంచుకొన్నారు. భారతదేశ సంప్రదాయాలు, చరిత్ర, తత్త్వశాస్త్ర విధానాలను విదేశాలకు తెలియజెప్పి సమభావం, పరస్పర సహకారంతో ప్రపంచ దేశాలతో భారత్ సహజీవనం చేయాలనుకొంటున్నట్లు నెహ్రూ పలు అంతర్జాతీయ వేదికలపై నుంచి చెప్పేవారు. ఇందుకు అనుగుణంగానే ఏ దేశానికీ అనుకూలం కాని తటస్థ వైఖరిని భారతదేశం అనుసరించింది. ఏ కూటమితోనూ పొత్తు కుదుర్చుకోకుండా తటస్థంగా ఉన్న దేశాలే ప్రపంచంలో శాంతి వాతావరణాన్ని సృష్టించగలవని ప్రధాని నెహ్రూ తరచుగా చెప్పేవారు.

తొలుత నెహ్రూ అనుసరించిన విదేశాంగ విధానం విమర్శల పాలైంది. అనివార్యంగా సాంకేతిక పరిజ్ఞానం కోసం సోవియెట్ రష్యాతో చెలిమి చేయాల్సి రావడం వల్ల చాలాకాలం అమెరికాలోని అధికార వర్గాలు భారతదేశం పట్ల విరోధభావాన్ని ప్రకటించాయి. అంతేకాకుండా శాంతికి, ప్రజాస్వామ్యానికి మరో రూపం అంటూ పాకిస్థాన్‌ను అమెరికా భుజాలకెత్తుకొని మోసింది. అయితే.. కెన్నెడీ అధ్యక్షుడయ్యాక భారత్ పట్ల అమెరికా వైఖరి క్రమంగా మారింది. భారతదేశం అనుసరించే తటస్థ వైఖరి శక్తివంతమైనదనీ, భారతీయులు ప్రచ్ఛన్నయుద్ధంతో సంబంధం పెట్టుకోకపోయినా శాంతికి, స్వాతంత్ర్యానికి బద్ధులై ఉంటారని జాన్.ఎఫ్.కెన్నడీతో సహా నాటి పలువురు దేశాధినేతలు భారత్ విదేశాంగనీతిని కొనియాడారు.

నెహ్రూ తర్వాత దేశానికి ప్రధానులైన లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ అదే పథాన్ని అనుసరించారు. ప్రపంచంలోని చిన్న దేశాలు, బలహీన దేశాలు, అభివృద్ధి చెందుతున్న తృతీయ దేశాలు.. తప్పనిసరిగా అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక సహాయం లేకుండా తమంతట తాముగా అభివృద్ధి చెందలేవు. కాబట్టి ఆనాడు మూడు శక్తివంతమైన పక్షాలుగా విడిపోయి ఉన్న ఉత్తర అమెరికా, యూరప్, సోవియెట్ యూనియన్ల సహాయ సహకారాలు పొందడం అవసరం. అయితే ఏదో ఒక పక్షంలో చేరితే, మిగతా రెండు పక్షాల నుంచి దూరం కావాల్సి వస్తుంది. కాబట్టి, తటస్థంగా ఉన్నప్పుడు ఆ పక్షాల మధ్య పరస్పరం ఉన్న వైరుధ్యాలకు సంబంధం లేకుండా ఈ దేశాలు అందరి సహాయ సహకారాలు పొందవచ్చునని 'పండిట్ నెహ్రూ' చేసిన సూత్రీకరణకు అనేక దేశాలు ఆమోదం తెలిపాయి. పండిట్ నెహ్రూ, నాటి ఈజిప్ట్ ప్రధాని నాసర్, నాటి యుగోస్లేవియా మార్షల్ టిటోల చొరవ కారణంగానే అలీన దేశాల కూటమి ఏర్పడింది. ఆ తర్వాత పలు దశాబ్దాల పాటు కూటమిలోని దేశాలు అన్ని పక్షాలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకొని, వాటి సహాయ సహకారాలతో అభివృద్ధి పథంలో ముందుకెళ్లాయి.



> నెహ్రూ వేసిన పునాదిపై తర్వాతి కాలంలో దేశ ప్రధానులుగా ఉన్నవారు, నేటి ప్రధాని నరేంద్ర మోదీ దేశ దౌత్య విధానాన్ని, విదేశీ వ్యవహారాలను ఎటువంటి రాజీధోరణి లేకుండా మరింత సుదృఢం చేయడం అభినందనీయం. ఇదేవిధంగా దేశంలో వివిధ రాజకీయ పార్టీల మధ్య కొన్ని కీలకాంశాలలో ఏకాభిప్రాయం కుదిరితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధిపథంలో దూసుకుపోగలదు.

నెహ్రూ అనుసరించిన విదేశాంగ విధానానికి సర్వత్రా ఆమోదం లభించింది. మొరార్జీదేశాయ్, ఆ తర్వాత మళ్లీ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, వి.పి. సింగ్, పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజపేయి నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అనుసరించే విదేశాంగ నీతిలో పెద్దగా మార్పులేదు. వారందరూ కూడా నెహ్రూ బాటలోనే తటస్థ వైఖరినే అనుసరించారు. ఆ కారణంగానే నేడు భారత్ అన్ని దేశాలతో సవ్యమైన ఆర్థిక, వాణిజ్య, దౌత్య సంబంధాలను ఏర్పర్చుకోగలిగింది. కాగా, దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లిన పరిస్థితులలో రాజకీయాలకు అతీతంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావడం కూడా గతం నుంచి వస్తోంది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సి వచ్చినపుడు దేశం యావత్తూ ఒక్క గొంతుకగా మారింది. రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావులు దేశ ప్రధానులుగా ఉండగా, యునైటెడ్ నేషన్స్ సదస్సులలో పాల్గొన్న భారత్ దౌత్య బృందానికి నాటి విపక్షనేత వాజపేయి నేతృత్వం వహించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా పాకిస్థాన్‌కు దగ్గరవ్వడానికి కృషి చేసినప్పుడు ఆయనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. అలాగే, కార్గిల్ యుద్ధం చేయాల్సి వచ్చినపుడు జాతి అంతా ఒక్కటైంది. స్వల్ప విభేదాలు మినహాయిస్తే.. పొరుగుదేశం పాకిస్థాన్ పాల్పడే క్రాస్‌బోర్డర్ టెర్రరిజంను ఖండించడంలో రెండో మాట లేకుండా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వారికి మద్దతు తెలుపుతున్నాయి.

తాజాగా, ప్రధాని నరేంద్రమోదీ పహల్గాం ఉదంతంలో 'ఆపరేషన్ సిందూర్' నిర్వహణకు దారితీసిన పరిస్థితులు; తదనంతరం మే 10న కాల్పుల విరమణ, ఒకవేళ మళ్లీ పాకిస్థాన్ కనుక భారత్‌లో ఉగ్రవాద చర్యలకు ఊతం ఇస్తే ఏ విధంగా జవాబు చెప్పాలనుకొంటుందో ప్రపంచ దేశాలకు వివరించేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటుచేసిన ఏడు అఖిలపక్షాల బృందాలను 33 దేశాలకు పంపడం.. భారత్ దౌత్యనీతిలో సాధించిన గొప్ప విజయం. ప్రారంభంలో అఖిలపక్ష బృందాల కూర్పులో వివిధ రాజకీయ పార్టీల నడుమ అభిప్రాయబేధాలు పొడసూపినా, ఆ తర్వాత అన్నీ సర్దుకొని ప్రభుత్వం–ప్రజలు ఆశించిన లక్ష్యాలు నెరవేరడం విశేషం. భారత అఖిలపక్ష బృందాలు పర్యటించిన దేశాలలో కొన్ని పాకిస్థాన్ పాటపాడేవి కూడా ఉన్నాయి. అయితే, దేశ విభజన నాటి నుంచి నేటి వరకు పాకిస్థాన్ పాల్పడుతున్న ఉగ్రవాద చర్యలు, 1999లో కార్గిల్ ఉదంతం, 2001లో భారత పార్లమెంట్‌పై జరిగిన దాడి, కాందహార్ విమాన హైజాక్, 2008లో ముంబయి మారణకాండ మొదలుకొని 'యురి' ఉదంతం, పహల్గాం దుర్ఘటనతో సహా ఎప్పుడెప్పుడు భారత్‌పై పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిందో సమగ్రంగా వివరించారు.

ప్రధాని మోదీ ఈ చొరవ చూపడం ద్వారా రెండు విజయాలు సాధించారు. ఒకటి– ప్రపంచ దేశాలకు పాకిస్థాన్ ఉగ్రవాద రూపాన్ని బహిర్గతం చేసి అంతర్జాతీయంగా ఏకాకిని చేయడం. రెండు– మళ్లీ దాడి చేసే దుస్సాహసానికి ఒడిగడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పాకిస్థాన్‌కు గట్టిగా వార్నింగ్ ఇవ్వడం. భారత్ అఖిలపక్ష బృందాలకు నేతృత్వం వహించిన శశిథరూర్, బైజయంత్‌పాండా, అసదుద్దీన్ ఒవైసీ, కనిమొళి వంటివారు విదేశీ వేదికలపై ఎటువంటి శషభిషలు లేకుండా భారత్ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. ఉగ్రవాదంపై భారత్ జరిపే పోరాటానికి మద్దతుగా నిలుస్తామని రష్యా, జపాన్ వంటి దేశాలు విస్పష్టమైన హామీ ఇవ్వడం విశేషం.

'ఆపరేషన్ సిందూర్ ఉద్దేశాల్ని చాటిచెప్పి.. ఆయా దేశాల మద్దతు కూడగట్టడంలో మన ఎంపీలు సమర్థవంతంగా వ్యవహరించారు. దేశ భద్రత, సమగ్రతకు ముప్పు వాటిల్లే సమయంలో సంకుచిత రాజకీయాలకు తావులేదని వారు స్పష్టం చేశారు. భారత్ ఏనాడూ ఎవ్వరిమీద కాలు దువ్వలేదని, పైగా విపత్కర సమయాల్లో పొరుగు దేశాలకు అండగా నిలబడి సాయం చేసిన వైనాన్ని సమగ్రంగా వివరించారు.


నిజానికి, విదేశాంగ విధానంలో నెహ్రూ అవలంబించిన 'తటస్థత' కారణంగానే నేడు పాకిస్థాన్ మినహా అన్ని దేశాలతో.. వాటి మధ్యనున్న వైరుధ్యాలకు అతీతంగా భారత్ సన్నిహితం కాగలిగింది. వాటి సహాయ సహకారాలతో ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగగలుగుతోంది. 'భిన్నత్వంలో ఏకత్వమే మా బలం' అని భారత్ విశ్వవేదికలపై సగర్వంగా చాటుకోగలుగుతోంది. అయితే.. ఆనాడు నెహ్రూ వేసిన పునాదిపై.. తర్వాతి కాలంలో దేశ ప్రధానులుగా ఉన్నవారు, నేటి ప్రధాని నరేంద్రమోదీ దేశ దౌత్య విధానాన్ని, విదేశీ వ్యవహారాలను ఎటువంటి రాజీధోరణి లేకుండా మరింత సుదృఢం చేయడం అభినందనీయం. ఇదేవిధంగా దేశంలో వివిధ రాజకీయ పార్టీల మధ్య కొన్ని కీలకాంశాలలో ఏకాభిప్రాయం కుదిరితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోగలదు.

■ సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

ఉగ్రవాదం ఒక మతాన్ని మించినది!

భారత్ ఒక్కటే ఉగ్రవాద సమస్య ఎదుర్కొంటోందని, దీనికి హిందువులు అధికంగా బలవుతున్నారన్న ప్రచారం బలంగా ఉంది. వాస్తవానికి గణాంకాల ప్రకారం: ఉగ్రవాదం వల్ల మరణించినవారిలో అత్యధికులు ముస్లిం మతస్థులే, ఈ మరణాలు ఇండియాలో కంటే పాకిస్థాన్‌లోనే ఎక్కువ. పాకిస్థాన్‌లోని బెలూచిస్థాన్ వగైరా ప్రాంతాల్లోని 'ముస్లిం ఉగ్రవాదులు' పాకిస్థాన్ ప్రభుత్వంపై దాడి చేస్తున్నారు. ఇండియాలో కూడా ఉగ్రవాదం, దాని అణచివేత పేరుతో సాగిన కార్యకలాపాల వల్ల మరణించిన అత్యధికులు ముస్లింలే. నాగాలాండ్, అస్సాం, పంజాబ్, మణిపూర్ తదితరచోట్ల కొనసాగుతున్న ఉగ్రవాదానికీ ముస్లిం మతానికీ సంబంధం లేదు. లోగడ అస్సాంలోనూ, ఎల్‌టీటీఈ కాలంలో తమిళనాడులోనూ, నేడు మణిపూర్‌లోనూ ఉగ్రవాదుల్లో అత్యధికులు హిందువులే. కశ్మీర్‌లో నేటివరకూ లక్షమంది ప్రజలు చంపబడ్డారని అంచనా. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాలుగువేలమంది అని పార్లమెంటులో ప్రకటించారు. సంఖ్య ఎంతైనా, వీరిలో 90శాతం ముస్లింలే. భారత, పాకిస్థాన్ దేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్నీ, మతాన్నీ మేళవించి వాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకానీ, అది కేవలం హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలు సాగిస్తున్నది కాదన్నది సుస్పష్టం.

బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశం మతం ఆధారంగా గాక భాషాజాతులకు స్వయం నిర్ణయాధికారం ఉండే రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సింది, ఈ భాషాజాతులు ఐచ్ఛికంగా ఒక ప్రజాస్వామిక కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సింది. అలా జరిగివుంటే ఉపఖండంలో ఐక్యత, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, మతసామరస్యం పరిఢవిల్లేవి. పంజాబ్, బెంగాల్, కశ్మీర్లతో పాటు బహుజాతుల భారత్ ఐక్యంగా వుండి, కొనసాగి, బలపడేది. కానీ, జిన్నా వంటి ముస్లిం లీగ్ నాయకులూ, సావర్కర్ వంటి హిందుత్వశక్తులూ మతం ఆధారంగా ఉపఖండ ప్రజలు 'రెండు జాతుల' వారన్న అవాస్తవ, అశాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులూ, వారిపైన ఆధారపడిన ఉపఖండంలోని బడా పెట్టుబడిదారులు, ఫ్యూడల్ శక్తులూ ఈ సిద్ధాంతాన్ని స్వప్రయోజనాలకు వాడుకున్నారు. వారి కోసమే నెహ్రూ, పటేల్ తదితర నాటి కాంగ్రెస్ నాయకులూ దీన్ని ఆమోదించారు. అంతా కలిసి, మతప్రాతిపదికపై, భారత్ – పాకిస్థాన్ అనే రెండు రాజ్యాలను ఏర్పాటు చేసారు. ఈ రెండు రాజ్యాలలోని కశ్మీర్, బెంగాల్, పంజాబ్, ఈశాన్య భారత్ తదితర జాతుల ప్రజలు తమకు స్వయం నిర్ణయాధికారం/ స్వయం ప్రతిపత్తి కావాలని, లేదా రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనీ ఆనాటి నుండీ పోరాడుతూనే ఉన్నారు. ఈ ప్రజల పోరాటాలన్నింటినీ 'ఉగ్రవాదం' అని ముద్ర వేసి, పాశవికంగా అణచివేసే నిరంకుశ విధానాలు అమలు చేయడంవల్ల సమస్య పరిష్కారం కాదని అనుభవాలు చెబుతున్నాయి.



> ఇండియాలో కూడా ఉగ్రవాదం, దాని అణచివేత పేరుతో సాగిన కార్యకలాపాల వల్ల మరణించిన అత్యధికులు ముస్లింలే. నాగాలాండ్, అస్సాం, పంజాబ్, మణిపూర్ తదితరచోట్ల కొనసాగుతున్న ఉగ్రవాదానికీ ముస్లిం మతానికీ ఏ విధమైన సంబంధం లేదు. అయినప్పటికీ ఉగ్రవాదులంతా ముస్లింలేనని ప్రచారం సాగుతోంది.

దీనికితోడు అమెరికా, రష్యా అగ్రరాజ్యాల మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధం ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య బంగ్లాదేశ్ యుద్ధంగా పరిణమించింది. రష్యా అగ్రరాజ్యానికి లోబడిన విధానాలను భారత పాలకులు, అమెరికా అగ్రరాజ్యానికి లోబడిన విధానాలను పాకిస్థాన్ పాలకులు అనుసరించారు. ఆఫ్ఘనిస్థాన్‌పై రష్యా దురాక్రమణ, అమెరికా అక్కడ తన ప్రాబల్యంకోసం తాలిబాన్, అల్‌ఖైదా వంటి సాయుధశక్తులను పెంచిపోషించడం, దానికి పాకిస్థాన్‌ను వాడుకోవటం వంటి పరిణామాలు దక్షిణాసియాలో ఉగ్రవాదానికి ఆజ్యం పోసాయి. ఒకవైపు బంగ్లా యుద్ధంతో పాకిస్థాన్ విచ్ఛిన్నం, మరోవైపు స్వయం నిర్ణయాధికారం కావాలని పోరాడుతున్న కశ్మీర్ జాతిప్రజలపై భారత ప్రభుత్వ దమనకాండ, ఇస్లాం ఉగ్రవాదం అణచివేత పేరిట అమెరికా గ్లోబల్ యుద్ధం, దీనికి ఇండియా, పాక్ ఇరుదేశాల పాలకుల మద్దతు– వీటన్నిటి పర్యవసానంగా ఉగ్రవాదశక్తులూ, వాటికి పాకిస్థాన్ మద్దతూ బలపడుతూ వచ్చాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వారసత్వం కొనసాగిస్తూ, దక్షిణాసియాలో భారత పాలకులు అనుసరిస్తున్న విస్తరణవాద విధానాలు కూడా ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

కశ్మీర్‌లో స్వయం నిర్ణయాధికారం కోసం కశ్మీరీ పండిట్లు కూడా లోగడ ఉద్యమాల్లో పాల్గొన్నారు. తర్వాతి కాలంలో పాలకులు దాన్ని మతపరంగా మలచటానికి ప్రయత్నించారు. నిజానికి నాటి కశ్మీర్ రాజు "కేంద్రానికి మూడే అధికారాలు, కశ్మీర్ జాతి ప్రజలకే ఇతర అన్ని అధికారాలు" వుండే షరతుపై ఇండియాలో చేరటానికి సంతకం చేసారు. కనీసం ఆ మేరకైనా స్వయంప్రతిపత్తిని అమలు చేయాలని కశ్మీర్ ప్రజలు, శాసనసభ కోరుతుంటే అంగీకరించకుండా అణచివేత విధానాలనే కొనసాగిస్తుండటం వల్ల సమస్య జటిలమవుతోంది. కశ్మీర్ స్వయంప్రతిపత్తిని ఆచరణలో కాంగ్రెస్ పాలకులూ, ఆర్టికల్-370 రద్దు పేరుతో బీజేపీ పాలకులూ లాగివేయటం, కశ్మీర్‌ను మూడు ముక్కలుగా, కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించటం– ఇవన్నీ ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తున్నాయి.

భారత పాకిస్థాన్ దేశాల పాలకులు ఇరువురూ స్వతంత్రంగా చర్చల ద్వారా అన్ని సమస్యలకూ పరిష్కారం సాధించుకోవాలి. తన చైనా-వ్యతిరేక ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా, దక్షిణాసియాలో తన పట్టు, ప్రాబల్యం పెంచుకోవడానికి అమెరికా అనేక కుతంత్రాలు పన్నుతోంది. అటువంటి అమెరికా తోక పట్టుకుపోవడం నష్టదాయకం. ప్రజలు చారిత్రక వాస్తవాలను అవగాహన చేసుకుని, ఉగ్రవాదాన్ని మాత్రమే గాక, మతవిద్వేషం, జాతీయ దురహంకారం, యుద్ధోన్మాదాలను కూడా బలంగా వ్యతిరేకించాలి. అదే శాంతికీ, అభివృద్ధికీ దోహదం చేస్తుంది.

○ సిహెచ్.ఎస్.ఎన్. మూర్తి
ప్రధాన కార్యదర్శి, ఎఫ్.ఐ.టి.యు

తూర్పు కనుమలను కాపాడండి

తూర్పు కనుమలు ఉత్తరాంధ్ర జీవనాడి. ప్రస్తుతం ఈ కనుమలు ప్రమాదం అంచున ఉన్నాయి. అడవులను నరకడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఉత్తరాంధ్రకు నీటిని అందించే అనేక వాగులు, వంకలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తోంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం నడుం బిగించాలి. ఈ వాగు వంకల పరీవాహక ప్రాంతంలో చెట్లు లేకపోవడంతో వన్య మృగాలు, పలు జాతుల పక్షులు అంతరించిపోయాయి. గిరిజనులకు కూడా అడవి నుంచి వచ్చే ఫలసాయం తగ్గిపోయింది. కేవలం చింత, పనస వంటి అటవీ ఫలసాయం మాత్రమే ప్రస్తుతం గిరిజనులకు లభిస్తోంది. వీరికి ఆదాయం లేకపోవడంతో మనుగడ సమస్య ఏర్పడింది. వీరు ఇప్పుడు మైదానాలకు వలసపోతున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం ఒక సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలి.

ఉత్తరాంధ్రకు రాబోయే నీటి కొరతను తప్పించాలంటే ఆ వాగు వంకల ప్రవాహాల వెంట మనం అడవులను సృష్టించాలి. విస్తృతంగా పండ్ల మొక్కలను నాటాలి. స్థానికంగా ఉండే మొక్కలతో అడవులను పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడినవాళ్లం అవుతాము. కాఫీ ప్లాంటేషన్లకు నీడ కోసం వాడుతున్న సిల్వర్, ఓక్ వంటి విదేశీ జాతుల మొక్కల పెంపకాన్ని తగ్గిస్తే మంచిది. స్థానికంగా పెరిగే తెల్ల మద్ది, నల్ల మద్ది, మామిడి, జామ, ఉసిరి, చింత వంటి మొక్కల ద్వారా అడవులు పెంచి కాఫీ, మిరియాల వనాలను వృద్ధి చేయాలి. తద్వారా గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. జంతువులకు, పక్షులకు ఆహారమూ లభిస్తుంది. తూర్పు మన్యంలో నిమ్మ జాతి మొక్కలు విరివిగా పెరుగుతాయి. కాబట్టి నిమ్మ, నారింజ, బత్తాయి, కమల, పంపర పనస వంటి మొక్కలను పెంచాలి. మన్యంలో పండే రాజ్మా చిరుధాన్యాలు వంటి ఉత్పత్తులను కూడా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చవచ్చు. మిరియాలు, కాఫీ, పసుపు, పనస ఆధారంగా మనం విలువ జోడించే సముదాయాలను రూపొందించటం వల్ల వేలాది మంది గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. ఈ మన్యంలో పనస ఎక్కువగా పండేందుకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. అయితే పనస తక్కువగా పండే రాష్ట్రాల్లో పనస విలువ ఆధారిత ఉత్పత్తుల మీద ఎక్కువ ప్రయోగాలు జరుగుతున్నాయి. కానీ విస్తృతంగా పనస పండే తూర్పు మన్యంలో ఈ సౌకర్యాలు గానీ, శిక్షణ గానీ లేదు!

స్థానికంగా లభించే వెదురు, కలపతో వస్తువులు, బొమ్మలు తయారు చేయడం గిరిజనులకు నేర్పించాలి. ఇది వారికి ఆదాయాన్ని ఇస్తుంది. పండిన పంటకు విలువ జోడించడం మీద కూడా వారికి శిక్షణనివ్వాలి. వారు తరతరాలుగా ఆచరిస్తున్న కళలను ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఇలా పర్యావరణంపై దృష్టి పెట్టడం ద్వారా నాలుగైదు సంవత్సరాల్లోనే తూర్పు మన్యాన్ని దట్టమైన అడవిగా, వర్షాన్ని గ్రహించే మంచి వనాలుగా మార్చవచ్చు. గిరిజనులున్న భూముల్లో అడవులతో పాటు వ్యవసాయ పర్యాటకాన్ని రూపొందించవచ్చు. ఇప్పటికే ఉన్న పర్యాటకానికి ఈ వ్యవసాయ పర్యాటకం ఊతం ఇస్తుంది. కొత్తగా ఉపాధి అవకాశాలు సృష్టించడానికీ వీలు కలుగుతుంది.

– ఆకుల చలపతిరావు
నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

న్యాయ నిష్పాక్షికతపై నీడలు!

దేశ సర్వోన్నత న్యాయస్థానంలోనూ, వివిధ హైకోర్టుల్లోనూ పనిచేసిన ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత ఏం చేయాలీ ఏం చెయ్యకూడదు అనేదానిపై ఈ మధ్య దేశవ్యాప్తంగా విస్తృత చర్చ సాగుతున్నది. భారత ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన జస్టిస్ సదాశివం 2014లో పదవీ విరమణ తర్వాత నెల రోజుల్లోనే కేరళ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోవటంతో ప్రారంభమైన రచ్చ జస్టిస్ రంజన్ గోగోయ్ 2019లో పదవీ విరమణ తర్వాత రాజ్యసభ సభ్యునిగా మార్చి 2020లో నియమితులు అవ్వటంతో మరింత పెరిగింది. సుప్రీం తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ కూడా పదవీ విరమణ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా పదవి స్వీకరించి ఆ పదవిలో 1997 నుండి 2001 వరకు కొనసాగారు. ఆ కాలంలో గవర్నర్‌గా ఆమె నిర్ణయాలు కూడా వివాదాస్పదమైనాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా వున్న అబ్దుల్ నజీర్ కూడా జనవరి 2023లో పదవీ విరమణ చేసి వెన్వెంటనే అంటే ఫిబ్రవరి 12న గవర్నర్‌గా పదవీ ప్రమాణం చేశారు.

పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(7) ప్రకారం భారత భూభాగంలోని ఏ కోర్టులోనూ న్యాయవాదిగా వ్యవహరించకూడదు. అలాగే ఆర్టికల్ 220 ప్రకారం పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి తాను పని చేసిన హైకోర్టు మినహా మిగిలిన హైకోర్టులలోగాని, సుప్రీంకోర్టులో గాని న్యాయవాదిగా పని చేయవచ్చు; కానీ మరే ఇతర కిందస్థాయి కోర్టుల్లో న్యాయవాదిగా వ్యవహరించకూడదు. న్యాయవాదులుగా పనిచేయటం విషయంలో స్పష్టత ఇచ్చిన రాజ్యాంగం గాని, ఇతర న్యాయ చట్టాలు గాని అధికార పదవుల విషయంలో మౌనం దాల్చాయి. నిజానికి 2014కి ముందు పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఎవరూ ఏ విధమైన పదవీ స్వీకరించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసినవారు రాజ్యసభ సభ్యత్వానికి, గవర్నర్ పదవికి ఆశపడే రోజులు వస్తాయని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు.

> నిజానికి 2014కి ముందు పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఎవరూ ఏ విధమైన పదవీ స్వీకరించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసినవారు రాజ్యసభ సభ్యత్వానికి, గవర్నర్ పదవికి ఆశపడే రోజులు వస్తాయని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు.



ఇక్కడ ఇంకో ఆసక్తికర విషయం కూడా ప్రస్తావించాలి. భారతదేశంలో అత్యంత విస్తృత జీవితం గడిపి బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా; అంతర్జాతీయ కోర్టులో న్యాయమూర్తిగా; గవర్నర్‌గా; వైస్ ఛాన్సలర్‌గా; అమెరికా, ఇంగ్లాండ్, క్యూబా, స్పెయిన్, ఐర్లండ్ దేశాల్లో భారత రాయబారిగా నెహ్రూ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా; ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశాంగ శాఖా మంత్రిగా; అనేక కమిటీలకు, కమిషన్లకూ ఛైర్మన్‌గా; లా కమిషన్ సభ్యునిగా; ఐరాసలో భారత ప్రతినిధిగా; స్వతంత్ర భారతదేశంలో ముంద్రా కుంభకోణం గుట్టుమట్టులు వెలికితీసిన అత్యంత నిజాయితీపరుడు జస్టిస్ యం.సి. చాగ్లా కూడా తాను బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉంటూనే దాన్ని వదులుకొని అమెరికా రాయబారిగా వెళ్లటం స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే వివాదాస్పదమైంది. సర్వీసులో ఉన్న ఒక న్యాయమూర్తికి ఇలాంటి నియామకం ఇవ్వటం ద్వారం న్యాయవ్యవస్థ స్వతంత్రత నిజాయితీని ప్రశ్నార్థకం చేశారని నెహ్రూ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు పార్లమెంటులో విమర్శించాయి. చాగ్లా సమర్థతను, నిజాయితీని ఆనాటి హోంమంత్రి గోవిందవల్లభ్ పంత్ ఎంతగా కొనియాడినా, చివరకు అది చాగ్లా లాంటి గొప్ప వ్యక్తి జీవితంలో మచ్చగానే మిగిలింది. ఆనాటి న్యాయవ్యవస్థలో ప్రఖ్యాతి గాంచి, పదమూడేళ్ళు అటార్నీ జనరల్‌గా ఉన్న యం.సి. సెతల్వాడ్ లాంటి వ్యక్తి చాగ్లాకి అతి సన్నిహితుడైనప్పటికీ తన ఆత్మకథ 'నా జీవితం'లో ఇలా అన్నాడు: "చాగ్లాకి రాజకీయ జీవితం పట్ల ఆసక్తి వుంది. లా కమిషన్ నివేదికపైన తాను సంతకం పెట్టిన మరుక్షణమే, సిరా చుక్క తడి ఆరకముందే రాయబారి పదవిలో చేరటానికి న్యాయమూర్తిగా రాజీనామా చేశాడు. ఉన్నత పదవిలో ఉన్నవారి స్వార్థచింతనకు ఇది బలమైన తార్కాణంగా నిలుస్తుంది". దానికి బదులుగా చాగ్లా "సెతల్వాడ్, సహజన్యాయం గురించి నీకు మంచి అవగాహన వుంది. నాతో స్నేహభావం వుంది. నా మీద ఇలా దాడి చేయటం న్యాయంగా ఉందా? నీ సేవలు అవసరమని ప్రధానమంత్రి (నెహ్రూ) కోరితే ఎవరైనా ఎలా తిరస్కరిస్తారు?" అంటూ, ప్రథమ ప్రపంచయుద్ధ సమయంలో ఇంగ్లాండు ప్రధాన న్యాయమూర్తిగా వున్న లార్డ్ రీడింగ్‌ను అమెరికాలో రాయబారిగా నియమిస్తే మారు మాట్లాడకుండా ఆ బాధ్యతని అతను స్వీకరించిన విషయాన్ని చాగ్లా ఉదహరించాడు. న్యాయవాదిగా రెండు చేతులా సంపాదిస్తున్న దశలో న్యాయమూర్తిగా బాధ్యత తీసుకోమంటే అది దేశసేవలో భాగమే అని నేను దాన్ని స్వీకరించాను అని చాగ్లా చెప్పుకోవాల్సి వచ్చింది.

ప్రయోజనాల ఘర్షణ, న్యాయవ్యవస్థ గౌరవం నిలబెట్టటం, న్యాయమూర్తిగా ఉన్న కాలంలో తమకున్న అసాధారణ అధికారాలతో లభించిన సమాచారాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితిని నివారించటం తదితర అంశాల కారణంగా న్యాయమూర్తులుగా పనిచేసినవారు తర్వాత ఇతర పదవులు స్వీకరించరాదనే నైతిక సాంప్రదాయం ఒకటి నెలకొన్నది. భవిష్యత్‌లో వారు ఆశించే పదవులకు న్యాయమూర్తిగా ఉన్న కాలంలో ఇచ్చే తీర్పులు ప్రాతిపదిక కావటం కూడా గమనార్హం. బాబ్రీ మసీదు తీర్పు చెప్పిన బెంచ్‌లో గోగోయ్, అబ్దుల్ నజీర్ ఇద్దరూ ఉండటం ఇలాంటి వాదనల్ని బలపర్చుతున్నాయి. అయితే కొన్ని మంచి ఉదాహరణలు కూడా ఉన్నాయి. మొన్న పదవీ విరమణ చేసిన జస్టిస్ ఖన్నా తర్వాత పదవి చేపట్టిన జస్టిస్ గవాయ్, గత నెల 27న పదవీ విరమణ చేసిన జస్టిస్ ఓకా – వీరందరూ భవిష్యత్‌లో ఏ పదవీ చేపట్టబోమని ప్రకటించారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా ఉండి ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన బేలా ఎం. త్రివేది వ్యవహార సరళి న్యాయ నిర్ణయాల్లో ఆమె ధోరణితో పదవీ విరమణ చేసిన ఒక న్యాయమూర్తికి వీడ్కోలు ఇవ్వటమనే సంప్రదాయానికి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తిరస్కరించడం – ఇవన్నీ శుభ పరిణామాలే.

• చెరుకూరి సత్యనారాయణ

భద్రప్రయాణానికి భరోసా కల్పించాలి!

ఇటీవల ముంబైలో జరిగిన లోకల్ రైలు ప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం, పలువురు గాయపడడం అత్యంత విషాదకరమైన సంఘటన. గతంలో ప్రమాదాలు రైళ్ల పట్టాలు తప్పడం, ఒకదానికి ఒకటి ఢీకొనడం, వరదల వల్ల పట్టాలు కొట్టుకొనిపోవడం, విద్రోహ చర్యలు వంటి వాటివల్ల జరిగేవి. ఇప్పుడు ప్రయాణికుల రద్దీ వల్ల జరుగుతున్నాయి. ఒకసారి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట వల్ల ప్రయాణికులు చనిపోయిన ఘటన కూడా జరిగింది. వీటిన్నిటికీ రైల్వే శాఖకు ముందస్తు ప్రణాళిక లేకపోవడం కారణమవుతోంది.

రైల్వే స్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మౌలిక వసతులు, ఆకర్షణీయమైన రీతిలో అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్నారు, ఇది చాలా హర్షించదగ్గ విషయం. కానీ వీటిని ఉపయోగించే ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. జనాభా అవసరాలకు తగ్గట్టు ప్రయాణికుల రైళ్లు పెరగడం లేదు. ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంతో పాటు కొన్ని స్టేషన్లలో హాల్ట్‌లను ఎత్తివేస్తున్నారు. అత్యంత వేగంతో నడిచే రైళ్ల ప్రవేశపెట్టడానికి చూపించే శ్రద్ధ, సామాన్య ప్యాసింజర్ రైళ్ల విషయంలో చూపడం లేదు. చార్జీలు కూడా విపరీతంగా పెంచారు. స్లీపర్ బోగీల సంఖ్య తక్కువగా ఉంటోంది. జనరల్ బోగీల్లో సీట్లు సామర్థ్యానికి మించి టికెట్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తున్నది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆధునీకరించిన స్టేషన్ల సముదాయాల వల్ల రైల్వే శాఖకు ఆదాయం విస్తృత స్థాయిలో లభిస్తోంది. కాబట్టి కొత్త ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రవేశపెట్టడం, ఉన్నవాటికి బోగీలను పెంచడం, ప్రజలకు అవసరం ఉన్న స్టేషన్లలో హాల్ట్‌లను కల్పించడం చేయాలి. ప్రజలు ప్రమాదరహితంగా, సుఖసంతోషాలతో రైలు ప్రయాణం చేయడానికి వీలు కల్పించి భారతీయ రైల్వేను ప్రపంచ పటంలో ఆదర్శవంతమైన వ్యవస్థగా నిలపాలి.

– దండంరాజు రాంచందర్‌రావు





తల్లికి వందనం

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాల్లో వేసిన తల్లికి వందనం పథకం నగదు డ్రా చేసుకునేందుకు సోమవారం క్యూ కట్టారు. దీంతో నగరంలోని బ్యాంకులు, పోస్టాఫీసులు కిటకిటలాడాయి. గంటల తరబడి ఖాతాదారులు క్యూలో నిలబడి నగదు డ్రా చేసుకుని వెళ్లారు. చేతికందిన నగదుతో ఆనందం వ్యక్తం చేశారు. నగరంలోని కృష్ణలంక యూనియన్ బ్యాంక్ వద్ద తల్లుల రద్దీ ఇది.

శాతవాహనలో ధనకార్యాలు

శాతవాహన కళాశాలలో 'ధన'కార్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కంచే చేను మేసినట్టుగా సొసైటీలోని కొందరు కళాశాలను అడ్డం పెట్టుకుని భారీగానే దోచేశారు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన వారే డబ్బుకు కక్కుర్తి పడి సర్టిఫికెట్లను అమ్ముకోడానికి ప్రయత్నించారు. కళాశాల నిర్వహణలో కీలకస్థానంలో ఉన్న షాడో ఒకరు అన్నీ తానై పాల్పడిన ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.



సొసైటీలోని అవినీతి ముఠా అక్రమాలు

ఓ షాడో చుట్టూ తిరుగుతున్న కథలు

- డిగ్రీ సర్టిఫికెట్ల పేరిట రూ.5 లక్షల వసూలు
- సర్టిఫికెట్లు ఇవ్వకపోవటంతో రచ్చ.. కాళ్లబేరం
- కళాశాల బాధ్యుడు ప్రజాపతిరావు డిజిటల్ సిగ్నేచర్‌తో దొంగపనులు
- నూజివీడులో స్థలం కొనుగోలులోనూ అక్రమాలు
- కమర్షియల్ మాల్ ఏర్పాటు కోసం బయటి వారితో డీల్



శాతవాహన కళాశాలలో శిథిలాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : శాతవాహన కళాశాల వ్యవస్థాపకులు.. సొసైటీ బాధ్యతలను ప్రజాపతిరావుకు అప్పగించాక కొంతకాలం వరకు బాగానే సాగింది. ప్రజాపతిరావు వృద్ధాప్యంలోకి రావటంతో ఆయన నమ్మిన ఓ షాడో ఎంచక్కా సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. కళాశాల నిర్వహణకు నిధులు అవసరమంటూ అప్పులు తీసుకొచ్చి లెక్కలు చూపటం ప్రారంభించారు. ఏవేవో అవసరాలు చెప్పి ప్రజాపతిరావు నుంచి రూ.లక్షలు లాగేశారు. కళాశాల ప్రాంగణాన్ని ఎగ్జిబిషన్లు, ఇతర కార్యక్రమాలకు అద్దెకు ఇస్తూ భారీగా సముపార్జించారు. కమిటీకి తక్కువ చూపి సింహభాగాన్ని తన జేబులో వేసుకున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కీలక వ్యక్తి ప్రజాపతిరావుతో పాటు ఒక ఏసీపీ, మరికొందరి భాగస్వామ్యంతో నూజివీడులో భూములు కొన్నారు. ప్రజాపతిరావు, ఏసీపీ కుటుంబ సభ్యుల పేర్లతో ఈ భూములు కొన్నారు. అయితే, ప్రజాపతిరావు తన కుటుంబం పేరుతో కొన్న భూమికి సంబంధించి ఫొటోను తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ స్థలం వివాదంలో చిక్కుకుంది. ఏసీపీతో పాటు ఇతరులు కూడా ఆ వివాదాన్ని ఇప్పటికీ పరిష్కరించుకోలేకపోయారు.

సర్టిఫికెట్ల పేరుతో హాంఫట్

డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తానని చెప్పి ఓ కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకురాలి నుంచి ఈ షాడో రూ.5 లక్షలు తీసుకున్న అంశం వెలుగులోకి వచ్చింది. ఈ డబ్బును కూడా తాను సూచించిన వ్యక్తి ఖాతాలోకి నేరుగా బదిలీ చేయించుకోవటం గమనార్హం. కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకురాలి సోదరి ఆ డబ్బును జమ చేశారు. అయితే, ఇచ్చిన హామీ ప్రకారం సర్టిఫికెట్లను ఇవ్వకపోవటంతో ఆ నిర్వాహకురాలు పంచాయితీ పెట్టారు. పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆమె సిద్ధం కావటంతో కాళ్ల బేరానికి వచ్చిన ఆ షాడో సదరు మహిళకు రూ.లక్ష డబ్బు ఇప్పించినట్టు సమాచారం.

అక్రమాలు అనేకం

ప్రజాపతిరావు వృద్ధాప్యాన్ని అడ్డం పెట్టుకుని సొసైటీలో నకిలీ సభ్యత్వాలు కల్పించటం, వారితో కలిసి సొసైటీ నిధుల దుర్వినియోగానికి ఈ షాడో పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాపతిరావు డిజిటల్ సిగ్నేచర్‌ను క్యాప్చర్ చేసి, తన దగ్గరే ఉంచుకుని అనేక అక్రమాలకు పాల్పడినట్టు చెబుతున్నారు. సొసైటీ నిధుల దుర్వినియోగం దగ్గర నుంచి డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తామని మోసం చేయటం, ఏకంగా శాతవాహన కళాశాలను మూసివేసి డెవలప్‌మెంట్‌కు ఇచ్చుకునే ఆలోచన చేయడం గమనార్హం. ఈ ఆలోచనను అమల్లోకి తీసుకురావటానికి సొసైటీలో బలంగా ఉన్న ఓ నేతను కూడా ఒప్పించేందుకు ఆయన పథక రచన చేయటం విడ్డూరం. ఈ నేత గతంలో 'శాతవాహన'పై కన్నేశారు. ఆయన సభ్యత్వంపై కూడా వివాదం ఉంది. ఇన్ని మిగతా 6లో..

కొండపల్లి కోట టీడీపీదే..

మూడున్నరేళ్ల నిరీక్షణకు ముగింపు

- నాడు వైసీపీ ఆడిన దొంగాటకు తెర
- చైర్మన్‌గా టీడీపీ నేత చిట్టిబాబు ప్రకటన
- వైస్ చైర్మన్లుగా విజయలక్ష్మి, శ్రీనివాసరావు
- ప్రమాణస్వీకారం చేయించిన ఆర్డీవో



> మూడున్నరేళ్ల నిరీక్షణకు తెరపడింది. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ వశమైంది. 2021, నవంబరు 24నే తేలాల్సిన చైర్మన్ ఫలితం అప్పట్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ఆడిన తొండాటకు కోర్టు వరకూ వెళ్లగా, ఇప్పటికి టీడీపీకి న్యాయం జరిగింది.

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో 2021లో జరిగిన కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో నాడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ హోరాహోరీగా పోరాడింది. 29 వార్డులకు 14 టీడీపీ, 14 వైసీపీ, ఒకటి స్వతంత్ర అభ్యర్థికి దక్కాయి. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థి టీడీపీలో చేరడంతో ఆ పార్టీ బలం 15కు చేరింది. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎక్స్‌అఫిషియస్ ఓటు వైసీపీకి వేయడంతో ఆ పార్టీ బలం 15 అయ్యింది. అలాగే, నాటి టీడీపీ ఎంపీ కేశినేని నాని ఎక్స్‌అఫిషియస్ ఓటుతో ఆ పార్టీ బలం 16కు చేరింది. దీంతో చైర్మన్ పీఠం టీడీపీదేనని అంతా భావించారు.

నాడు వైసీపీ తొండాట

ఈ నేపథ్యంలో నాటి ఎంపీ కేశినేని నాని ఓటు చెల్లదని వైసీపీ కోర్టును ఆశ్రయించింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికైతే జరిపారు కానీ, ఫలితాన్ని మిగతా 6లో..



కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబుకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఆర్డీవో కె.చైతన్య, పక్కనే ఎమ్మెల్యే వసంత (ఇన్‌సెట్‌లో) చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్లు శ్రీనివాసరావు, విజయలక్ష్మి (ఫైల్ ఫొటోలు)

టీడీపీ సంబరాలు

మూడున్నరేళ్ల నిరీక్షణ ఫలించి కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీకి దక్కడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మున్సిపల్ కార్యాలయానికి భారీగా చేరుకుని కొత్త పాలకవర్గానికి అభినందనలు తెలిపి, భారీ ఊరేగింపు నిర్వహించారు.



మెట్రో ప్రధాన స్టేషన్ డిజైన్

తెరపైకి మెట్రో ప్రధాన స్టేషన్

పాత డిజైన్‌లో స్వల్ప మార్పులు చేయాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ మెట్రోరైల్ ప్రాజెక్టులో కీలకమైన ప్రధానమైన స్టేషన్ డిజైన్ విషయంలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో ఒకసారి రూపొందించిన డిజైన్‌లోనే స్వల్ప మార్పులు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌కు కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా ఆటోనగర్, బెంజిసర్కిల్, పోలీసు కంట్రోల్ రూమ్‌ల మీదుగా పీఎన్‌బీఎస్‌కు కారిడార్-2 చేరుకుంటుంది. ఈ రెండూ పీఎన్‌బీఎస్‌కు అనుసంధానమవుతాయి. రెండోదశలో కృష్ణా కెనాల్ జంక్షన్ మీదుగా రాజధాని అమరావతిలోని లింగాయపాలెం వరకు కారిడార్-3 చేరుకుంటుంది. మూడు మిగతా 6లో..

కృష్ణలంకలో ఘరానా మోసం

చీటీలు, గోల్డ్ స్కీమ్‌ల పేరిట మహిళ టోకరా

- సీపీ కార్యాలయానికి క్యూ కట్టిన బాధితులు
- రూ.50 లక్షల వరకు మోసం చేసిందని ఆరోపణ

కృష్ణలంక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంకలో ఓ మహిళ ఘరానా మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రణదివె నగర్‌లో ఉండే ఈ మహిళ ఓ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తుండటంతో పాటు చీటీలు, గోల్డ్ స్కీమ్‌ల పేరిట రూ.50 లక్షల వరకు బాధితుల నెత్తిన టోపీ పెట్టిందన్న ఆరోపణలు వస్తున్నాయి. అందినకాడికి దండుకుంటూ, అమాయక మహిళల్ని మోసం చేస్తూ, వారి ఆస్తుల్ని సైతం కాజేస్తూ చివరికి వారే తనను మోసం చేశారంటూ బాధితులపైనే తప్పుడు కేసులు పెడుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈమె వెనుక భవానీపురానికి చెందిన ఓ వ్యక్తి ఉన్నాడని బాధితులు చెబుతున్నారు. ఈమె వేధింపులు మిగతా 6లో..

ఇసుక తవ్వకాలు నిలిపివేత

- వర్షాలతో పాటు మునేరు, కృష్ణానదికి నీరు చేరడం వల్లే..
- ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో నిల్వ 7.25 లక్షల టన్నులు



కంచెల స్టాక్ పాయింట్

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : జిల్లాలో స్టాక్ పాయింట్లలో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. ఆరు స్టాక్ పాయింట్లలో మొత్తం 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. వర్షాలు పడుతుండటం, మునేటికి, కృష్ణానదికి నీళ్లు వస్తుండటంతో ఇటీవల ఈ తవ్వకాలు నిలిపివేశారు. అయితే, అభివృద్ధి పనులు, కట్టడాలు, ఇతరత్రా నిర్మాణ పనులకు ఇబ్బందులు లేకుండా స్టాక్ పాయింట్లలో ఇసుక విక్రయిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ పాయింట్‌లో టన్ను ధర రూ.380 కాగా, మిగతా ఆరు స్టాక్ పాయింట్లలో రూ.172లే. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో, సీసీ కెమెరాల నిఘాలో ఈ అమ్మకాలు సాగుతున్నాయి. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా చూసేందుకు కంచికచర్ల మండలం కీసర, మోగులూరు, నందిగామ మండలం కంచెల, చందర్లపాడు మండలం ఏటూరు, వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ ఆరు పాయింట్లలో ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేయాలని మిగతా 6లో..

మళ్లీ మళ్లీ పెళ్లి

పెళ్లికాని యువకులే టార్గెట్‌గా నగరంలో దొంగ పెళ్లిళ్లు

● కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన ప్రసాద్‌కు మూడు పదుల వయస్సు పైబడినా పెళ్లి కాలేదు. పెళ్లి చేసుకోవడానికి ఓ అమ్మాయిని చూడమని పెళ్లిళ్ల బ్రోకర్లకు చెప్పి మోసపోయాడు. పెళ్లై భర్త నుంచి దూరంగా ఉంటున్న ఓ పిల్లాడి తల్లిని పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేసి ప్రసాద్ నుంచి రూ.3 లక్షలు గుంజేశారు. విజయవాడ కేంద్రంగా రెండు రోజుల క్రితం జరిగిన ఘటన ఇది.

● చెన్నైకు చెందిన యువకుడికి నగరానికి చెందిన యువతితో గత నెలలో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.4 లక్షల కట్నం ఎదురిచ్చి మరీ యువకుడు పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయిన పది రోజులకు యువతి సొంతూరు వెళ్లాలని విజయవాడకు వచ్చింది. బస్టాండ్‌లో దిగి కనిపించకుండాపోయింది. ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడు. అయితే, అంతకుముందే ఆమెకు పెళ్లయినట్టు పోలీసులు గుర్తించారు.

● అనంతపురానికి చెందిన ఓ యువకుడికి వారం క్రితం కొండపల్లికి చెందిన యువతితో వివాహమైంది. తర్వాత వారానికే నాన్నమ్మకు ఒంట్లో బాలేదని యువతి నగరానికి వచ్చి అదృశ్యమైంది. వరుడు పోలీసులను ఆశ్రయించగా, ఆ మహిళకు గతంలోనే వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నట్టుగా గుర్తించారు. పెళ్లికి పెద్దలుగా ఉన్నవారు ఎదురు కట్నంగా రూ.3 లక్షలు చెల్లించాలని షరతు పెట్టారు.

ఇటీవల నగరంలో వరుసగా జరిగిన ఘటనలివి. పెళ్లికాని యువకుల బలహీనతలను క్యాష్ చేసుకుంటూ దర్జాగా దొంగ పెళ్లిళ్లు జరిపించేస్తున్నారు. మ్యారేజ్ బ్యూరోగా చెప్పుకొనే ఓ గ్యాంగ్ ఎదురుకట్నం తీసుకుని యువకుల జీవితాలను ఇలా చీకటిమయం చేస్తోంది.

- పిల్లలుండి భర్తకు దూరంగా ఉంటున్న మహిళలను చూపించి ఎర
- ఎదురుకట్నం ఇచ్చి పెళ్లికి సిద్ధమవుతున్న యువకులు
- తూతూమంత్రంగా పెళ్లి.. ఆనక మోసపోయి లబోదిబో
- నగరంలో మ్యారేజ్ బ్యూరోగా చెప్పుకొంటున్న గ్యాంగ్ అరాచకం
- వాంబేకాలనీ, కొండపల్లిలోనూ ముఠాగా ఏర్పడి మోసాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో మ్యారేజ్ బ్యూరోలుగా చెప్పుకొంటున్న కొంతమంది ఓ గ్యాంగ్‌గా ఏర్పడి పెళ్లికాని యువకులను మోసం చేస్తున్నారు. పెళ్లి చేస్తామని చెప్పి ఆభరణాలను, నగదును లాగేసుకుంటున్నారు. ఈ గ్యాంగ్ చేస్తున్న ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల పీఎన్‌బీఎస్ కేంద్రంగా మొత్తం మూడు ఘటనలు జరిగితే, వాటిలో ఒకటి మాత్రమే పోలీసుల వరకు వెళ్లింది. పెళ్లై భర్తకు దూరంగా ఉంటున్న మహిళల వివరాలు సేకరించి, పెళ్లికాని యువకుల జీవితాల్లోకి పంపుతున్నారు. తద్వారా ఈ గ్యాంగ్ ఆర్థికంగా లాభపడుతోంది. పెళ్లిచూపులు పూర్తికాగానే, వెంటవెంటనే మిగతా 6లో..

రాయలసీమ యువకులే టార్గెట్

వాంబేకాలనీకి చెందిన ఇద్దరు మహిళలతో పాటు కొండపల్లికి చెందిన ఇద్దరు మహిళలు కూడా ఓ ముఠాగా ఏర్పడి దొంగ పెళ్లిళ్లు చేయిస్తున్నట్టు పోలీసులు అనుమానిసున్నారు. రాయలసీమకు చెందిన యువకులను టార్గెట్ చేసుకుని ఈ మహిళలు దొంగ పెళ్లిళ్లు చేయించి లక్షల రూపాయలు వసూలు చేసి పరారవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. మోసపోయిన యువకులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. విషయం బయటపడితే పరువు పోతుందని భావిస్తున్నారు.





సీమకు రయ్.. రయ్..

- రాయలసీమకు పెరుగుతున్న విమాన సర్వీసులు
- తిరుపతి, కడపలకు ఇప్పటికే సర్వీసులు
- జూలై 2 నుంచి కర్నూలుకు సర్వీసు
- అన్నీ ఇండిగో ఎయిర్‌లైన్స్‌వే

6



కేబుళ్లతో కళావిహీనం

- కళతప్పుతున్న నగర సౌందర్యం
- విద్యుత్ స్తంభాలకు అడ్డదిడ్డంగా..
- వాహన, పాదచారులకు ఇబ్బందే
- ప్రమాదాలు జరిగే పరిస్థితి

8

విఘ్నాలు రాకుండా మహాగణపతి రక్షించాలి

- ఎంపీ కేశినేని శివనాథ్ తనయుడు వెంకట్
- నగరంలో 72 అడుగుల మట్టి విగ్రహ నిర్మాణానికి శ్రీకారం

8



సేవా బృందాల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

అమ్మ సన్నిధిలో సేవకులే సారధులు

» దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దేవదాయ శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవదాయ కమిషనర్ ఆదేశాల ప్రకారం కనకదుర్గమ్మ సన్నిధిలో నిస్వార్థంగా ఉచితసేవ చేసే సేవకులు, భక్త బృందాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి భక్తుల సేవలో వినియోగిస్తామని ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. సోమవారం మహామండపం ఆరో అంతస్తులో సేవాబృందాలతో ఈవో సమావేశమయ్యారు. భక్తులకు తాగునీరు అందించడం, అన్నప్రసాద వితరణ, ఉచిత ప్రసాద వితరణ, దర్శనం క్యూలైన్ల నిర్వహణ, క్లోక్ రూమ్, చెప్పుల స్టాండ్, మొబైల్ భద్రపరచే ప్రదేశం, భక్తుల ఫీడ్ బ్యాక్ కౌంటర్, లిఫ్ట్ క్యూ వద్ద, దేవస్థానం బస్ క్యూ వద్ద, పార్కింగ్, టోల్ గేట్ వద్ద వాహనాల క్రమబద్ధీకరణ తదితర చోట్ల సేవకులు, భక్త బృందాల సేవలు వినియోగించనున్నట్టు ఈవో పేర్కొన్నారు. సేవకుల రిజిస్ట్రేషన్ నిమిత్తం ఆన్‌లైన్ అప్లికేషన్ సిద్ధం అయిందని, ఆఫ్‌లైన్‌లో కూడా దేవస్థానంలో దరఖాస్తులు స్వీకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, బృందాలుగా వచ్చేవారికి ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు శీనానాయక్ వెల్లడించారు. తిరుమలలో శ్రీవారి సేవగా ప్రాచుర్యం పొందగా, దుర్గమ్మ ఆలయంలో శక్తిసేవ అని వ్యవహరించాలని, ఈ సందర్భంగా సేవకులు విజ్ఞప్తి చేశారు. తిరుమల తరహాలో వసతి, అన్న ప్రసాదం, లాకర్ సౌకర్యం, సేవకులకు తాత్కాలిక గుర్తింపు కార్డు, వసతి నుండి దేవస్థానానికి రవాణా సదుపాయాలు కల్పించాలని సేవకులు ఈవోను కోరారు. సేవకులే సారధులుగా అమ్మ సన్నిధిలో భక్తులకు సేవలందించే ప్రణాళిక సిద్ధం అయిందని, పారదర్శకమైన వ్యవస్థ రూపొందిస్తున్నామని, భక్తి భావంతో అర్హత కలిగిన వ్యక్తులను సేవకు వినియోగిస్తామని ఈవో వివరించారు.

అమ్మవారి ఆభరణాల అప్పగింత



ఇంద్రకీలాద్రి, : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ బంగారు, వెండి ఆభరణాలను అధికారులు అప్పగించే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పూర్వ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు డిసెంబరు 31న పదవీ విరమణ చేయగా, వారి అధీనంలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ప్రస్తుత కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్‌కు అప్పగించారు. మంగళవారం దేవస్థానం బ్యాంకు లాకర్లలో ఉన్న వస్తువుల అప్పగింత కార్యక్రమం జరుగుతుందని దేవస్థానం గణాంక విభాగం అధికారులు తెలిపారు.

ఆలయ భద్రత విషయంలో రాజీ వద్దు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా విధులు నిర్వర్తించాలని స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసు సిబ్బందిని ఈవో శీనానాయక్ కోరారు. సోమవారం దేవస్థానంలో విధులు నిర్వర్తించడానికి వచ్చిన స్పెషల్ బ్యాచ్‌తో సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయంలో భక్తులతో గౌరవంగా, సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయవాదులకు వినతిపత్రం సమర్పిస్తున్న శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

శాతవాహన రక్షణలో సహకరించండి

» కళాశాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

విజయవాడ లీగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యల వలయంలో చిక్కుకున్న శాతవాహన కళాశాలపై స్పందించి పరిష్కారానికి న్యాయపరమైన అండదండలు ఇవ్వడం ద్వారా కళాశాలకు పూర్వవైభవం తేవాలని కోరుతూ కళాశాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషాకు వినతిపత్రం సమర్పించారు. గత పదేళ్లకు పైగా కళాశాల వివాదంలో వుంటూ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉన్న వివరాలు కొంత మేరకు తమ దృష్టికి వచ్చాయని ప్రస్తుతం కళాశాల భవనాలు కూల్చివేయడం సరైంది కాదని దీనిపై న్యాయపరమైన అండగా వుంటామని భరోసా ఇచ్చారు. పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉయ్యూరు సాంబిరెడ్డి మాట్లాడుతూ, గడచిన యాభై ఏళ్లలో కళాశాలలో చదివిన విద్యార్థులు న్యాయవాదులు ఉపాధ్యాయులుగా అనేక రంగాల్లో వున్నారన్నారు. కార్యక్రమంలో బార్ పూర్వ అధ్యక్షులు సంపర శ్రీనివాసరావు, హైకోర్టు న్యాయవాది నాగేశ్వరరావు, ప్రచార కమిటీ కన్వీనర్ మోతుకూరి అరుణ్‌కుమార్, పొలిమేర తాతారావు, వల్లూరు నాగబాబు, సైనుద్దీన్, నరేంద్ర, కిరణ్, వేముల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి వున్నారు.

మళ్లీ మళ్లీ పెళ్లి

(5వ పేజీ తరువాయి)

ముహూర్తాలు పెట్టిస్తున్నారు. దుర్గమ్మ ఆలయంలో కానీ, ఇతర ఆలయాల్లో కానీ తూతూమంత్రపు పెళ్లిళ్లు చేసేస్తున్నారు.

పెళ్లి కూతురిలా మారితే రూ.35 వేలు

అవివాహిత యువకులను టార్గెట్ చేసుకుని మోసాలు చేస్తున్న ముఠా నెట్‌వర్క్ అంతర్రాష్ట్రాలతో అనుసంధానమైనట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ ముఠా లింక్‌లు కర్ణాటక నుంచి బెజవాడ వరకు ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు మాత్రం ఈ ముఠాను నడుపుతున్నట్టు తెలుస్తోంది. పెళ్లై పిల్లలుండి, భర్త నుంచి విడిపోయిన మహిళలను ఎంపిక చేసుకోవడానికి వీరు ప్రత్యేకంగా మహిళలను నియమించుకుంటున్నారు. ఇలా భర్తలకు దూరంగా ఉంటున్న మహిళల వివరాలను తమ వద్ద భద్రపరుచుకుంటున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆమని విషయంలో ఇదే జరిగింది. ఆమనిని రాయచూర్‌కు చెందిన ప్రసాద్ జీవితంలోకి పంపడానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి కథ నడిచింది. పిల్లలున్న తల్లిని పెళ్లికుమార్తెలా ముస్తాబు చేసి చూపించి అవతలి వ్యక్తుల నుంచి ఈ గ్యాంగ్ లక్షలాది రూపాయలను లాగేసింది. అందులో పెళ్లికుమార్తె వాటాగా రూ.35 వేలు ఇస్తున్నారు. ఆ మిగిలిన మొత్తాన్ని గ్యాంగ్‌లోని సభ్యులు పంచుకుంటున్నారు. అమ్మాయి పెళ్లికి సిద్ధంగా ఉందని చెప్పి వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారిని విజయవాడకు రప్పిస్తున్నారు. గ్యాంగ్‌లో ఉన్న మహిళా సభ్యుల ఇళ్లలో లేదా వారికి పరిచయం ఉన్న వారి ఇళ్లల్లో పెళ్లిచూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఆమని కేసు విషయంలో వెలుగులోకి వస్తున్న విషయాలను తెలుసుకుని పోలీసులు అవాక్కవుతున్నారు. ఈ కేసులో కీలక సూత్రధారిగా భావిస్తున్న మురార్జీ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మురార్జీకి సంకెళ్లు వేస్తే పెళ్లిళ్ల పేరుతో ఎన్ని మోసాలు చేశాడన్న సమాచారం బయటకు వస్తుందని భావిస్తున్నారు.

సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలి

» సమస్య పునరావృతం కాకూడదు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా సమస్యను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది నుంచి సమాచారం సేకరించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పునరావృతం కాకూడదని సమస్య పరిష్కారంతో అర్జీదారుడు సంతృప్తి చెందడమే లక్ష్యంగా అధికారులు పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని అన్నారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని అర్జీలను ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చేయాలని, అధికారులను ఆదేశించారు. మొత్తం 157అర్జీలను స్వీకరించినట్టు చెప్పారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేత

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించగా, మొత్తం 7.25 లక్షల మెట్రిక్ టన్నులే నిల్వ చేశారు.

సీనరేజ్ రద్దు.. తగ్గిన ధర

కూటమి ప్రభుత్వం ఇసుక సీనరేజ్‌ను రద్దు చేసింది. ఇంతకుముందు టన్నుకు రూ.88 సీనరేజ్ ఉండేది. ప్రస్తుతం ఆ సీనరేజ్‌ను ప్రభుత్వం ఎత్తేసింది. గత ఏడాది స్టాక్ పాయింట్ వద్ద టన్ను రూ.290కు విక్రయించిన సంగతి విదితమే. ఈ ఏడాది కేవలం ఇసుక తవ్వకం, లోడింగ్, స్టాక్ పాయింట్‌కు రవాణా, ఇతర ఖర్చులనే పరిగణనలోకి తీసుకుని కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లాస్థాయి ఇసుక కమిటీ ధర నిర్ణయించింది. కీసర, మోగులూరు, కంచెల, ఏటూరు, ఆళ్లూరుపాడు స్టాక్‌పాయింట్ల వద్ద టన్ను ధర రూ.172గా నిర్ణయించారు. రీచ్‌ల నుంచి రవాణా ఖర్చు ఎక్కువ కావటం వల్ల ఇబ్రహీంపట్నం స్టాక్ పాయింట్ వద్ద మాత్రం ధర రూ.380గా నిర్ణయించారు.

అక్రమాలకు తావులేకుండా..

గత ఏడాది స్టాక్ పాయింట్ల నిర్వహణ బాధ్యతలను రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు అప్పగించటం వల్ల అక్రమాలు, అవకతవకలు జరిగాయి. ఈ ఏడాది అలాంటి వాటికి తావులేకుండా మైనింగ్ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా స్టాక్ పాయింట్ల నిర్వహణ బాధ్యతలను ఒక్కరికి కాకుండా నలుగురు కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్రత్యేకంగా సీసీ కెమెరాలను బిగించారు. అయితే, స్టాక్ పాయింట్ల వద్ద నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధర తీసుకోకుండా, ముఖ్యంగా తెలంగాణాకు అక్రమంగా ఇసుకను తరలించకుండా మైనింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఇందుకు కాంట్రాక్టర్ అమ్మిన పరిమాణం మేరకు జిల్లాస్థాయి ఇసుక కమిటీకి టన్నుకు రూ.20 వంతున జమ కానున్నాయి. కాగా, జిల్లాలో ఇసుక కొరత లేదని, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ చేశామని, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు.

వృద్ధురాలిపై దాడి.. గాజులు చోరీ

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి బంగారు గాజులను ఓ బాలుడు దొంగిలించాడు. అజిత్‌సింగ్ నగర్ మాధ్యూ ఆసుపత్రి ప్రాంతానికి చెందిన కేశవరపు దుర్గాంబ భర్తతో కలిసి ఉంటోంది. కుటుంబసభ్యులు బయటకు వెళ్లడం దుర్గ ఒంటరిగా ఉంది. దీనిని గమనించిన పక్క వీధిలోని బాలుడు ఆమెపై దాడి చేసి రెండు బంగారు గాజులను దొంగిలించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే అజిత్‌సింగ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు కొద్దిసేపటికే నిందితుడిని అరెస్టు చేశారు.



సమస్యలు పరిష్కరించాలి

» ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ విద్యార్థుల డిమాండ్

గవర్నర్‌పేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయం వల్ల ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు డిమాండ్ చేశారు. సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ, సీఓఏ అనుమతులు కూడా లేకుండా అద్దె భవనాల్లో కోర్సులు ప్రారంభించారని, ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ నుంచి అనుమతులు లేకుండా అడ్మిషన్లు పూర్తి చేశారని ఆరోపించారు. యూనివర్శిటీలో అడ్మిషన్లు పొంది 5 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఎటువంటి గుర్తింపు లేకుండా తరగతులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని యూనివర్శిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సహకార సిబ్బందికి శిక్షణ తరగతులు ప్రారంభం



కృష్ణలంక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లాలోని 131 సహకార సంఘాల సిబ్బందికి సంఘాల కంప్యూటరీకరణపై శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 425 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ కార్యక్రమం పూర్తయిందని, ఇకపై అన్ని సంఘాలు కంప్యూటరీకరణ ద్వారా రైతులకు పారదర్శకమైన, వేగవంతమైన నాణ్యమైన సేవలను అందచేయుటకు సహకార సంఘాలు సంసిద్ధమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వాట్సాప్ సేవా కార్యక్రమాలు కూడా సహకార సంఘాలకు అనుసంధానం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అదేవిధంగా గతంలో మీ సేవ ద్వారా రైతులకు అందచేయుచున్న రైతుల భూములకు సంబంధించిన వన్ బి, అడంగల్ తదితర పత్రాలను సహకార సంఘాల ద్వారానే అందచేయుటకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి, కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్.రంగబాబు, ఆప్కాబ్ సీటీఐ ప్రతినిధి రమణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘరానా మోసం

(5వ పేజీ తరువాయి)

భరించలేని 21, 22 డివిజన్లకు చెందిన కొందరు బాధితులు సోమవారం సీపీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు.

డబ్బులిచ్చిన వారిపై దౌర్జన్యం

- తాను వ్యాపారం, చీటీలు, గోల్డ్ స్కీమ్‌లు నిర్వహించుకోవడానికి రూ.20 లక్షలు అప్పు గా ఇచ్చిన వారిపైనా సదరు మహిళ దౌర్జన్యానికి దిగింది. మొదటి నుంచి యరడ్ల నాగలావణ్య అనే మహిళతో సన్నిహితంగా ఉన్న ఈ ఘరానా మహిళ వారికి మాయమాటలు చెప్పి ఆరు నెలల్లో రూ.20 లక్షల వరకు అప్పు తీసుకుంది. ఆ డబ్బుతో దుస్తుల వ్యాపారం, చీటీలు, గోల్డ్‌స్కీమ్ పేరిట మోసాలు చేసింది. అప్పు తీర్చాలని ఇంటికెళ్లి అడిగిన లావణ్యను చంపేస్తానని బెదిరించింది. దీంతో లావణ్య గత సోమవారం పోలీసు కమిషనరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేసింది. ఈ పిటిషన్‌ను సీపీ కార్యాలయ సిబ్బంది కృష్ణలంక పోలీసులకు రిఫర్ చేశారు. భ్రమరాంబపురంలోని అమ్ములు అనే మహిళను కూడా ఈ మహిళ మోసం చేసింది. అమ్ములు ఇంటి బీఫాం కాగితాలు తన పేరుమీద మారిస్తే రూ.5 లక్షలు ఇస్తానని నమ్మబలికింది. రూ.5 లక్షలు కాదు కదా.. పైసా కూడా ఇవ్వలేదని అమ్ములు ఆరోపిస్తోంది. వీటిని అడ్డంపెట్టుకుని అమ్ములే.. తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని, ఇవ్వకపోతే నోట్లు పెట్టి కోర్టులో కేసులు వేస్తానని బెదిరించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అమ్ములు ఫిబ్రవరిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆకుల ధనలక్ష్మికి రూ.2 లక్షలు, పవన్ కల్యాణ్‌కు రూ.లక్ష, ఎం.వెంకాయమ్మకు రూ.4.50 లక్షలు చీటీల సొమ్ము చెల్లించలేదు. ఇలా.. మొత్తం ఆరుగురు బాధితులు సోమవారం సీపీ ఆఫీసులో ఫిర్యాదు చేశారు. కృష్ణలంక పోలీసులు పట్టించుకోవట్లేదని అధికారులకు విన్నవించారు.

టీచర్ల బదిలీలో స్కూల్ అసిస్టెంట్లే ఎక్కువ

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో టీచర్ల బదిలీల ప్రక్రియలో 4281 మంది బదిలీ అయ్యారు. వీరిలోస్కూల్ అసిస్టెంట్లు ఎక్కువ మంది ఉన్నారు. 1933 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కాగా, 1885 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 110 మంది గ్రేడ్ 2 హెచ్ఎం, 87 మంది బాషా పండితులు, మోడల్ ప్రైమరీహెచ్ఎంలు 217, వ్యాయామ ఉపాధ్యాయులు 24, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 27 మంది బదిలీ అయ్యారు. కాగా సోమవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 1435 మందికి గాను 1358 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ

మచిలీపట్నం టౌన్ : ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజురాయితీ ఇస్తూ డీఈవో పీవీజే రామారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి రవీంద్రకు జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తా

» ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



గాంధీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జేఏసీకి కీలకమైన నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్రకార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఎన్జీవో సంఘం పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 5 వేలకు పైగా నాల్గవ తరగతి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను ఘనంగా సత్కరించారు.


సీమకు రయ్.. రయ్..

» రాయలసీమకు పెరుగుతున్న విమాన సర్వీసులు

» తిరుపతి, కడపలకు ఇప్పటికే సర్వీసులు

» జూలై 2 నుంచి కర్నూలుకు సర్వీసు

» అన్నీ ఇండిగో ఎయిర్‌లైన్స్‌వే



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ నుంచి రాయలసీమ ప్రాంతాలకు విమానయానం ఊపందుకుంటోంది. ప్రాంతీయ విమానయానంలో విజయవాడ నుంచి రాయలసీమ ప్రాంతానికే ఎక్కువ సర్వీసులు నడుస్తుండటం విశేషం. ఇప్పటికే తిరుపతి, కడపకు విమాన సర్వీసులు నడుస్తుండగా జూలై 2 నుంచి కర్నూలుకు విమాన సర్వీసు ప్రారంభం కాబోతోంది. దీంతో విజయవాడ నుంచి రాయలసీమకు నడిచే విమానాల సంఖ్య మూడుకు చేరనుంది. విజయవాడ నుంచి రాయలసీమకు ప్రస్తుతం నడుస్తున్న తిరుపతి, కడప సర్వీసులను ఇండిగో విమానయాన సంస్థ నడుపుతోంది. కర్నూలుకు కూడా ఇండిగో సర్వీసును నడుపుతున్నట్టు ప్రకటించడమే కాకుండా బుకింగ్‌ను కూడా ప్రారంభించింది. రాయలసీమ ప్రాంతాలకు 90 శాతం పైగా ఆక్యుపెన్సీ ఉండటంతో ఇండిగో సంస్థ వరుసగా ఆ ప్రాంత జిల్లాలకు సర్వీసులు నడిపేందుకు ఆసక్తి చూపుతోంది. అనంతపురం జిల్లాలో పూర్తి స్థాయి విమానాశ్రయం లేదు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక విమానాశ్రయం ఉంది. ఈ విమానాశ్రయం కేవలం వీఐపీల కోసం, ట్రస్టుకు సంబంధించి ప్రైవేటు అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. అనంతపురం జిల్లాకు ఉన్న డిమాండ్ రీత్యా ఈ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా అయినా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనంతపురం జిల్లాలో కొత్త విమానాశ్రయ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీనికి కేంద్ర పౌర విమానయాన సంస్థ కూడా ఆమోదముద్ర తెలిపింది. ఈ విమానాశ్రయ నిర్మాణానికి 1200 ఎకరాల భూములు అవసరం కాగా.. సేకరణ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూములను సేకరించి నూతన విమానాశ్రయం నిర్మించే వరకైనా పుట్టపర్తి ట్రస్ట్ అధీనంలో ఉన్న ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా పౌర విమానయానానికి కూడా ఉపయోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రాయలసీమకు సర్వీసులు ఎందుకు పెరుగుతున్నాయి ?

బెజవాడ నుంచి రాయలసీమ ప్రాంతానికి రోడ్డు మార్గం చాలా దూరం. రైల్వే అనుసంధానం ఉన్నా.. తగిన సంఖ్యలో రైళ్లు లేవు! ఈ కారణంగా విమానయానం ఊపందుకుంటోంది. రోడ్డు, రైలు మార్గాలతో పోల్చుకుంటే రాయలసీమ ప్రాంతాలకు విమానయానమే సులువుగా ఉంటుంది. చార్జీలు కూడా రూ. 2500 ఆ మేర ఉండటం వల్ల ఇది ఏమంత భారంగా కూడా భావించటం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీమ ప్రజలు విమానయానమే బెస్ట్ అని భావిస్తున్నారు.

విశాఖపట్నం రూట్‌లో తగ్గిన డిమాండ్

ప్రాంతీయ విమానయానంలో విజయవాడ నుంచి విశాఖపట్నం రూట్‌లో షటిల్ సర్వీసులు ఉండాల్సింది పోయి ఈ మార్గంలో ఒకే ఒక్క విమాన సర్వీసు నడుస్తోంది. విజయవాడ - విశాఖల మధ్యన విమానయానం పెరగకపోవటానికి ప్రధానంగా సమాంతరంగా రోడ్డు, రైలు రవాణా వ్యవస్థలు ఉండటమే కారణం. రోడ్డు మార్గం కంటే కూడా రైలు మార్గం ఈ రెండు ప్రాంతాల ప్రజలకు బడ్జెట్‌గా అందుబాటులో ఉంటోంది. దీంతో విమానయానం పురోగమించటం లేదని తెలుస్తోంది.

స్కిల్‌హబ్ కేంద్రంలో జాబ్‌మేళా రేపు

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సహకారంతో బుధవారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్‌హబ్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపింది. జాబ్‌మేళాలో ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్, స్కిల్‌క్రాఫ్ట్, కేవీఎం ప్రాజెక్ట్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటాయని సీఆర్డీఏ తెలిపింది. సేఫ్టీ ఆఫీసర్స్, ట్రైనీ ఇంజనీర్లు, సర్వేయర్లు, సర్వీస్&సేల్స్ ఇంజనీర్లు, అసిస్టెంట్ టెక్నీషియన్, ఇంగ్లీష్&సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్లు, మార్కెటింగ్&రికవరీ ఎగ్జిక్యూటివ్, రికవరీ ఆపరేటర్స్ పోస్టులతో పాటు భవన నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు హాజరు కావచ్చని ప్రకటనలో పేర్కొంది. ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందని తెలిపింది. వేతనంతో పాటు ఇన్సెంటివ్, అలవెన్సులు కూడా లభిస్తాయని తెలిపింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపింది.

రాష్ట్రస్థాయి డిజైన్ పోటీలు

» ఆప్కో లేపాక్షి సంస్థల ఎండీ విశ్వ మనోహరన్

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ హస్త, చేనేత కళలకు ఆధునిక రూపమిచ్చే ఉద్దేశంతో ఆప్కో, లేపాక్షి సంస్థలు సంయుక్తంగా రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీలు ఈ నెల 17 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నట్టు సంస్థల ఎండీ విశ్వ మనోహరన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఈ పోటీలో భాగస్వామిగా ఉందన్నారు. ప్రముఖ హస్తకళలుగా గుర్తింపు పొందిన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి ప్రింట్లు, లెదర్ పప్పెట్రీ, వుడ్ కార్వింగ్‌లను ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. వీటితో పాటు నేత కళలుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, బందరులో నూతనంగా రూపొందించిన వస్త్రాలు సూక్ష్మ జ్ఞాపికల విభాగంలో కొత్తదనం ఉట్టిపడేలా కొత్త డిజైన్లను ఆహ్వానిస్తున్నామన్నారు. పోటీల్లో రాష్ట్రానికి చెందిన 18ఏళ్లు పైబడిన కళాకారులు, నేతన్నలు, డిజైనర్లు, విద్యార్థులు పాల్గొనవచ్చని మనోహరన్ తెలిపారు. సృజనాత్మకత, సంప్రదాయ నైపుణ్యం, స్థిరత్వం వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను నిపుణుల కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. ప్రతి విభాగంలో మూడేసి బహుమతుల చొప్పున మొత్తం 30 బహుమతులు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కొండపల్లి కోట టీడీపీదే..

(5వ పేజీ తరువాయి)

తేల్చలేదు. మూడున్నరేళ్ల తర్వాత హైకోర్టు నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లోని ప్రొసీడింగ్స్‌ను ఎన్నికల అధికారి, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య సోమవారం మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ, వైసీపీ సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. టీడీపీ చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబుకు 16 ఓట్లు, వైసీపీ చైర్మన్ అభ్యర్థి గుంజా శ్రీనివాసరావుకు 15 ఓట్లు వచ్చినందున చిట్టిబాబు విజయం సాధించినట్లు ప్రకటించారు. అలాగే, వైసీపీ అభ్యర్థుల కంటే ఒక ఓటు ఎక్కువగా రావడంతో టీడీపీ వైస్ చైర్మన్ అభ్యర్థులు కరిమికొండ విజయలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావులు కూడా విజయం సాధించారు. ఎంపీ ఓటు చెల్లదని, చెరి సమానంగా ఓట్లు ఉన్నాయని, టాస్ వేస్తే చైర్మన్ పదవి తనకు దక్కుతుందని ఆశ పెట్టుకున్న వైసీపీకి ఈ ఫలితం రుచించలేదు. చైర్మన్, వైస్ చైర్మన్లు ఎవరనేది ప్రకటించకుండా 24 గంటలు వాయిదా వేయాలని పట్టుబట్టారు. అయితే, ఇప్పటికే అనేక అభ్యంతరాల మధ్య పదవీకాలం నాలుగేళ్లు పూర్తయిందని, అభ్యంతరాలు ఉంటే కోర్టులోనే తేల్చుకోవాలని, ప్రస్తుతం హైకోర్టు నుంచి వచ్చిన ప్రొసీడింగ్స్‌లో ఉన్నది చదివి చైర్మన్ ఎవరనేది ప్రకటించాలని, మళ్లీ ఎన్నిక జరిపే అవకాశం లేదని, 2021లో చేతులెత్తే విధానం ద్వారా ఎంపీ టీడీపీకి వేసిన ఓటు చెల్లుతుంది లేనిది ఇప్పుడు చెప్పలేమని ఆర్డీవో పేర్కొన్నారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు సమావేశపు హాల్ నుంచి వెళ్లిపోయారు.

శాతవాహనలో ధనకార్యాలు

(5వ పేజీ తరువాయి)

గొడవల నేపథ్యంలో తాననుకున్న ఆలోచనను అమలు చేయటానికి సదరు నేతతో ఈ షాడో సంప్రదింపులు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కిడ్నాప్ డ్రామా సృష్టించింది కూడా షాడోనేనని సమాచారం.

డెవలప్‌మెంట్ మాయ

శాతవాహన స్థలాన్ని మరికొందరితో కలిసి స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు షాడో అతిపెద్ద మోసానికి తెరతీశారు. ప్రజాపతిరావు డిజిటల్ సిగ్నేచర్‌ను వాడుకుని కోర్టును కూడా తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. కోర్టుకు ఇచ్చిన లేఖ తనది కాదని ప్రజాపతిరావు బహిరంగంగా చెబుతున్నారు. శాతవాహన కళాశాల స్థలంలో కొంత తమదని వాదిస్తున్న వారితో ఈ షాడో చేతులు కలిపినట్టు తెలుస్తోంది. తద్వారా శాతవాహన కళాశాల స్థలం మొత్తం డెవలప్‌మెంట్‌కు ఇచ్చుకోవచ్చన్నది ఎత్తుగడ. నగరంలో ఓ మాల్ నిర్వాహకుడితో చేతులు కలిపి డీల్ కూడా కుదుర్చుకున్నట్టు సమాచారం. శాతవాహన కళాశాలలో జరిగిన ఈ అక్రమాలన్నింటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది.

తెరపైకి మెట్రో ప్రధాన స్టేషన్

(5వ పేజీ తరువాయి)

కారిడార్లతో పాటు మూడో దశలో చేపట్టే జక్కంపూడి కారిడార్-4 కూడా అనుసంధానమవుతుంది. వీటన్నింటి నేపథ్యంలో ఎన్‌హెచ్-65పై ప్రధాన మెట్రోస్టేషన్ నిర్మించాలని భావిస్తున్నారు. లైట్ మెట్రో ప్రతిపాదన సమయంలో కొత్త డిజైన్ వచ్చింది. మళ్లీ సాధారణ మెట్రోకు వెళ్లాలని నిర్ణయించటంతో పాత డిజైన్‌పై ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. పాత డిజైన్‌లో స్వల్ప మార్పులు చేసి ఇంకాస్త ఆధునికీకరించాలని మెట్రో అధికారులు భావిస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102,110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రభుత్వాసుపత్రి: సూర్యారావుపేట సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై సోమవారంవిద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. విద్యుత్ విజిలెన్స్ ఈఈ విజయకుమారి, సూర్యారావుపేట సెక్షన్ అధికారుల ఆధ్వర్యంలో 45 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసి 163 మందిపై కేసులు నమోదు చేసి, రూ.8.72 లక్షల జరిమానా విధించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే 8331020537, 8440812362, 8331014951 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీలలో టౌన్ డివిజన్‌ఈఈ పి. రవీంద్రబాబు, విజిలెన్స్ ఏడీఈలు, ఏఈలు, డి3 సబ్ డివిజన్ ఏడీఈ పి.శ్రీధర్, సూర్యారావుపేటసెక్షన్ ఏఈ, అధికారులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యానికి కూటమి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



అతిసారపై అవగాహన పోస్టర్లను విడుదల చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి, తదితరులు

భారతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని నాల్గో డివిజన్ ఏపీఐఐసీ కాలనీలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్య, ఆరోగ్యాన్ని తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించేందుకు చూస్తున్నారని అన్నారు. అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఆరువారాల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి అతిసార వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందజేస్తారన్నారు. అతిసార వ్యాధిపై అవగాహన పోస్టర్లను ఎమ్మెల్యే గద్దె ఆవిష్కరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి మాట్లాడుతూ అతిసార వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బడుగు కార్తీక్, గొల్లపూడి నాగేశ్వరరావు, చలిమిశెట్టి రాజమణి, ఉమమహేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

సంక్షేమమే అజెండాగా ముందుకు

పటమట: సంక్షేమమే అజెండాగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. అశోక్‌నగర్ పార్టీ కార్యాలయంలో 3, 8, 15, 16 డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అందరి ఏకాభిప్రాయంతో సామాజిక సమీకరణలను బేరీజు వేసుకొని ప్రతి డివిజన్‌లో కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. తూర్పు పరిశీలకులు వెలగపూడి శంకర్ బాబు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీల జాబితాలను తూర్పు పార్టీ కార్యాలయంలో అందజేయాలని, వాటిని రాష్ట్ర కార్యాలయాలకు పంపి వారి అనుమతి తర్వాత ఫలితాన్ని ప్రకటిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఉయ్యూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కొండా ప్రవీణ్, సిద్దెం నాగేంద్ర రెడ్డి, చెన్నుపాటి గాంధీ, ఉషారాణి, బాబూరావు, లక్ష్మిపతి, రత్నం రమేష్, పాల్గొన్నారు.

విజయవాడ సమగ్రాభివృద్ధికి డీపీఆర్ రూపొందిస్తున్నాం

విజయవాడ సమగ్రాభివృద్ధికి డీపీఆర్ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి వాటిని ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింద ఇప్పటికే రూ.3 కోట్లకు పైగా చెక్కులు అందించామన్నారు. ఎంపీ నిధులు రూ. కోటితో ఆటోనగర్‌లోని చెత్త సమస్యను, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. డీపీఆర్ ప్రకారం ఎన్నికోట్లు మంజూరు చేసేందుకు అయినా సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో ముగ్గురు ఉద్యోగులకు సేఫ్టీ అవార్డులు



దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నుంచి అవార్డు అందుకుంటున్న రైల్వే ఉద్యోగులు

రైల్వేస్టేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లోని ముగ్గురు ఉద్యోగులకు దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం ఎంప్లాయి ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులను అందచేశారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన రైల్వే భద్రత, వ్యవస్థలో లోపాలను గుర్తించి సరిచేయటం, తనిఖీలు చేయటం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్, ప్రధాన విభాగాధిపతులు, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల నుంచి డీఆర్‌ఎంలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడడివిజన్‌కు చెందిన నిడమానూరు ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ పాయింట్స్‌మెన్ ఎస్.కె.నాగుర్‌వలికి, చినగంజాం పాయింట్స్ మెన్ బి.నరసింహకు, ఆపరేషన్ డిపార్టుమెంట్‌కు చెందిన గూడ్స్ లోకో పైలట్ యు.శ్రీనివాసరావుకు ఎంప్లాయి ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డును అందించారు.

పోర్న్ వ్యసనపరులను బాధితులుగా చూడండి

● సైకాలజిస్టు బి.గంగాధర్



కౌన్సెలింగ్ సమావేశంలో పాల్గొన్న సైకాలజిస్టు గంగాధర్, రమేష్, సైకాలజిస్టులు

పటమట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోర్నోగ్రఫీ ఎడిక్షన్ నేరం కాదని రిసోర్స్ పర్సన్ క్లినికల్ సైకాలజిస్టు బి.గంగాధర్ అన్నారు. అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం పటమట స్పార్క్ సైకలాజికల్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోర్నోగ్రఫీ బారిన పడిన వారిని బానిసలుగా కాకుండా బాధితులుగా చూడాలన్నారు. ఏపీఏఐ నేషనల్ సెక్రటరీ రాజేశ్వరి మాట్లాడుతూ లైంగిక విజ్ఞానం చిన్నవయస్సు నుంచే నేర్పాలన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, సైకాలజిస్టు లయన్ డాక్టర్ బావిశెట్టి రమేష్ మాట్లాడుతూ పిల్లల్లో సేవా భావం, ఆధ్యాత్మికతను పెంపొందిస్తే పోర్నోగ్రఫీ ఎడిక్షన్ చాలా తక్కువ ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ట్రెజరర్ తేజ, నలుమూల నుంచి సైకాలజిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, శివాలయం వీధి, డోర్ నెం.11-49-175, 3వ ఫ్లోర్, కాపురస్తురాలు శివరాం నటరాజ శేఖర్ గారి భార్య శివరాం సులోచన గారి సమాజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయుడమయినది ఏమనగా నా క్లయింట్ కృష్ణాజిల్లా మచిలీపట్నం, గొడుగుపేట, డోర్ నెం.7/345, పిసిపాటి భవాని శంకరయ్య గారి కుమారుడు పిసిపాటి చంద్రశేఖరరావు గారి వద్ద నుండి ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు కొంత రొక్కమును అడ్వాన్స్‌గా ఇచ్చి విక్రయ ఖరారు చేసుకొని దరిమిలా విక్రయ దస్తావేజు రిజిస్టర్ చేయించుకొనదలిచారు. కావున ఎవరికయినను ఎట్టి అభ్యంతరములు కానీ కోర్ట్ వారి ఇంజక్షన్స్ కానీ స్టేలు కానీ ఏమన్నా ఆర్డర్స్ ఉన్న యెడల ఈ తేదీ లగాయతు ఒక వారం రోజులలో ఈ క్రింది చిరునామాకు ఆధారాలతో లిఖితపూర్వకంగా RLAD విత్ Ack. ద్వారా తెలియజేయగలరు లేని యెడల తదుపరి వచ్చు క్లెయిమ్లు నా క్లయింట్‌ని బైండ్ చేయజాలవు. **ఐటమ్ నెం.1:** ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన శివాలయంవీధి, రెవిన్యూ వార్డ్ నెం.2, బ్లాక్ నెం.3, NTS No. 389/1, దాఖలా చ.గ 559.84చ్లు లేక 468.099 చ.మీ ర్లు, డోర్ నెం.11-49-175లో అవిభాజ్యపు అవిభాజ్యపు చ.గ 35ర్లు లేక 29.26 చ.మీ ర్లు జాయింట్ స్థిరాస్తికి **హద్దులు:- తూ:** పాత శివాలయం ఆస్తి కొంత ఇతరుల ఆస్తి కొంత, **ద:** యం.వి. నాగేశ్వర గుప్త వగైరాల ఆస్తి, **ప:** నేరెళ్ల విద్యానంద్ గారి ఆస్తి కొంత కన్యాకాపరమేశ్వరి సత్రం కొంత, **ఉ:** తెలుగుంట్ల వెంకటేశ్వరరావు గారి ఆస్తి కొంత మున్సిపల్ రోడ్ కొంత. **ఐటమ్ నెం.2:** సదరు స్థలములో మొత్తంలో శ్రీ బాలాజీ టవర్స్ అను పేరుతో నిర్మించబడిన అపార్టుమెంటులో చ. అ. 937 ల ప్లింత్ ఏరియా గల గ్రౌండ్ ఫ్లోర్ G2 ఫ్లాటుకి మరియు 20 చ.అ.లు కామన్ ఏరియా 20 చ. అ. పార్కింగ్ కి **హద్దులు :- తూ:** ఓపెన్ టు స్కై, **ద:** ఓపెన్ టు స్కై, **ప :** కామన్ కారిడార్ మరియు మెట్లు, **ఉ :** ఓపెన్ టు స్కై.

G. N. V. D. N. SURESH, Advocate
R/o. 2F-302, # 76 -8 /6 -19 /6,
MSN SUNRISE APARTMENT,
Gudivada Ramarao Street, Bhavanipuram,
VIJAYAWADA-520012. Mobile : 9440230315.

అంతిమయాత్ర భవన్ లేక అవస్థలు

- స్వర్గపురిలో మార్చురీ ఉన్నా మహిళలు, పిల్లలు వెళ్లేందుకు ఇబ్బంది
- ఇంటి ముందు మృతదేహాలను ఉంచేందుకు యజమానుల అభ్యంతరం
- 15 నుంచి 22 డివిజన్ల ప్రజలకు అందుబాటులో నిర్మించాలి
- ఎమ్మెల్యే గద్దె ఈ విషయంపై దృష్టి సారించాలంటూ స్థానికుల వినతి

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి : కృష్ణలంకలో అంతిమయాత్ర భవన్ లేక అద్దెదారులు చాలా అవస్థలు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గంలో 21 డివిజన్లు ఉండగా బందరు కాల్వ వెంబడి దాదాపు 15, 16, 17 18, 20, 21, 22 డివిజన్లు (7 డివిజన్లు) ఉన్నాయి. ఈ డివిజన్లలో 70 శాతం మంది (లక్షన్నర మందికి పైగా) అద్దెదారులే నివసిస్తుంటారు. బంధువులు ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని ఇంటి ముందు పెట్టేందుకు ఇంటి యజమానులు అంగీకరించకపోవడంతో అద్దెదారులు బాధలు వర్ణనాతీతం. రామలింగేశ్వరనగర్ నుంచి స్వర్గపురి వరకు వున్న ఏడు డివిజన్ల ప్రజలకు సత్యం హోటల్ సెంటర్ వద్ద, అమెరికన్ ఆస్పత్రి వద్ద జాతీయ రహదారి వెంబడి బందరు కాల్వ ఒడ్డున కర్మల భవన్‌లు ఉన్నప్పటికీ అంతిమయాత్ర భవన్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి వద్ద మృతదేహాన్ని ఉంచేందుకు ఇంటి యజమానులు అంగీకరించకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో గాని, స్వర్గపురిలో వున్న గదిలో గాని మృతదేహాన్ని ఉంచుతున్నారు. అయితే స్వర్గపురి శ్మశానవాటికలో మార్చురీ ఉన్నా అక్కడ మహిళలు, పిల్లలు ఉండేందుకు ఇబ్బందిగా ఉంటోంది. హిందూ సంప్రదాయం ప్రకారం మహిళలు, పిల్లలు శ్మశానవాటికకు వెళ్లరు. ఈ ఇబ్బందిని గమనించిన సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు లోటస్ ల్యాండ్ మార్క్ ఎదురుగా కాల్వ ఒడ్డున అంతిమ యాత్ర భవన్‌ను నిర్మించారు. దీంతో కృష్ణలంకలో ఉండే అద్దెదా రులు తమ బంధువుల మృత దేహాలను అక్కడికే తరలిస్తున్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ విషయంపై దృష్టిసారించి బందరు కాల్వ వెంబడి కృష్ణలంక పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా అంతిమయాత్ర భవన్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణలంక ప్రాంతంలో అంతిమయాత్ర భవన్ నిర్మించాలి



కృష్ణలంక ప్రాంతంలో అంతిమ యాత్ర భవన్‌ను నెలకొల్పాలి. 15 రోజుల క్రితం మా అన్నయ్య మృతి చెందితే ఇంటి యజమానులు మృతదేహాన్ని ఇంటి వద్ద ఉంచడానికి ఒప్పుకోలేదు. దీంతో రెండు రోజులు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో, మరో రోజు ప్రభాస్ కాలేజీ వద్ద వున్న అంతిమ యాత్ర భవన్‌లో మృతదేహాన్ని పెట్టాల్సి వచ్చింది. అదే కృష్ణలంక ప్రాంతంలో బందరు కాల్వ ఒడ్డున అంతిమయాత్ర భవన్ ఉంటే అంతిమయాత్ర క్రతువులకు వీలుగా ఉంటుంది. ఎమ్మెల్యే గద్దె ఈ సమస్యపై దృష్టి సారించాలి. -లొల్లా కృష్ణమోహన్

స్వర్గపురిలో మార్చురీ గది ఉన్నా...



స్వర్గపురి శ్మశాన వాటికలో మృత దేహాలను భద్రపరి చేందుకు మార్చురీ గది ఉన్నా అక్కడ రెండు మూడు రోజుల పాటు మృతదేహాన్ని పెట్టి మహిళలు, పిల్లలు వెళ్లాలంటే వీలు కాదు. బందరు కాల్వ ఒడ్డునే కర్మల భవన్‌లకు సమీపంలో ఎక్కడైనా సరే అంతిమయాత్ర భవన్‌ను నెలకొల్పాలి

-నిమ్మల జ్యోతిక



వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు

రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎ.సత్యానందం

పటమట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవిత చరమాంకానికి చేరుకున్న వృద్ధులు పసి పిల్లలతో సమానమని, అటువంటి వారిని వేధిస్తే కఠిన చర్యలు తప్పవని మండల లీగల్ సర్వీసెస్ విజయవాడ , రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎ.సత్యానందం హెచ్చరించారు. పటమట సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పటమట కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పెరిగి పెద్దవారు కాగానే తల్లిదండ్రుల ఆస్తులు రాయించుకొని వారిని నిరాదరణకు గురి చేస్తున్నారని, వారిమీదే భౌతిక దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు క్షమించరాని నేరమని, ఈతరహా ఘటనలను తమ దృష్టికి తీసుకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సూర్యదేవర పాపారావు, బాబూరావు, వెంకటేశ్వర రావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊర్మిళా నగర్, గాంధీజీ కాలనీ, లెనిన్‌నగర్, షిరిడిసాయి నగర్, ఆదర్శకాలనీ, ప్రశాంత్ కాలనీ, మురళీనగర్, ఎస్‌ఎల్‌వీ ఏరియా, డాన్‌బాస్కో స్కూల్ ఏరియా, ఇన్నర్ రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అసోసియేషన్ సభ్యులు

యోగాసన, చిత్రలేఖనం పోటీలు 19న

లబ్బీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సర్వోదయ ట్రస్టు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో యోగాసన పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ ట్రస్టు విజయవాడ అధ్యక్షుడు జి.వి మోహన్ ప్రసాద్, సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు.

ఈ పోటీల్లో స్కూల్, కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చని, ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, గెలిచిన వారికి మెరిట్ సర్టిఫికేట్లు, బహుమతులు, పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. 19న ఉదయం 6 నుంచి8 గంటల వరకు యోగా, 10 నుంచి 12 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు బందరులాకుల వద్ద గల స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరుగుతాయని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు 9441119909, చిత్రలేఖనం పోటీలో పాల్గొనే వారు 9502944913 నంబరులో సంప్రదించాలని కోరారు.

లయోలా నూతన ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ మెల్చియర్ బాధ్యతల స్వీకరణ



నూతన ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ మెల్చియర్‌ను సన్మానిస్తున్న సగయరాజ్ , ఫాదర్ డాక్టర్ పి.ఆర్.జాన్,తదితరులు

భారతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాలలో కరస్పాండెంట్ డాక్టర్ ఎం. సగయరాజ్ ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి వార్షిక ఓరియంటేషన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన ప్రిన్సిపాల్‌గా ఫాదర్ డాక్టర్ ఎస్. మెల్చియర్ బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ డాక్టర్ పి.ఆర్.జాన్, స్టాఫ్ అసోసియేషన్ చైర్మన్ జి. సహాయ భాస్కరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలతో
అంబేడ్కర్‌నగర్ కాలనీవాసుల పాట్లు

● తాగునీరు కలుషితం, భయాందోళనలో ప్రజలు

రామలింగేశ్వరనగర్,ఆంధ్రజ్యోతి: మంచినీటి సమస్యలతో అంబేడ్కర్ నగర్ కాలనీ ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మంచినీటి సరఫరా కోసం రిజర్వాయరు ఉన్నా తగినంతగా నీటి సరఫరా జరగటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కూడా పరిశుభ్రంగా ఉండటం లేదంటున్నారు. ట్యాంకును సరిగా శుభ్రపరచక పోవడం, పైప్ లైన్లు కలుషితమవ్వడం వల్ల కానీ తరచూ మురికి నీరు వస్తుందని, దీనివలన నీటిని తాగలేని పరిస్థితి ఏర్పడిందంటున్నారు. తప్పక మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సి వస్తుందని, కొనలేని వాళ్లు ఆ నీటినే తాగాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు. ఈ నీరు తాగడం వల్ల డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రెండు పూటలా కొద్ది సమయం మాత్రమే తాగునీరు సరఫరా చేయడం వల్ల సరిపోవడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను శుభ్రపరిచి, పైపు లైన్లను తనిఖీ చేసి తాగునీరు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





మూడో డివిజన్ నాగార్జున నగర్ కాలనీలో పలు అంతర్గత రోడ్లలోని పైపుల లీకులతో తాగునీరు వృథాగా పోతుంది. నాగార్జున నగర్ కాలనీలోని ఐదో రోడ్డు, శ్రీ రాజేశ్వరి రెసిడెన్సీ సమీపంలో, పలు అంతర్గత రోడ్లో ఉన్న తాగునీటి పైపులు ధ్వంసమయ్యాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో కుళాయిలు వదిలిన ప్రతిసారి తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పదించి తక్షణమే మరమ్మతులు చేయాలని కాలనీపెద్దలు కోరుతున్నారు. -భారతీనగర్,ఆంధ్రజ్యోతి



యోగా విశిష్టతను వివరిస్తున్న ప్రిన్సిపాల్ ఎ.ఏడుకొండలు

యోగా జీవన విధానంలో భాగం కావాలి

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు

ప్రభుత్వాసుపత్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగా సాధన అనేది ఒక్క రోజుకే పరిమితం కాకూడదని దైనందిన జీవనంలో భాగం కావాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు సూచించారు. యోగాంధ్ర 2025లో భాగంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శి రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు సోమవారం కామన్ యోగా ప్రొటోకాల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ● డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం అనుబంధ వైద్య, దంత, ఆయుష్, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల్లో సోమవారం గంట పాటు కామన్ యోగా ప్రొటోకాల్స్ నిర్వహించారు.



రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన సెమినార్‌లో డాక్టర్ వర్ష పాటిల్‌తో సఫాయివాలాలు, గ్రూప్ డి సిబ్బంది, స్కౌట్స్ గైడ్స్ సభ్యులు

రుతుక్రమ పరిశుభ్రతపై సెమినార్

రైల్వేస్టేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వేస్టేషన్‌లో సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ రుతుక్రమ పరిశుభ్రతపై ఒక ప్రత్యేక సెమినార్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సంస్థ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ వర్ష పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల ఆరోగ్యంలో పరిశుభ్రత కీలక పాత్రపై ఆమె మాట్లాడారు. అనంతరం సఫాయివాలాలు, గ్రూప్ డి సిబ్బంది సహా 80 మందికి పైగా మహిళా ఉద్యోగులకు శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారు.

స్కౌట్స్, గైడ్స్ సభ్యులు వ్యక్తిగత కార్యాలయ పరిశుభ్రతపై రూపొందించిన పోస్టర్లను డాక్టర్ వర్ష పాటిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు, స్టేషన్ డైరెక్టర్ విజయవాడ డివిజన్ ప్రజా సంబంధాల అధికారి పాల్గొన్నారు.



కేబుళ్లతో కళావిహీనం

- నగర సౌందర్యానికి విఘాతం
- వాహన, పాదచారులకు ఇబ్బందే



రాష్ట్రానికి రాజధాని నగరంగా పేరుతెచ్చుకున్న విజయవాడకు రోజూ లక్షలాది మంది వచ్చిపోతుంటారు. దీంతో నగరంలో కళకళలాడుతుంటుంది. అయితే, నగర సౌందర్యానికి, భద్రతకు ముప్పు తెచ్చేలా కేబుల్ వైర్లు మారుతున్నాయి. బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్, రమేశ్ హాస్పిటల్, గవర్నమెంట్ హాస్పిటల్, రామవరప్పాడు సిగ్నల్స్ వంటి కీలక ట్రాఫిక్ పాయింట్ల వద్ద సిగ్నల్ పోల్స్ చుట్టుకుని చిక్కుముడుల్లా, అస్తవ్యస్తంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు నగరవాసులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇవి ఎప్పుడైనా తెగిపడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రానున్న వర్షాకాలంలో విద్యుత్ షాక్ లేదా షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలకు దారితీయొచ్చు. ఈ వైర్లు సిగ్నల్ పోల్స్‌ను చుట్టుకుని సిగ్నల్స్ సరిగా కనిపించనీయకుండా చేసి, వాహనదారుల దృష్టిని మళ్లించి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తక్కువ ఎత్తులో వేలాడుతూ పాదచారులకు, ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఆటంకంగా మారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. నగర సౌందర్యాన్ని సైతం దెబ్బతీస్తోంది. విజయవాడ వంటి పర్యాటక, వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నగరంలో ఈ అస్తవ్యస్త వైర్లు నగర ఇమేజ్‌ను దిగజారుస్తున్నాయి. వీటిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. భూగర్భ కేబుల్ వ్యవస్థను అమలు చేయడం, వైర్లను క్రమబద్ధీకరించడం వంటి పరిష్కారాలు నగర భద్రత, సౌకర్యం, సౌందర్యాన్ని పెంచడమే కాక, ప్రమాదాలను నివారిస్తాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు

మహిళా పీఎస్‌కు కొత్త కళ

- ఆధునికీకరించిన భవనం ప్రారంభం

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పీసీఆర్ జంక్షన్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్‌కు కొత్తదనం వచ్చి చేరింది. ఈ పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సోమవారం దీన్ని ప్రారంభించారు. ఇందులో కొత్తగా చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ ప్లే రూమ్‌లను ఏర్పాటు చేశారు. పోక్సో కేసుల్లో స్టేషన్‌కు వచ్చే బాధితులను విచారించడానికి ఈ కార్నర్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. అలాగే ఏసీపీ, మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి చాంబర్లను ఏర్పాటు చేశారు. అధికారులకు చాంబర్లు, కోర్టు రూం, రిసెప్షన్, మహిళా హెల్ప్‌డెస్క్, కౌన్సెలింగ్ సెంటర్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగాలకు వేర్వేరు చాంబర్లు నిర్మించారు. డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వర రెడ్డి, ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీలు ప్రసన్న కుమార్, ఏసీపీలు లతాకుమారి, స్రవంతిరాయ్, పావన్ కుమార్ పాల్గొన్నారు.

సొంత మండలాల్లో బదిలీలు కల్పించాలి

- గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల పరిధిలో బదిలీలు కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేశారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో గ్రామవార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా మాట్లాడుతూ విధుల్లో చేరినప్పటి నుంచి న్యాయంగా రావాల్సిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. సచివాలయంలో మంత్రి అందుబాటులో లేకపోవడంతో మంత్రి కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశామని, మంత్రి దృష్టికి వెంటనే తీసుకెళ్లాలని మంత్రి కార్యాలయ అధికారులను కోరామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మ ఉన్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎన్ పాలెం వద్ద హనుమాన్‌జంక్షన్ బైపాస్‌పై (జాతీయ రహదారి) రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. రహదారి పక్కనున్న హోటల్ (డాబా) వైపు నుంచి వెళుతూ రోడ్డు దాటే క్రమంలో ఏలూరు నుంచి విజయవాడ వైపునకు వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టడం వల్ల వ్యక్తి రోడ్డు పక్కకు పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి పూట కావడం, రహదారిపై లైట్లు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యక్తి ఆచూకీ కోసం ఘటనా స్థలానికి పక్కనే ఉన్న ఎస్ఎన్ పాలెం, కే సీతారాంపురం గ్రామాలతో పాటు హోటళ్లలోనూ వాకబు చేశామని, కానీ ఎవరనేది తెలియలేదని ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

నాగాయలంకలో నేడు జలయోగా ప్రదర్శన

- యోగా డేను పురస్కరించుకుని శ్రీరామపాదక్షేత్రంలో ఏర్పాట్లు



నదిలో తేలుతూ ఆసనాలు వేస్తున్న జలయోగా అభ్యాసకులు, శిక్షణ పొందుతున్న చిన్నారులు, మత్స్యకారులు

అవనిగడ్డ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ మురిసేలా యావత్ దేశం కృష్ణాజిల్లా వైపు తలతిప్పి చూసేలా ముందెన్నడూ జరగని రీతిలో నాగాయలంక వద్ద కృష్ణానదిలో యోగా డే నిర్వహించేందుకు జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు. సాధారణంగా నేలపై యోగాసనాలు సాధన చేయటం సర్వసాధారణం. కాగా అటుపోట్లను, అలల తాకిడిని అధిగమిస్తూ నీటిపై తేలియాడుతూ వందల సంఖ్యలో అభ్యాసకులతో నాగాయలంకలో ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాటు చేస్తుండగా, గత మూడు రోజులుగా నదిపై తేలియాడుతూ యోగాను అభ్యసిస్తున్న వారితో శ్రీరామపాద క్షేత్రం కళకళలాడుతోంది.

రాష్ట్రంలో తొలిసారిగా దివిసీమలో..

యోగా డేను పురస్కరించుకుని నదిలో యోగాసనాలు వేయించాలన్న తలంపుతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవ చూపటంతో ఈ జలయోగాకు అధికారులు శ్రీకారం చుట్టారు. నదిపై తేలుతూ శవాసనం, వృక్షాసనం, పద్మాసనం, ధనురాసనాలు వేసే అభ్యాసకులు స్థానికంగా ఉన్న విషయాన్ని గుర్తించిన అధికారుల బృందం వారిని ప్రోత్సహించటంతోపాటు ఈ కళను నేటి తరానికి అందించాలన్న సదుద్దేశంతో ఈ జలయోగాకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కృష్ణానదిలో నిత్యం ఈత అభ్యసించే పలువురు ఈ ఆసనాలను క్రమం తప్పకుండా వేస్తుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈతవచ్చిన వారిని శ్రీరామపాదక్షేత్రానికి రప్పించి బుధవారం మధ్యాహ్నం భారీ జలయోగా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు.



ధర్నాలో పాల్గొన్న గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

గత ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో సమస్యలు

గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

ధర్నాచౌక్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగమనే ఆశతో ఎక్కువ జీతాలు పొందే ప్రైవేట్ ఉద్యోగాలను వదిలి ఈ ఉద్యోగంలో చేరిన తాము గత ప్రభుత్వ అవగాహనరాహిత్య చర్యలతో నేటికీ తమ సమస్యలు తీరలేదని గ్రామ సచివాలయ వ్యవస్థలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అన్యాయనికి గురవుతూ భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి షణ్ముఖ, బి శంకర్రావు మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థలోని ఉద్యోగులు ఒక శాఖ బాధ్యతలు మాత్రమే నిర్వహిస్తుండగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మాత్రం కనీసం 4 శాఖల బాధ్యతలు నిర్వహిస్తు తీవ్ర పని భారం మోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు తమ సమస్యలను మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోయారు. తమకు పదోన్నతులతో పాటు సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. ధర్నాలో పలువురు సంఘం నేతలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉన్న గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విఘ్నాలు రాకుండా మహాగణపతి రక్షించాలి

- ఎంపీ కేశినేని శివనాథ్ తనయుడు వెంకట్
- నటుడు సుమన్‌తో కలిసి మట్టి వినాయక విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న వెంకట్, సుమన్

విద్యాధరపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన రాజధాని అమరావతి నిర్మాణానికి, రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు రాకుండా ఆ విఘ్నాధిపతి కాపాడాలని, రాష్ట్ర ప్రజలందరిపై ఆ మహా గణపతి ఆశీస్సులుండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ కోరారు. డూండీ గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలోని లేబర్ కాలనీ గ్రౌండ్‌లో 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ జరిగింది. కేశినేని వెంకట్, సీనియర్ సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి డూండీ గణేష్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్‌తో పాటు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్ పూజ చేసి కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేయటంతో పాటు షెడ్డు నిర్మాణానికి కర్ర పూజ చేశారు. ఈ సందర్భంగా కేశినేని వెంకట్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహం రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేయటం ప్రజలందరి అదృష్టమన్నారు. అనంతరం సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని మించిన ఎత్తులో మట్టితో వినాయక విగ్రహం తయారు చేయటం చాలా గొప్ప విషయమన్నారు. ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డూండీ గణేష్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణం త్వరగా పూర్తి కావాలని, అభివృద్ధి ఫలాలు ప్రజలందరూ అందుకోవాలనే ఆకాంక్షతో మహా మట్టి గణపతి విగ్రహానికి భూమిపూజ చేయటం సంతోషంగా ఉందన్నారు. కమిటీ సభ్యులు గడ్డం రవి, పేర్ల రవి, ముక్తేశ్వరరావు, డీ సుబ్బారావు, చైతన్య నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షుడు శివశర్మ, పేరం సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నేత రేగళ్ల లక్ష్మణరావుతో పాటు టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ భూసర్వే తప్పిదం

తల్లికి వందనం పథకానికి అనర్హత

- ఓగిరాలలో వెలుగుచూసిన ఘటన
- 20 మందికి పైగా అందని తల్లికి వందనం
- ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో సరిచేస్తున్న అధికారులు



ఓగిరాలలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొమ్మారెడ్డి రాజేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం భూసర్వేలో చేసిన తప్పిదానికి ఓగిరాలకు చెందిన 22 బీసీ కుటుంబాలకు తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో ఈ ఘటన సోమవారం వెలుగుచూసింది. ఓగిరాలలోని రామచంద్రయ్య లంక సగరుల చేపల చెరువు గత ప్రభుత్వం నిర్వహించిన భూసర్వేలో బీసీలకు చెందిన 51 మంది పేరుతో ఒక్కొక్కరికీ 33 ఎకరాలున్నట్లు తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఈ 51 మంది ఎకరం లోపు భూమి ఉన్నవారే కావడం, హద్దులు తెలియక మొత్తం భూమి అందరిపేరుతో జాయింట్ ఎల్పీగా ఆన్‌లైన్‌లో నమోదవడం గమనార్హం. అందులో సుమారు 20 మందికి తల్లికి వందనం పథకం ప్రకారం నగదు జమ కాకపోవడంతో లబ్ధిదారులు 4 రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామంలోని అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఎమ్మెల్యే యార్లగడ్డను ఆశ్రయించారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ మురళీకృష్ణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొమ్మారెడ్డి రాజేష్ గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. భారీగా తరలివచ్చిన మహిళలు తమకు లేని భూమిని తమ పేరుతో నమోదు చేయడం వల్ల తల్లికి వందనం పథకానికి అనర్హులుగా తేల్చారని, పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా త్వరగా సరిచేయాలని కోరారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంఈవో రాంబాలాసింగ్, ఇతర అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. లబ్ధిదారుల పేర్లు, వారి వద్ద గల ఆర్‌వోఆర్‌ఆధారంగా భూవివరాలను విద్యాశాఖకు అందజేసి త్వరలోనే అర్హులైన వారందరికీ తల్లికి వందనం పథకం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీకృష్ణ హామీ ఇచ్చారు.

కళాత్మక యోగాతో మరింత చైతన్యం

- సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కళాత్మకమైన యోగాసనాలు, వాటిపై విభిన్న పోటీలు నిర్వహించి నైపుణ్యవంతమైన కళాకారులతో విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్నామని రాష్ట్రంలో 2.20 కోట్ల మంది యోగాసనాలను ఆచరించాలనే లక్ష్యంతో యోగాంధ్రకు రూపకల్పన చేసినట్టు సెంకడరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఏ సిరి చెప్పారు. గుంటుపల్లి డాన్‌బోస్కో స్కూల్లో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీల్లో పాల్గొనే టీమ్‌ను జిల్లా స్థాయి విజేతలను ఎంపిక చేసే ప్రక్రియ మూడు రోజులపాటు జరగనుంది. సోమవారం ఈ పోటీలను ఆమె, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫొటోగ్రఫీ, యోగా స్లోగన్ వంటి అంశాలపై జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించామన్నారు. కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 10 లక్షల మందికి యోగా శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంగా నిర్వహించుకున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ వీ రాణి, ఆయుష్ అధికారి డాక్టర్ రామత్లేహిలు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి యోగాకు ఎంపికైన వారితో ఉన్నతాధికారులు

యోగాసనాల పట్ల యువతలో చైతన్యం రావాలి: కలెక్టర్

సత్యనారాయణపురం: యువత నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతర యోగా దోహదపడుతుందని, శారీరక, మానసిక ఉల్లాసానికి యోగాసనాలు ఏకైక మార్గమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో సోమవారం జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్రలో రెడ్ క్రాస్ సభ్యులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జీ సమరం మాట్లాడుతూ రోజులో కొంత సమయం యోగాకు కేటాయించాలన్నారు. వైస్ చైర్మన్ వెలగా జోషి, ఎన్‌సీసీ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ కే రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, యోగా ట్రైనర్లు సత్యనారాయణ, యుగంధర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయం ఎదురుగా

భారీ కన్వెన్షన్ సెంటర్..!

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రతిపాదనలు
- నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి



ఆంధ్రజ్యోతి, విజయవాడ: బెజవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఎదురుగా భారీ కన్వెన్షన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. కృష్ణాజిల్లాలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ దిశగా అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయం ఎదురుగా ప్రభుత్వానికి సంబంధించి 12.50 ఎకరాల స్థలం ఉంది. ఎంతో విలువైన ఈ స్థలంలో కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్ణయించారు. అధికారులతో చర్చించి భారీ కన్వెన్షన్ సెంటర్‌కు ప్రతిపాదించారు. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ మినీ మహానాడులోనూ తీర్మానించారు. తర్వాత ఎమ్మెల్యే యార్లగడ్డ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఈ కన్వెన్షన్ సెంటర్ అవసరాన్ని వివరించారు. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దాదాపుగా 3 నుంచి 5 వేల సామర్థ్యంతో కూడిన విధంగా కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలన్నది ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే ప్రాంతంలో కమర్షియల్‌గానూ కార్యకలాపాలను పెంచేందుకు సమాంతరంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎంతో మంది ప్రముఖులు వస్తుంటారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల నేపథ్యంలో, విమానాశ్రయాల్లోనే గతంలో మీటింగ్స్ జరిగిన ఉదంతాలున్నాయి. ప్రస్తుతం అప్పటి కంటే 10 రెట్లకు పైగా రాజధానిలో పనులు జరుగుతున్నాయి. ఇలాంటపుడు రానున్న రోజుల్లో సమావేశాలకు వేదిక అవసరం ఉంటుంది. అందుకే విమానాశ్రయానికి అభిముఖంగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయగలిగితే ఆ కొరత తీరుతుంది. ప్రైవేటు సమావేశాలకు బదులు ఈ నూతన సెంటర్‌కు అనుమతులిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చు ఆదా అవుతుంది. ప్రజలకు కూడా అద్భుతమైన కన్వెన్షన్ సెంటర్ అందుబాటులో ఉంటుంది.

'మాదక' మహమ్మారిపై దాడిచేద్దాం

- అన్ని విద్యాసంస్థల్లోనూ ఈగల్ క్లబ్స్ ఉండాలి: కలెక్టర్ లక్ష్మీశ



మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారం దిశగా అడుగులేస్తూ మూకుమ్మడి దాడితో మాదక ద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు చేయి చేయీ కలుపుదామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఇందుకు ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని ఆదేశించారు. యోగాంధ్ర మాసోత్సవాలు ముగిసిన తరువాత నెలరోజుల పాటు మాదక ద్రవ్యాలపై పోరాటానికి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమన్వయ శాఖలు, ఎన్జీవోలు, డీఎల్ఎస్ఏ నిపుణుల భాగస్వామ్యంతో ర్యాలీలు, వాక్‌థాన్‌లు, సదస్సులు నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, ఈగల్ బృందాలు తీసుకొంటున్న చర్యలను డీసీపీ కేజీవీ సరిత వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 73 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 175 మందిని అరెస్టు చేసినట్టు వివరించారు. 1,054 కిలోల గంజాయిని సీజ్ చేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, సమన్వయ శాఖల అధికారులతో కలిసి డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాద్రేవు కామరాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీపీ కే వెంకటేశ్వరరావు, డీ అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ఈగల్ ఎస్ఐ ఎం వీరాంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌టి



నడివయసులో నెలసరి ఆగడం సహజమే! కాబట్టి మహిళలు దాన్నొక సహజసిద్ధ మార్పుగా అంగీకరించి సర్దుకుపోతూ ఉంటారు. కానీ నడి వయసులో సైతం మునుపటి చురుకుదనం తగ్గకుండా ఉండాలన్నా, దీర్ఘకాలం పాటు అంతర్గత అవయవాలన్నీ నిక్షేపంగా ఉండాలన్నా 'హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ'ని ఆశ్రయించక తప్పదు.

మెనోపాజ్‌కు ముందస్తుగానే సర్వసన్నద్ధం

ఆయుర్దాయం పెరిగింది. కాబట్టి మహిళల నడి వయసు 45 నుంచి 60 ఏళ్లకు పెరిగింది. ఇది సంతోషించవలసిన విషయమే! అయితే పిల్లల బాధ్యతలు తగ్గి కాస్త సేద తీరదామనుకునే ఈ వయసులోనే మహిళల మీద మెనోపాజ్ అనే అతి పెద్ద పిడుగు పడుతూ ఉంటుంది. ఒళ్లంతా ఆవిర్లు, చమటలు పట్టడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, నిస్సత్తువ, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, నీరసం, భావోద్వేగాలు అదుపు తప్పడం... లాంటి అసౌకర్యాలన్నీ ఒక్కసారిగా నడి వయసు మహిళలను అతలాకుతలం చేయడం మొదలుపెడతాయి. ఎక్కువ మంది మహిళలు ఇవన్నీ పైబడే వయసులో మామూలే అని సర్దుకుపోతూ ఉంటారు. కానీ మెనోపాజ్ లక్షణాలు భౌతికంగా మాత్రమే వేధిస్తున్నాయనుకుంటే పొరపాటు. ఈ మెనోపాజ్ దశ, ఎముకలు, కండరాలు, జననావయవాలు, గుండె మొదలైన అవయవాలన్నిటినీ దెబ్బతీస్తుంది. అప్పటి వరకూ ఆయా అవయవాలకు రక్షణ కల్పించే ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ పరిమాణాలు మెనోపాజ్‌తో క్షీణించడమే ఇందుకు కారణం. అయితే ఈ పరిస్థితిని తప్పనిసరిగా భరించవలసిన అవసరం ఏమాత్రం లేదు.

> **కుటుంబంలో** వైద్యపరమైన సహాయాన్ని అందుకునే సభ్యుల వరుసలో మహిళలు చివర్లో ఉంటారు. మొత్తం కుటుంబ అవసరతలను కనిపెట్టుకుని ఉండే మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. ఈ ధోరణికి చరమగీతం పలకాలి. మరీ ముఖ్యంగా హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ పట్ల మహిళల్లో భయాలను పెంచి, ఆ చికిత్సతో అందే ప్రయోజనాలను దక్కకుండా చేయడం కూడా సరి కాదు. కీలకమైన అంతర్గత అవయవాలన్నిటినీ ఆరోగ్యంగా ఉంచే ఈ థెరపీని తీసుకోగలిగితే, ప్రతి మహిళా తన నడి వయసును చలాకీగా, ఆరోగ్యంగా, ఆనందంగా గడపగలుగుతుంది.

పెరి మెనోపాజ్‌లోనే మొదలుపెట్టాలి

మెనోపాజ్ దశకు ముందు, నెలసరి స్రావం తగ్గడం, నెలసరి క్రమం తప్పడం, ఒంటి నుంచి వేడి ఆవిర్లు వెలువడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది మెనోపాజ్ ముందరి దశ అయిన పెరి మెనోపాజ్. ఈ పెరి మెనోపాజ్ దశ నుంచే 'హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ' మొదలుపెట్టాలి. ఈ థెరపీని పదేళ్ల వరకూ కొనసాగించవచ్చు. శరీరంలో తగ్గిన హార్మోన్ పరిమాణాలను భర్తీ చేసే ఈ చికిత్సతో, మెనోపాజ్ అసౌకర్యాలకు అడ్డుకట్ట పడడంతో పాటు, అంతర్గత అవయవాలన్నీ దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉంటాయి. అయితే మెనోపాజ్‌కు చేరుకుని, ఐదు నుంచి పదేళ్ల కాలం గడిచి పోయిన వాళ్లకు ఈ థెరపీతో అంతగా ప్రయోజనం ఉండదు. అన్నేళ్ల పాటు హార్మోన్ల లోపం ప్రభావానికి గురైన అవయవాలు ఈ థెరపీతో మళ్లీ కోలుకునే పరిస్థితి ఉండదు. కాబట్టి పెరి మెనోపాజ్‌లో, లేదంటే మెనోపాజ్‌కు చేరుకున్న రెండేళ్ల లోపే థెరపీ మొదలుపెట్టుకోవాలి. అయితే కొందరికి మెనోపాజ్‌లో ఆలస్యంగా లక్షణాలు బయల్పడవచ్చు. అలాంటి వాళ్లకు ఈ థెరపీ ప్రయోజనకరంగా ఉంటుంది. పదేళ్లుగా మెనోపాజ్‌లో ఉండి, ఎముకలు, కండరాల నొప్పులు, నిస్సత్తువలాంటి లక్షణాలతో బాధపడుతున్నవాళ్లు హెచ్‌ఆర్‌టికి బదులు, లక్షణాల ఆధారంగా చికిత్స తీసుకుని, పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చు.

హెచ్‌ఆర్‌టితో ప్రయోజనాలు

- పెరి మెనోపాజ్‌లోనే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ మొదలుపెడితే...
- యోని పొడిబారే సమస్య తొలగిపోతుంది
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు అదుపులో కొస్తాయి
- లైంగిక జీవితం మెరుగుపడుతుంది
- గుండెకు రక్షణ దక్కుతుంది
- ఎముకలు దృఢంగా ఉంటాయి
- జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది

ఈ పరీక్షలు తప్పనిసరి

హార్మోన్ థెరపీతో క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందనే అపోహలు ప్రచారంలో ఉండడంతో మహిళలు వెనకడుగు వేస్తూ ఉంటారు. కానీ ఈ థెరపీ విషయంలో వైద్యులు కొన్ని ప్రమాణాలను పాటిస్తూ ఉంటారు. ముందస్తు పరీక్షలతో, క్రమం తప్పని పర్యవేక్షణతో క్యాన్సర్ ముప్పు దరి చేరే అవకాశాలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ఈ థెరపీకి ముందు కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. అవేంటంటే...



- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించే పాప్‌స్మియర్
- ఎండోమెట్రియల్ క్యాన్సర్‌ను గుర్తించే అల్ట్రాసౌండ్ పరీక్ష
- రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే మామోగ్రామ్
- లిపిడ్ ప్రొఫైల్
- థైరాయిడ్ పరీక్ష
- కాలేయ పనితీరు పరీక్ష
- ఎముకల దృఢత్వాని పరీక్షించే డెక్సా స్కాన్
- కండరాల పటుత్వానికి సంబంధించిన పరీక్ష

> **ప్రస్తుతం** మన ఆయుష్షు పెరిగింది. దాంతో జీవిత దశల నిడివి, పరిభాష కూడా మారింది. మునుపు 45 నుంచి 50 ఏళ్లను నడి వయసుగా పరిగణించేవారు. కానీ ప్రస్తుతం, నడి వయసు నిడివి 45 నుంచి 65 ఏళ్లకు పెరిగింది. ఫలితంగా 1/3 వంతు జీవితాన్ని మహిళలు మెనోపాజ్ లోనే గడపవలసి ఉంటుంది. కాబట్టి ఆ జీవితాన్ని చలాకీగా, ఆరోగ్యంగా గడపగలిగేలా ఉండాలి. అందుకోసం హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీని పెరి మెనోపాజ్ దశ నుంచి కనీసం పదేళ్ల పాటు తీసుకోవాలి.

కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉంటే?

కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉంటే ఈ థెరపీని ఇవ్వలేని పరిస్థితి మునుపు ఉండేది. కానీ ఇప్పుడు అలా కాదు. కుటుంబంలో క్యాన్సర్ ఉన్నప్పటికీ, నిర్దిష్ట మహిళకు క్యాన్సర్ లేనప్పుడు, కచ్చితంగా థెరపీ తీసుకోవచ్చు. అయితే ఈ చికిత్స తీసుకుంటున్నంత కాలం ప్రతి మహిళా క్రమం తప్పకుండా వైద్యులు సూచించే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. రొమ్ముల పరీక్ష, మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ పరీక్షలు ప్రతి ఏటా చేయించుకోవాలి.

హెచ్‌ఆర్‌టి ఇలా...

మాత్రలు, ప్యాచెస్, చర్మం అడుగున అమర్చే వీలుండే ఇంప్లాంట్స్ రూపాల్లో హెచ్‌ఆర్‌టి తీసుకోవచ్చు. శరీర తత్వం ఆధారంగా ఒక్కొకరికి ఒక్కొక చికిత్స సరిపడుతుంది. మాత్రలతో పోలిస్తే ప్యాచెస్, ఇంప్లాంట్స్‌తో దుష్ప్రభావాలు తక్కువ. ఆరోగ్య కారణాలతో గర్భాశయాన్ని తొలగించిన మహిళలు ప్యాచెస్, లేదా ఈస్ట్రోజన్ మాత్రలు వాడుకోవచ్చు. కానీ గర్భాశయం కలిగి ఉన్న మహిళలకు ఈస్ట్రోజన్‌తో పాటు ప్రొజెస్టరాన్ కూడా అవసరమవుతుంది కాబట్టి రెండు రకాల మాత్రలు వాడుకోవాలి. కేవలం ఈస్ట్రోజన్ మాత్రమే అవసరమున్న మహిళలు, ఖర్చును భరించే స్థోమత కలిగినవాళ్లు ప్యాచెస్ వాడుకోవచ్చు.



మెనోపాజ్‌లో...

నడి వయసు మహిళల్లో కండర శక్తి తగ్గిపోతుంది. దాంతో నొప్పులు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా ఈ నొప్పులను కీళ్ల అరుగుదలగా పొరబడుతూ ఉంటారు. కానీ కండరాలను బలపరిచే వ్యాయామాలు చేస్తూ, ఆరోగ్యకరమైన ఆహారశైలిని అనుసరించగలిగితే నొప్పులు అదుపులోకొస్తాయి. నడి వయసుకు చేరుకున్న కొందరికి తరచూ మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు వేధిస్తూ ఉంటాయి. ఇలాంటి వాళ్లు కొంత కాలం పాటు వెజైనల్ క్రీమ్స్ వాడుకోవచ్చు. అలాగే అవసరాన్ని బట్టి ఎముకలను దృఢంగా ఉంచే కొన్ని సప్లిమెంట్లు వాడుకోవాలి. వంట చేయడం, ఇంటి పనులు వ్యాయామం కోవలోకి రావు. కాబట్టి నడక లాంటి వ్యాయామాలతో పాటు బరువులను ఎత్తే వ్యాయామాలు కూడా కొనసాగించాలి. అలాగే పౌష్టికాహారం తీసుకోవాలి. ఎముకల మీద బరువు పడకుండా ఉండేలా వ్యాయామాలతో కండరాలను బలపరుచుకోగలిగితే కీళ్ల నొప్పులు అదుపులోకొస్తాయి.



డాక్టర్ ఎ.మహిత రెడ్డి
అబ్‌స్ట్రెట్రిషియన్ అండ్ గైనకాలజిస్ట్,
అపోలో క్రేడిల్, జూబ్లీహిల్స్, హైదరాబాద్

మీకు తెలుసా?

వీటితో క్యాన్సర్ ముప్పు

మనం రోజూ తీసుకునే ఆహారపదార్థాలు క్యాన్సర్ కారకాలు కావచ్చని హార్వర్డ్ వైద్యులు, డాక్టర్ సురభ్ సేథీ హెచ్చరిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం!

ప్రాసెస్ చేసిన మాంసం: సాసేజ్‌లు, ముందస్తుగా ఉడికించి ఉంచిన మాంసాలను గ్రూప్ 1 క్యాన్సర్ కారకాలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వర్గీకరించింది. వీటితో ప్రత్యేకించి పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు ఉందనే స్పష్టమైన ఆధారాలున్నట్టు తేలిపోయింది. ఈ మాంసాల నిల్వ కోసం ఉపయోగించే నిల్వ పదార్థాలు, నైట్రేట్స్ పేగుల్లోని కణాలను దెబ్బతీసి, దీర్ఘకాలంలో క్యాన్సర్ కారక ఉత్పరివర్తనాలకు దారి తీస్తాయి. కాబట్టి ఈ రకం మాంసాహారానికి దూరంగా ఉండడం ఉత్తమం

తీపి పానీయాలు: శీతల పానీయాలు, తీయని ద్రవపదార్థాలు రక్తంలో చక్కెర మోతాదులను పెంచడానికి మించి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వీటితో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, రొమ్ము, పెద్దపేగు, క్లోమ క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. కాబట్టి తీయని పానీయాలకు బదులుగా కొబ్బరినీళ్లు, హెర్బల్ టీలు లాంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి

వేపుళ్లు: ఫ్రెంచ్ ఫ్రైస్, సమోసాలు, బజ్జీలను వేయించడం కోసం ఒకే నూనెను పదే పదే ఉపయోగిస్తూ ఉంటారు. దాంతో ఈ నూనెల్లో క్యాన్సర్ సంబంధిత కాంపౌండ్, అక్రిలమైడ్ తయారవుతుంది. కాబట్టి ఇలాంటి పదార్థాలను పదే పదే తినడం వల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్, తీవ్రమైన ఇన్‌ఫ్లమేషనుల పెరిగి, క్యాన్సర్ వృద్ధికి అనువైన పరిస్థితులు శరీరంలో చోటు చేసుకుంటాయి. కాబట్టి ఇలా నూనెలో వేయించడానికి బదులుగా బేక్ చేయడం లేదా ఎయిర్ ఫ్రైయింగ్ పద్ధతులను అనుసరించడం ఆరోగ్యకరం

కాల్చిన మాంసం: అత్యధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉండే గ్రిల్స్ మీద మాంసాన్ని కాల్చే సమయంలో డిఎన్‌ఎను దెబ్బతీసే హానికారక కాంపౌండ్లు విడుదల అవుతాయి. ఇవి క్యాన్సర్‌ను పెంచుతాయి. అలాగే గ్రిల్ చేయడానికి ముందు మాంసాన్ని నానబెట్టడం, రోజ్‌మేరీ లాంటి మూలికలను ఉపయోగించడం వల్ల ఈ ముప్పు కొంతమేరకు తగ్గుతుంది. అయితే



గ్రిల్‌కు బదులుగా ఆవిరి మీద ఉడికించడం, బేక్ చేయడం లేదా చిన్న మంట మీద ఎక్కువ సమయం పాటు ఉడికించడం సురక్షితం

మద్యపానం: మద్యంతో ఈస్ట్రోజన్ హార్మోన్ మోతాదు పెరిగి ఫోలేట్ శోషణ కుంటుపడుతుంది. ఈ పరిస్థితి డిఎన్‌ఎ మరమ్మతు యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తుంది. దీంతో హార్మోన్ సంబంధిత రొమ్ము, కాలేయ క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. కాబట్టి మద్యానికి బదులుగా పులియబెట్టిన నాన్ ఆల్కహాలిక్ పానీయాలైన బీట్‌రూట్ కాంజి, కంబూచ లాంటి సురక్షితమైన ఆరోగ్య ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

అధ్యయనం

అవి డిమెన్షియా సంకేతాలు కావచ్చు

మలి వయసు భావోద్వేగ సమస్యలు ముందస్తు డిమెన్షియా లాంటి నాడీక్షీణత జబ్బులకు సంకేతాలని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే....



40 ఏళ్ల తర్వాత తలెత్తే ఉన్మాదం, బైపోలార్ డిజార్డర్, మానసిక కుంగుబాటు లాంటి రుగ్మతలు కేవలం మానసిక రుగ్మలు మాత్రమే కావనీ, వివిధ నాడీక్షీణత వ్యాధుల లక్షణాలకు ముందు బయల్పడే ముందస్తు సంకేతాలు కావచ్చని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. జ్ఞాపకశక్తి క్షీణత బయల్పడడానికి ఎన్నో సంవత్సరాల ముందుగానే బయల్పడే ఈ లక్షణాలు నాడీక్షీణత రుగ్మత అయిన డిమెన్షియా ముప్పును సూచిస్తాయని, జపాన్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు పేర్కొంటున్నారు. అల్జీమర్స్ అండ్ డిమెన్షియాలో ప్రచురితమైన అధ్యయనంలో పరిశోధకులు, నాడీక్షీణత రుగ్మతలకు కారణమయ్యే అసాధారణ టౌ ప్రొటీన్, దాని ప్రభావాల గురించి ప్రస్తావించారు. ఈ ప్రొటీన్ ఉనికిని కనిపెట్టడం కోసం పెట్ స్కాన్‌ను ఉపయోగించిన పరిశోధకులు, నాడీక్షీణత రుగ్మతకు గురైన రోగుల్లో ఈ టౌ ప్రొటీన్ అధిక మొత్తంలో ఉన్నట్టు గుర్తించారు. భావోద్వేగ సమస్యలున్న వీరిలో ఎలాంటి ముందస్తు నాడీక్షీణత రుగ్మతల లక్షణాలు కనిపించలేదు కాబట్టి టౌ ప్రొటీన్ ఉనికి ఆధారంగా నాడీక్షీణత రుగ్మతలు ప్రారంభంలో మానసిక రుగ్మతల లక్షణాల రూపంలోనే బయల్పడతాయనే విషయాన్ని పరిశోధకులు నిర్ధారించారు.

తెలుసుకుందాం

రెండింతలు ఎక్కువ తినేస్తున్నాం

ఒక మనిషి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తినాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాతీయ పోషకాహార సంస్థలు సూచిస్తున్నాయి. కానీ మన ఉత్తరాది రాష్ట్రాల్లో సగటున ఒక మనిషి రోజుకు 12 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకుంటున్నారు. ఇలా అధిక ఉప్పు తీసుకోవడం వలన అధిక రక్తపోటు, గుండె జబ్బులు, గుండెపోటు, మూత్రపిండాల సమస్యలు పెరిగే ప్రమాదం ఉంటుంది. రక్తపోటును పరిష్కరించే లక్ష్యంతో ఇటీవల నిర్వహించిన ఓ జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో వైద్యులు ఈ విషయాలను ప్రస్తావించారు. రెస్టారెంట్లు, హోటళ్లతో పాటు ఇంట్లో వండే వంటల్లోనూ ఉప్పును అధికంగా వాడుతున్నారని వైద్యులు అంటున్నారు. 80 శాతం ఉప్పు ఇంటి వంటల ద్వారానే తీసుకుంటున్నామనీ, ముఖ్యంగా ఊరగాయలు, అప్పడాలు, చట్నీలు, సలాడ్, మజ్జిగ, సాస్‌ల ద్వారా ఉప్పు అధిక మోతాదులో తీసుకుంటున్నట్లు తెలిపారు. గులాబీ ఉప్పు, రాతి ఉప్పు, సముద్రపు ఉప్పు తక్కువగా ఉంటుందన్నది అపోహ మాత్రమేనని వైద్యులు అంటున్నారు. కాకపోతే వాటిలోని ఖనిజాల పరిమాణాల్లో స్వల్ప వ్యత్యాసం ఉంటుందని స్పష్టం చేశారు.



పారాహుషార్

చల్లనీళ్ల స్నానం వీళ్లకు చేటు

చల్లనీళ్ల స్నానంతో వాపులు, నొప్పులు తగ్గుతాయి. చర్మపు దురదలు అదుపులోకొస్తాయి. కానీ చల్లనీళ్ల స్నానం అందరికీ ప్రయోజనాలను అందించదు. ప్రత్యేకించి కొందరికి చల్లనీళ్ల స్నానంతో చేటు కలుగుతుంది. వాళ్లెవరంటే...



చల్లనీళ్ల స్నానంతో రక్తనాళాలు సంకోచిస్తాయి. దాంతో రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం పెరుగుతాయి. కాబట్టి కొరొనరీ ఆర్టెరీ డిసీజ్, లేదా గుండె వైఫల్యం లాంటి గుండె జబ్బులున్నవాళ్లు చల్లనీళ్లతో స్నానం చేస్తే గుండె పోటు లేదా స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గుండెపోటు చరిత్ర కలిగిన వ్యక్తులు, లేదా సెరెబ్రోవ్యాస్క్యులర్ వ్యాధి ఉన్న రోగులు కూడా చల్లనీళ్లకు దూరంగా ఉండాలి. నీటి ఉష్ణోగ్రతల్లో అకస్మాత్తుగా చోటుచేసుకునే వ్యత్యాసాలతో రక్తపోటు పెరుగుతుంది. కాబట్టి గుండెపోటు చరిత్ర కలిగిన వ్యక్తులు చల్లనీళ్లకు దూరంగా ఉండాలి. చేయి, కాలి వేళ్లలోని రక్తనాళాలు కుంచించుకుపోయే రేనాడ్స్ జబ్బు ఉన్న వ్యక్తులు చల్లనీళ్లతో స్నానం చేస్తే, విపరీతమైన బాధ, మొద్దుబారిపోవడం, అసౌకర్యాలకు లోనయ్యే అవకాశాలుంటాయి. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు కూడా చల్లనీళ్లకు దూరంగా ఉండాలి. సహజంగానే పెద్దలకు హృద్రోగ ముప్పు ఎక్కువ. పైగా శరీర ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించే సామర్థ్యం కూడా పెద్దల్లో తక్కువగా ఉంటుంది. కాబట్టి చల్లనీళ్ల స్నానంతో వాళ్ల శరీరాలు షాక్‌కు గురయ్యే అవకాశాలుంటాయి. దాంతో గుండె సమస్యలు తలెత్తుతాయి లేదా కళ్లు తిరిగి పడిపోవడం లాంటి ప్రమాదాలు కూడా జరుగుతాయి.

హెయిర్ ఫాల్

వెంట్రుకలు రాలుతున్నాయా?

వెంట్రుకలు ఊడుతున్నాయనే ఆందోళన ఎంతో కొంత ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. అయితే ఎన్ని వెంట్రుకలు ఊడితే సమస్యగా పరిగణించాలి? ఆ సమస్యను ఎలా చక్కదిద్దుకోవాలి? తెలుసుకుందాం!

వెంట్రుకలు ఊడడం, పెరగడం సహజం. అయితే కొన్ని సందర్భాల్లో ఊడిపోవడమే తప్ప, తిరిగి పెరిగే పరిస్థితి ఉండదు. అయితే వెంట్రుకలు అడపాదడపా రాలుతూనే ఉంటాయి కాబట్టి దాన్ని సమస్యగా పరిగణించాలో, లేదో తెలియక అయోమయానికి గురవుతూ ఉంటాం. నిజానికి దువ్వినప్పుడు, తలస్నానం చేసినప్పుడు రాలిపోయే 10 నుంచి 15 వెంట్రుకలను చూసుకుని కంగారు పడిపోకూడదు. తలలో ఒకే చోట వెంట్రుకలు కుచ్చులా ఊడిపోవడం, ప్యాచ్‌లాగా ఏర్పడడం, మొటిమలు లాంటివి తలెత్తినా, రోజుకు వందకు మించి వెంట్రుకలు రాలిపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. అయితే కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా వెంట్రుకలు రాలతాయి. ఎప్పుడంటే...

వైరల్ జ్వరాలు: ఈ జ్వరాలు వచ్చి తగ్గిన తర్వాత కూడా వెంట్రుకలు రాలతాయి. ఇలాంటి సందర్భాల్లో ఆందోళనపడవలసిన అవసరం లేదు. మాంసకృత్తులతో కూడిన పోషకాహారం తీసుకోగలిగితే ఈ పరిస్థితి నెమ్మదిగా సర్దుకుంటుంది

ప్రసవానంతరం: ప్రసవం తర్వాత కూడా వెంట్రుకలు రాలతాయి. ఇది సహజం. అయితే సప్లిమెంట్లతో, పౌష్టికాహారంతో ఈపరిస్థితిని చక్కదిద్దుకోవచ్చు

థైరాయిడ్: వెంట్రుకలు రాలడంతో పాటు అకారణంగా బరువు తగ్గినా, పెరిగినా థైరాయిడ్ సమస్యగా అనుమానించి వైద్యులను కలవాలి

పిల్లల్లో: సాధారణంగా పిల్లల్లో పోషకాహార లోపాల వల్ల వెంట్రుకలు రాలతాయి. కాబట్టి ఇనుము ఎక్కువగా ఉండే నట్స్, పప్పుధాన్యాలు, గుడ్లు, మాంసాహారం ఇవ్వాలి

సౌందర్య చికిత్సలు: స్ట్రెయిటెనింగ్ లాంటి చికిత్సలతో వెంట్రుకలు రాలతాయి. అలర్జీలు కలిగి ఉండి హెయిర్ డై వేసుకున్నప్పుడు వెంట్రుకలు రాలతాయి

పిసిఒఎస్: పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ ఉన్న మహిళల్లో వెంట్రుకలు రాలే సమస్య తీవ్రంగా ఉంటుంది



వెంట్రుకలు రాలకుండా...

- కంటినిండా నిద్రపోవాలి. నిద్రవేళలు క్రమం తప్పకుండా చూసుకోవాలి
- పోషకాహారం తీసుకోవాలి
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి
- హార్మోన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి
- శిరోజాల సౌందర్య చికిత్సలకు దూరంగా ఉండాలి
- శిరోజాల శుభ్రత పాటించాలి

వాటి వాడకం వ్యర్థం

కొందరు జుట్టు రాలే సమస్యను అరికట్టడం కోసం తరచూ షాంపూలు, నూనెలను మార్చేస్తూ ఉంటారు. నిజానికి జుట్టు పెరగడానికీ, రాలకుండా ఉండడానికీ షాంపూలు, నూనెలు ఏ విధంగానూ ఉపయోగపడవు. చుండ్రు, తలలో మొటిమలు లాంటి సమస్యలకు మాత్రమే కొన్ని షాంపూలు ఫలితాన్నివ్వగలుగుతాయి.

వైద్యులను ఎప్పుడు కలవాలి?

- రోజుకు వంద కంటే ఎక్కువ వెంట్రుకలు రాలుతున్నప్పుడు
- నుదుటి దగ్గరి వెంట్రుకలు వెనక్కి వెళ్లిపోతున్నప్పుడు
- మహిళల్లో పాపిట వెడల్పుగా మారిపోయినప్పుడు
- వెంట్రుకలు పలుచబడి మాడు కనిపిస్తున్నప్పుడు
- తలలో ఒకే చోట పేను కొరుకుడు తలెత్తినప్పుడు
- దురద, మొటిమలు ఉన్నప్పుడు

ఈ పరీక్షలు తప్పనిసరి

డెర్మోస్కోపిక్ ఎగ్జామినేషన్, రక్త పరీక్షలతో వెంట్రుకలు రాలే సమస్య తీవ్రతను వైద్యులు అంచనా వేయగలుగుతారు. డెర్మోస్కోపిక్ పరీక్షతో వెంట్రుకల కుదుళ్లు, వాటిలో నాటుకున్న వెంట్రుకల పరిస్థితి, రాలే వెంట్రుకల తీవ్రత, చుండ్రు, సెబోరిక్ డెర్మటైటిస్ లాంటి ఇన్‌ఫెక్షన్లను వైద్యులు తెలుసుకోగలుగుతారు. రక్తపరీక్షతో విటమిన్ డి, ఐరన్, బి12 లోపాలతో పాటు థైరాయిడ్, అనీమియా, ఇతరత్రా అంతర్గత ఆరోగ్య సమస్యలను కూడా కనిపెట్టగలుగుతారు.

ఆధునిక చికిత్సలొచ్చాయి

మునుపు బట్టతల కోసం మోనాక్సిడిల్ అనే పైపూత మందు వినియోగంలో ఉండేది. ఇప్పుడు బట్టతలను అడ్డుకునే డిహెచ్‌టి ఇన్హిబిటర్ లోషన్లు కూడా అందుబాటులోకొచ్చాయి. అలాగే కాంబినేషన్‌తో కూడిన క్రీములు, లోషన్లు కూడా అందుబాటులోకొచ్చాయి. మునుపు మోనాక్సిడిల్‌తో దురద, మంట సమస్య ఉండేది. కానీ ఇప్పుడు ఇది మాత్రలు, ఇంజెక్షన్ల రూపంలో దొరుకుతోంది. మూల కణాల నుంచి విడుదలయ్యే ఎక్సోజోమ్స్ వెంట్రుకల కుదుళ్లను ప్రేరేపించి, వెంట్రుకల పెరుదలకు తోడ్పడతాయి. ప్రస్తుతం జంతువులు, సముద్ర జీవుల నుంచి సేకరించిన ఎక్సోజోమ్స్‌ను వెంట్రుకల పెరుగుదలకు ఉపయోగిస్తున్నారు. అలాగే మునుపటి పిఆర్‌పి చికిత్సకు బదులుగా ఇప్పుడు గ్రోత్ ఫ్యాక్టర్ కాన్‌సెంట్రేట్ పిఆర్‌పి అనే సమర్థమైన, ఆధునిక చికిత్స అందుబాటులోకొచ్చింది. అలాగే మునుపు హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం వెంట్రుకలను పొట్టిగా కత్తిరించి ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు పొడవాటి వెంట్రుకలను కూడా ట్రాన్స్‌ప్లాంట్ చేయగలుగుతున్నారు.



డాక్టర్ స్వప్నప్రియ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైదరాబాద్

స్పోర్ట్స్

ఆర్చరీలో తెలుగమ్మాయి రెండు ప్రపంచ రికార్డులు



షణ్ముఖి నాగసాయి

విజయవాడ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరుగుతున్న ఆసియాకప్ స్టేజ్ 2 అండర్-21 ఆర్చరీ ర్యాంకింగ్ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి బుద్ధె షణ్ముఖి నాగసాయి రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. 50 మీటర్ల కాంపౌండ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో షణ్ముఖి, తేజల్ సాల్వే, తనిష్కలతో కూడిన భారత జట్టు 2101 పాయింట్లు స్కోరుచేసి వరల్డ్ రికార్డు సాధించింది. ఈ క్రమంలో 2076 పాయింట్ల రికార్డును అధిగమించింది. ఇక మిక్స్‌డ్ టీమ్ విభాగంలో షణ్ముఖి, కుషాల్ దలాల్ ద్వయం 1420 పాయింట్లు స్కోరు చేసి గత వరల్డ్ రికార్డు (1419)ను అధిగమించింది.

నేడు జట్టుతో చేరనున్న గంభీర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ మంగళవారం జట్టుతో చేరనున్నాడు. తల్లి సీమా గంభీర్ గుండెపోటుకు గురైనందున అతడు ఈనెల 12న స్వదేశానికి వచ్చాడు. గౌతీ తల్లి ఐసీయూలో చికిత్స పొందుతున్నప్పటికీ..ఆమె ఆరోగ్యం మెరుగైందని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం కెంట్‌లో ఉన్న భారత జట్టు శుక్రవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే తొలి టెస్టు కోసం మంగళవారం హెడింగ్లీకి బయల్దేరి వెళ్లనుంది.

బాల్ ట్యాంపరింగ్ వివాదంలో అశ్విన్



కోయంబత్తూరు: భారత మాజీ ఆఫ్ స్పిన్నర్ ఆర్.అశ్విన్ మరో వివాదంలో చిక్కుకున్నాడు. గతవారం మహిళా అంపైర్‌తో గొడవకు దిగిన అతను తాజాగా బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నించాడంటూ మధురై పాంథర్స్ జట్టు ఫిర్యాదు చేసింది. తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో అశ్విన్ దుండిగల్ డ్రాగన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈనెల 14న ఇరుజట్ల మధ్య మ్యాచ్ జరిగింది. 'డ్రాగన్స్ జట్టు ఆటగాళ్లు రసాయనాల్లో ముంచిన టవళ్లతో బంతిని పదే పదే తుడిచారు. తద్వారా బంతి బరువును పెంచాలని చూశారు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు ఇందుకు తగిన ఆధారాలను చూపడంలో మధుర జట్టు విఫలమైందని టీఎన్‌పీఎల్ ప్రకటించింది.

విశాఖలో ఐదు మ్యాచ్‌లు

మహిళల వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్

సెప్టెంబరు 30న టోర్నీ ఆరంభం

కొలంబోలో అక్టోబరు 5న భారత్-పాక్ పోరు



న్యూఢిల్లీ: భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న మహిళల వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ సోమవారం విడుదల చేసింది. సెప్టెంబరు 30 నుంచి జరిగే ఈ మెగా టోర్నీ నవంబరు 2న ముగుస్తుంది. మొత్తం 8 జట్లు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిన మిగతా అన్ని టీమ్స్‌తోనూ ఆడాల్సి ఉంటుంది. ఇక బెంగళూరులో జరిగే ఆరంభ మ్యాచ్‌లో భారత్-శ్రీలంక తలపడనున్నాయి. ఇక, టోర్నీలో ఐదు మ్యాచ్‌లకు విశాఖపట్నం వేదిక కానుండడం విశేషం. కాగా, అందరి దృష్టిని ఆకర్షించే పాకిస్థాన్‌తో హర్మన్‌ప్రీత్ సేన పోరు కొలంబోలో అక్టోబరు 5వ తేదీన జరుగనుంది. చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత పురుషుల జట్టు పాక్‌కు వెళ్లకపోవడంతో భవిష్యత్‌లో ఇరు జట్ల మ్యాచ్‌లను హైబ్రిడ్ పద్ధతిన ఆడించాలనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా పాక్ జట్టు శ్రీలంకలోనే తమ వరల్డ్‌కప్ గ్రూప్ మ్యాచ్‌లను ఆడబోతోంది. అంతేకాకుండా శ్రీలంక మొత్తంగా 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లతో తమ మ్యాచ్‌లను శ్రీలంక స్వదేశంలోనే ఆడనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా అక్టోబరు ఒకటిన కివీస్‌తో మ్యాచ్‌తో తమ ప్రస్థానాన్ని ఆరంభించనుంది. రౌండ్ రాబిన్ దశలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు వెళతాయి. ఇందులో తొలి స్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానం జట్టుతో.. రెండో స్థానంలో నిలిచిన జట్టు మూడో స్థానం జట్టుతో తలపడతాయి. అలాగే తొలి సెమీస్ అక్టోబరు 29న గువాహటి/కొలంబోలో నిర్వహించనున్నారు. మర్నాడే మరో సెమీస్ బెంగళూరులో జరుగుతుంది. నవంబరు 2న జరిగే ఫైనల్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుంది. పాక్ జట్టు అర్హత సాధించడాన్ని బట్టి ఈ రెండింట్లో ఓ వేదికను ఖరారు చేస్తారు.

భారత జట్టు షెడ్యూల్		
తేదీ	ప్రత్యర్థి	వేదిక
సెప్టెంబరు 30	శ్రీలంక	బెంగళూరు
అక్టోబరు 5	పాకిస్థాన్	కొలంబో
అక్టోబరు 9	దక్షిణాఫ్రికా	విశాఖపట్నం
అక్టోబరు 12	ఆస్ట్రేలియా	విశాఖపట్నం
అక్టోబరు 19	ఇంగ్లండ్	ఇండోర్
అక్టోబరు 23	న్యూజిలాండ్	గువాహటి
అక్టోబరు 26	బంగ్లాదేశ్	బెంగళూరు

విశాఖలో మ్యాచ్‌లు ఇవీ..

మహిళల వన్డే వరల్డ్‌కప్‌నకు భారత్‌లో బెంగళూరు, ఇండోర్, గువాహటిలతో పాటు విశాఖపట్నం కూడా ఆతిథ్యమివ్వనుంది. విశాఖలో ఐదు మ్యాచ్‌లు జరగనుండగా.. అక్టోబరు 9న మొదట భారత్-దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. అలాగే అక్టోబరు 10న న్యూజిలాండ్-బంగ్లాదేశ్, 12న భారత్-ఆస్ట్రేలియా, 13న దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్, 16న ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ మ్యాచ్‌లను కూడా ఇక్కడే నిర్వహిస్తారు.

డుప్లాంటిస్ 12వ సారి..

పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డు



స్టాక్‌హోమ్: ఒలింపిక్ చాంపియన్ ఆర్మండ్ డుప్లాంటిస్ పోల్‌వాల్ట్‌లో తన వరల్డ్ రికార్డును మరోసారి తానే బద్దలుగొట్టాడు. స్వదేశం (స్వీడన్)లో జరిగిన డైమండ్ లీగ్‌లో 6.28 మీటర్లు లంఘించిన 25 ఏళ్ల డుప్లాంటిస్ అభిమానుల హర్షధ్వానాల నడుమ 12వ సారి నయా ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. స్వదేశంలో అతడు వరల్డ్ రికార్డు సాధించడం ఇదే తొలిసారి. ఇక..గత ప్రపంచ రికార్డు (6.27 మీటర్ల)ను ఫిబ్రవరిలో వరల్డ్ అథ్లెటిక్ ఇండోర్ టూర్ మీట్ సందర్భంగా డుప్లాంటిస్ నెలకొల్పాడు. 2020లో 6.17 మీ.తో మొదటిసారి ప్రపంచ రికార్డు సాధించిన ఆర్మండ్ అప్పటినుంచి ప్రతిసారీ ఒక్కో సెంటీమీటరు పెంచుకుంటూ రికార్డులు సృష్టిస్తున్నాడు.

భారత్-ఇంగ్లండ్ సిరీస్ నెగ్గేదెవరంటే ?

గెలుపు చాన్సులపై మాజీల మాట

న్యూఢిల్లీ: భారత్-ఇంగ్లండ్ మధ్య టెస్ట్ సిరీస్‌లో ఎవరు విజేతగా నిలుస్తారన్న విషయంపై మాజీ క్రికెటర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఐదు మ్యాచ్‌ల ఈ సుదీర్ఘ సిరీస్‌లో భారత జట్టు గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు. అది జరగాలంటే లీడ్స్‌లో జరిగే తొలి టెస్ట్, మాంచెస్టర్‌లో జరిగే నాలుగో మ్యాచ్‌లో గిల్ సేన విజయం సాధించాల్సి ఉంటుందని అన్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ మాత్రం ఇంగ్లండ్ 3-2తో సిరీస్ సొంతం చేసుకుంటుందని జోస్యం చెప్పాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ కొత్త సైకిల్‌ను ఐదు టెస్టుల సిరీస్‌తో భారత్-ఇంగ్లండ్ ప్రారంభించనున్నాయి. ఇందులో తొలి టెస్ట్ ఈనెల 20న లీడ్స్‌లో మొదలు కానుంది. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీని ఇంగ్లండ్ చేజిక్కించుకొనే చాన్సుందని భారత మాజీలు దీప్‌దాస్ గుప్తా, సంజయ్ మంజ్రేకర్ అన్నారు.

కెనడియన్ గ్రాండ్ ప్రీ విజేత జార్జ్



మాంట్రియల్: ఫార్ములావన్ స్టార్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కు కెనడియన్ గ్రాండ్ ప్రీలో చుక్కెదురైంది. ఫైనల్ రేసులో వెర్‌స్టాపెన్‌కు షాకిస్తూ.. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ చాంపియన్‌గా నిలిచాడు. మ్యాక్స్ రెండోస్థానానికి పరిమితమవగా.. మెర్సిడెస్‌కే చెందిన కిమి అంటోనెలి మూడోస్థానంతో పోడియం ఫినిష్ చేశాడు. బ్రిటన్‌కు చెందిన 27 ఏళ్ల జార్జ్‌కిది ఎఫ్-1 కెరీర్‌లో నాలుగో విజయం.

అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా

లండన్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నేపథ్యంలో అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదాపడింది. గతంలో ఇంగ్లండ్-భారత్ మధ్య సిరీస్‌ను పటౌడీ ట్రోఫీగా వ్యవహరించేవారు. అయితే, ఇంగ్లండ్ బోర్డు ఆ పేరు మార్చి ఆధునిక దిగ్గజాలు అండర్సన్-టెండూల్కర్ పేరున ట్రోఫీని తీసుకురావాలనే నిర్ణయం తీసుకొంది. సిరీస్ ఆరంభమయ్యే ముందే ట్రోఫీ ఆవిష్కరణ జరుగుతుందని బీసీసీఐ తెలిపింది.

సచిన్ కాదు.. కోహ్లీతోనే కష్టం

ఇంగ్లండ్ మాజీ పేసర్ అండర్సన్



లండన్: సచిన్ టెండూల్కర్‌తో పోల్చితే.. కోహ్లీకి బౌలింగ్ చేయడం తనకు ఎంతో కష్టంగా అనిపించేదని ఇంగ్లండ్ మాజీ పేసర్ జిమ్మీ అండర్సన్ చెప్పాడు. విరాట్ టెక్నిక్, పోరాటపటిమను కొనియాడాడు. కోహ్లీ, అండర్సన్ మధ్య వైరం ఎంతో ఆసక్తిగా ఉండేది. 36 ఇన్నింగ్స్‌లో ఏడుసార్లు విరాట్‌ను అండర్సన్ అవుట్ చేశాడు. 'సచిన్‌తో పోల్చితే కోహ్లీ తత్వం భిన్నం. ఆరంభంలో విరాట్‌ను సులువుగానే అవుట్ చేసినా.. ఆ తర్వాత అతడిపై ఆధిపత్యం సాధించడం కష్టమైంది. దూకుడుగా ఉండే విరాట్.. దేనికైనా సై అన్నట్టుగా ఉంటాడ'ని అండర్సన్ చెప్పాడు. టెస్టులకు కోహ్లీ ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అవి చీకటి రోజులు

కరుణ్ నాయర్



న్యూఢిల్లీ: లండన్: గత దేశవాళీ సీజన్‌లో పరుగుల వరద పారించిన కరుణ్ నాయర్‌కు ఎట్టకేలకు ఎనిమిది సంవత్సరాల విరామం తర్వాత జాతీయ జట్టులో చోటు లభించింది. ఈనేపథ్యంలో తన క్రికెట్ కెరీర్‌లో ఎత్తుపల్లాలను తలుచుకుంటూ 33 ఏళ్ల నాయర్ ఉద్వేగానికి గురయ్యాడు. '2022 ఏడాది చివరి రోజులు నా కెరీర్‌లో అత్యంత చీకటిమయం. ఎంత క్లిష్టమైన రోజులంటే.. 2018 కంటే కూడా ఎంతో భారమైనవి' అని ఆర్.అశ్విన్ యుట్యూబ్ చానెల్‌తో మాట్లాడుతూ నాయర్ తెలిపాడు. దేశవాళీ పోటీల్లో సత్తా చాటినా జాతీయ జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర ఆవేదనకు లోనైన కరుణ్ 'డియర్ క్రికెట్. నాకు మరో అవకాశం ఇవ్వు' అని 2022 డిసెంబరులో సోషల్ మీడియాలో నాయర్ చేసిన పోస్ట్ సంచలనం రేపింది. 'గత రెండు మూడు సంవత్సరాలుగా నాకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు. ఈ సమయంలో ప్రతి అంశము, ప్రతి క్షణమూ ఎంత విలువైనదో తెలుసుకున్నా. దాంతో ప్రతి రోజును కొత్త రోజుగా భావించా' అని తెలిపాడు. సెహ్వాగ్ తర్వాత టెస్ట్‌ల్లో త్రిశతకం బాదిన భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కిన నాయర్‌ను 2018లో ఎలాంటి కారణం చూపకుండా టీమిండియానుంచి తప్పించడం గమనార్హం.

అండమాన్‌లో ఓఎన్‌జీసీకి జాక్‌పాట్



1,160 కోట్ల బ్యారళ్ల చమురు నిక్షేపాలు

పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ వెల్లడి

న్యూఢిల్లీ: అండమాన్ సముద్ర జలాల్లో భారీ చమురు నిక్షేపాలు బయటపడినట్టు సమాచారం. ఈ సముద్రంలో చమురు, సహజవాయు నిక్షేపాల కోసం ప్రభుత్వ రంగంలోని ఆయిల్ ఇండియా, ఓఎన్‌జీసీ జరుపుతున్న అన్వేషణ ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ సముద్ర జలాల్లో దాదాపు 1,84,440 కోట్ల లీటర్ల (సుమారు 1,160 కోట్ల బ్యారళ్ల)కు సమానమైన భారీ చమురు నిక్షేపాలు గురించిన శుభవార్త త్వరలోనే దేశ ప్రజలకు అందిస్తామని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నిక్షేపం ఇటీవల దక్షిణ అమెరికాలోని గయానాలో కనుగొన్నంత భారీ స్థాయిలోనే ఉంటుందన్నారు. దీంతో దేశ చమురు, గ్యాస్ ఉత్పత్తిలో అండమాన్ నికోబార్ దీవులు కూడా చేరనున్నాయి.

హెస్ కార్పొరేషన్, చైనాకు చెందిన సీఎన్‌ఓఓసీ కంపెనీలు గయానాలో ఇటీవల 1,160 కోట్ల పీపాల భారీ చమురు నిక్షేపాన్ని కనుగొన్నాయి. దీంతో చమురు నిక్షేపాలపరంగా గయానా ప్రపంచంలో 17వ స్థానానికి చేరింది.

చమురుకు ఢోకా లేదు

మరోవైపు మన దేశంలో ముడి చమురుకు ఎలాంటి కొరత లేదని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మూడు నెలల అవసరాలకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నట్టు తెలిపాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో అధికార వర్గాలు ఈ విషయం వెల్లడించడం విశేషం. అయితే ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేస్తే మాత్రం మన చమురు సరఫరాలకు ముప్పు తప్పకపోవచ్చన్నారు. ఆ ప్రమాదం లేనంత వరకు పీపా చమురు ధర కూడా 75 డాలర్లు మించక పోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

వెలికితీత ఖర్చే

అయితే అండమాన్ సముద్రంలో చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీత అంత తేలిక కాదని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ తెలిపారు. ఇందుకోసం ఒక్కో బావి తవ్వకం కోసం ఎంతలేదన్నా 10 కోట్ల డాలర్ల (సుమారు రూ.850 కోట్లు) వరకు ఖర్చవుతుందన్నారు. గయానాలోనూ కొత్త చమురు, గ్యాస్ నిక్షేపాల ఆచూకీ కోసం 44 బావులు తవ్వాల్సి వచ్చింది. ఇందుకోసం అధునాతన టెక్నాలజీతో పాటు ఒక్కో బావి తవ్వకం కోసం 10 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేశారు. గత ఆర్థిక సంవత్సరం ఓఎన్‌జీసీ దేశంలోని వివిధ ప్రాంతాల్లో చమురు, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ, ఉత్పత్తి కోసం రూ.37,000 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో పెద్ద మొత్తం అండమాన్, నికోబార్ సముద్ర జలాల్లో బావుల తవ్వకం కోసం ఖర్చు చేసినట్టు అధికార వర్గాలు చెప్పాయి.

ఈ వారం కీలక భేటీ

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంపై అధికార, వాణిజ్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై చర్చించేందుకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ వారం కీలక సమావేశం నిర్వహిస్తోంది. నౌకాయాన కంపెనీలు, కంటైనర్ కంపెనీలు, ఎగుమతిదారుల, వాణిజ్యంతో సంబంధం ఉన్న ఇతర సంస్థల ప్రతినిధులనూ ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ చెప్పారు. తాత్కాలిక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం భారత-అమెరికా మధ్య జరుగుతున్న చర్యలు జూలై 9 లోగానే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

బిజినెస్

ఎగుమతుల్లో మళ్లీ క్షీణత

మే నెలలో 2.17% పతనం

న్యూఢిల్లీ: వరుసగా రెండు నెలల పాటు సానుకూల వృద్ధిని నమోదు చేసిన ఎగుమతుల రంగం మే నెలలో మరోసారి ప్రతికూల వృద్ధిలోకి దిగజారింది. ప్రపంచ విపణిలో పెట్రోలియం ఉత్పత్తుల ధరల తగ్గుదల, అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో మే నెల ఎగుమతులు 2.17% పడిపోయి 3,873 కోట్ల డాలర్లకు (రూ.3.33 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం వాణిజ్య లోటు 2,188 కోట్ల డాలర్లకు (రూ.1.88 లక్షల కోట్లు) తగ్గింది. దిగుమతులు కూడా 1.7% తగ్గి 6,061 కోట్ల డాలర్లుగా (రూ.5.21 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇదిలా ఉండగా ఏప్రిల్-మే నెలల్లో మొత్తం ఎగుమతులు 3.11 శాతం పెరిగి 7,719 కోట్ల డాలర్లకు (రూ.66.4 లక్షల కోట్లు) చేరగా దిగుమతులు 8 శాతం వృద్ధితో 12,552 కోట్ల డాలర్లుగా (రూ.10.79 లక్షల కోట్లు) నమోదయ్యాయి. రెండు నెలల వాణిజ్య లోటు 4,833 కోట్ల డాలర్లుగా (రూ.4.16 లక్షల కోట్లు) ఉంది. మే నెలలో ప్రతికూల వృద్ధి నమోదైన వస్తువుల్లో బియ్యం, ఇనుప ఖనిజం, వజ్రాభరణాలు, ఇంజనీరింగ్, కొన్ని రకాల టెక్స్‌టైల్ ఉత్పత్తులు ఉన్నాయి. క్రూడాయిల్ దిగుమతులు 26.14%, బంగారం దిగుమతులు 12.6% తగ్గినప్పటికీ టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, రసాయనాలు, మెరైన్ ఉత్పత్తులు, ఫార్మా విభాగాల్లో మాత్రం సానుకూల వృద్ధి నమోదైంది.

టోకు ద్రవ్యోల్బణం 0.39%

ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం మే నెలలో 0.39 శాతానికి దిగి వచ్చింది. ఇది 14 నెలల కనిష్ఠ స్థాయి. గత ఏడాది ఇది మే నెలలో 2.74 శాతంగా ఉంది. కూరగాయల ధరలు 21.62 శాతం, ఇంధన విభాగం 2.27 శాతంతో ప్రతి ద్రవ్యోల్బణ స్థితిని నమోదు చేశాయి.

ప్రమాదం గుండెలు పిండేస్తోంది

- అయినా ఎయిర్ ఇండియాను నిలబెడదాం
- టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్



ముంబై: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తన గుండెలు పిండేస్తోందని టాటా సన్స్, ఎయిర్ ఇండియా చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. తన ఉద్యోగ జీవితంలో ఇది అత్యంత విషాదకర సంక్షోభ సంఘటన అన్నారు. ఎయిర్ ఇండియాకు చెందిన దాదాపు 700 మంది ఉద్యోగులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదంతో నీరుగారి పోకుండా ఎయిర్ ఇండియాను సురక్షిత విమానయాన సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉద్యోగి దృఢ నిర్ణయంతో కట్టుబడి పనిచేయాలని చంద్రశేఖరన్ కోరారు. 'నా ఉద్యోగ జీవితంలో ఎన్నో సంక్షోభాలు చూశా. అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాదం మాత్రం గుండెలు పిండేసే అత్యంత విషాదకర సంఘటన. జీవితంలో మళ్లీ ఇలాంటి ప్రమాదాన్ని చూస్తానని అనుకోను' అన్నారు. ఈ నెల 12 అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమాన టేకాఫ్ తీసుకున్న కొద్ది సేపటికే కూలిపోయింది. దీంతో 270 మంది వరకు మరణించిన సంగతి తెలిసిందే.

తాన్లా ప్లాట్‌ఫామ్స్ రూ.175 కోట్ల షేర్ల బైబ్యాక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బహిరంగ మార్కెట్ నుంచి సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేసే (బైబ్యాక్) ప్రతిపాదనకు తాన్లా ప్లాట్‌ఫామ్స్ బోర్డు సోమవారం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కంపెనీ 1.49 శాతం వాటాకు సమానమైన 20 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటి రూ.875 చొప్పున బైబ్యాక్ చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ లెక్కన కంపెనీ బైబ్యాక్ కోసం రూ.175 కోట్ల వరకు వెచ్చించనుంది. బైబ్యాక్ తేదీని మాత్రం ఇంకా ప్రకటించాల్సి ఉంది. తాన్లా ప్లాట్‌ఫామ్ సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేయనుండటం గడిచిన ఐదేళ్లలో ఇది మూడోసారి. 2020లో రూ.154 కోట్లు, 2022లో రూ.170 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది. కాగా సోమవారం బీఎ్‌సఈలో కంపెనీ షేరు 1.31 శాతం నష్టంతో రూ.656.90 వద్ద ముగిసింది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
17వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

యుద్ధ భయాలు బేఖాతరు

678 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

రూ.3.31 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధ భయాలను పక్కన పెట్టి మదుపరులు కొనుగోళ్లపై దృష్టి సారించడంతో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం మంచి లాభాలను నమోదు చేశాయి. ఒక దశలో 747 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 677.55 పాయింట్ల లాభంతో 81,796.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 227.90 పాయింట్ల వృద్ధితో 24,946.50 వద్ద ముగిసింది. గత వారాంతంలో భారీగా పెరిగిన ముడి చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్‌కు పాల్పడటం ర్యాలీకి దోహదపడింది. కాగా ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.31 లక్షల కోట్లు పెరుగుదలతో రూ.450.52 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

నెలాఖరుకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ: హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్ల ఐపీఓ ఈ నెలాఖరులో (25-27తేదీల్లో) మార్కెట్లోకి రానున్నట్లు సమాచారం. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో ఇప్పటివరకిదే అతిపెద్ద ఐపీఓ కానుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.62,000 కోట్ల మార్కెట్ విలువను ఆశిస్తోంది.



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	91	విజయవాడ	95
వరంగల్	91	గుంటూరు	100
కరీంనగర్	91	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	92
కర్నూలు	91	నెల్లూరు	97
విశాఖపట్నం	85	అనంతపురం	97
గోదావరి	95		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,510 ▼	93,500 ▲	1,19,000 ▼
విజయవాడ	1,00,250 ▼	94,000 ▼	1,09,500 ▼
విశాఖపట్నం	1,00,215 ▼	93,050 ▼	1,19,900 ▼
రాజమండ్రి	1,01,510 ▼	93,950 ▲	1,09,200 ▼
ప్రొద్దుటూరు	98,500 ▼	90,620 ▼	1,00,060 ▼
ముంబై	99,373 ▲	91 ,026 ▲	1,06,700 ▲

రూపీ ఇంట్రెస్ట్ రేట్ డెరివేటివ్‌లకు ముసాయిదా నిబంధనలు జారీ

ముంబై: మార్కెట్ పరిణామాలకు అనుగుణంగా నియంత్రణ నియమావళిని విస్తరించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం రూపీ ఇంట్రెస్ట్ రేట్ డెరివేటివ్స్ (ఐఆర్‌డీ)కు సంబంధించిన ముసాయిదా నిబంధనలు జారీ చేసింది. ఐఆర్‌డీ నియమావళిని ఆర్‌బీఐ తొలుత 2019 జూన్‌లో జారీ చేసింది. అప్పటి నుంచి మార్కెట్లో కొత్త సాధనాలు అందుబాటులోకి రావడం, ప్రవాసులు సైతం వీటిలో ట్రేడింగ్ చేపట్టేందుకు అనుమతించడం సహా పలు కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఐఆర్‌డీ నియమాళిని సమగ్రంగా సమీక్షించిన అనంతరం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ముసాయిదా నిబంధనలను జారీ చేసినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. వచ్చేనెల 7లోగా తమ అభిప్రాయాలు తెలపాల్సిందిగా బ్యాంకులు, మార్కెట్ వర్గాలు, ఇతర సంబంధిత వర్గాలను కోరింది.

కార్ల ధరలు సెప్టెంబరు నెలలో మరోసారి పెంచే ఆస్కారం ఉందని జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ప్రకటించింది. రూపాయి-యూరో మారకంలో ప్రతికూల కదలికల నేపథ్యంలో ధరల పెంపు తప్పకపోవచ్చని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు. కంపెనీ ఈ ఏడాదిలో ఇప్పటికే జనవరి, జూన్ నెలల్లో రెండు విడతలుగా 1.5% వంతున కార్ల ధరలు పెంచింది.

ఆర్థిక మోసాలను అరికట్టేందుకు ఆర్‌బీఐతో ట్రాయ్ జట్టు

న్యూఢిల్లీ: దేశంలో స్పామ్ కాల్స్ లేదా మెసేజ్‌ల ద్వారా పెరుగుతున్న ఆర్థిక మోసాలను అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)తో భారత టెలికాం నియంత్రణాధికార సంస్థ (ట్రాయ్) జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా ట్రాయ్ వినియోగదారుల వారసత్వ డిజిటలీకరణతో పాటు కాల్స్, మెసేజ్‌ల స్వీకరణకు పత్రాల ఆధారిత సమ్మతికి సంబంధించి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. గతంలో స్పామ్ కాల్స్, మెసేజ్‌లపై కస్టమర్ల ఫిర్యాదుల్లో చాలావరకు వారు గతంలో ఉత్పత్తులు కొనుగోలు చేసిన లేదా సేవలందుకున్న సంస్థలకు వ్యతిరేకంగానేనని ట్రాయ్ పేర్కొంది. ఈ విషయంపై ట్రాయ్ దర్యాప్తు చేయగా.. కస్టమర్ల సమ్మతితోనే కాల్స్, మెసేజ్‌లు చేయడం జరిగిందని ఆ వ్యాపార సంస్థలు వెల్లడించాయి.



బదిలీలు సంపూర్ణం

67,732 మంది టీచర్ల బదిలీ

- అత్యధికంగా 31 వేల ఎస్జీటీలు .. 4,477 మందికి పదోన్నతులు
- కొత్త టీచర్లు వస్తే కొరత లేనట్టే.. 25 రోజుల్లో పూర్తి చేసిన విద్యాశాఖ

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఏకంగా 67,732 మంది టీచర్లు పాఠశాలలు మారారు. భారీ సంఖ్యలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ 25 రోజుల వ్యవధిలోనే పూర్తిచేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీచర్ల బదిలీ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. 4,477 మంది టీచర్లకు పదోన్నతి కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు 1,494 మంది బదిలీ అయ్యారు. అదేవిధంగా గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 1,375 మందికి పదోన్నతి లభించింది. మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా 5,717 మంది నియామితులయ్యారు. 1,592 మందికి మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. 5,717 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కాగా, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా 1,510 మందికి ప్రమోషన్ దక్కింది. 31,174 మంది ఎస్జీటీలు, 1,199 మంది భాషా పండితులు, 344 మంది వ్యాయామ ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు.

అభ్యంతరాల స్వీకరణ

బదిలీలు, పదోన్నతులపై ఏవైనా అభ్యంతరాలుంటే జిల్లా లేదా జోనల్ స్థాయి సమస్యల పరిష్కార కమిటీని సంప్రదించాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. తగిన ఆధారాలతో అభ్యంతరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ కమిటీలు తగిన పరిష్కారాలు చూపుతాయని పేర్కొంది.

వారు బదిలీ అయినా వెనక్కి

మెగా డీఎస్సీలో వచ్చే టీచర్ల సంఖ్యను కూడా కలిపి పాఠశాల విద్యాశాఖ టీచర్ల రేషనలైజేషన్ చేసింది. మెగా డీఎస్సీలో 16,347 మంది టీచర్లు భర్తీ అవుతారు. ఈ నేపథ్యంలో ఆయా స్థానాలు ఇప్పుడు ఖాళీగా ఉన్నాయి. దీంతో టీచర్ బదిలీ అయినా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో ఆ ఖాళీని ఎవరూ భర్తీ చేయకపోతే తిరిగి ఇక్కడే పనిచేయాలని ఆదేశించారు. బదిలీ ఆర్డర్ పొందిన వారు కొత్త పాఠశాలలో చేరి, వెంటనే రిలీవ్ అయ్యి తిరిగి పాత పాఠశాలకు రావాల్సి ఉంటుంది. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి కొత్త టీచర్లు వస్తే ఈ సమస్య తీరనుంది.

'మైనర్ మీడియం' పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదల నేడు

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్(భాషా సబ్జెక్టులు) మైనర్ మీడియం కన్నడ, ఒడియా, తమిళం, ఊర్దూ విభాగాల పరీక్షల ప్రాథమిక కీని మంగళవారం విడుదల చేయనున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు తగిన ఆధారాలతో ప్రాథమిక 'కీ'పై ఈనెల 23లోగా అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో రెస్పాన్స్ షీట్లు చూసుకోవచ్చన్నారు. కాగా, సోమవారం జరిగిన మైనర్ మీడియం స్కూల్ అసిస్టెంట్ డీఎస్సీ పరీక్షలకు 95.11 శాతం మంది హాజరైనట్లు తెలిపారు.

కార్యదర్శుల పదోన్నతుల్లో కిరికిరి!

> గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన సచివాలయ వ్యవస్థలో.. ఉద్యోగుల ఎంపిక ప్రక్రియ, విధివిధానాల రూపకల్పన ఆద్యంతం గందరగోళంగా ఉంది. సచివాలయ ఉద్యోగుల జాబ్ చార్ట్ మారినప్పుడు, బదిలీలు జరిగినప్పుడు, పదోన్నతులు జరుగుతున్న సందర్భంలో గ్రేడ్-5 కార్యదర్శులకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది.

- ఐదేళ్లుగా పనిచేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులు
- అయినా వీరికి దక్కని పంచాయతీ అధికారాలు
- వైసీపీ తెచ్చిన వ్యవస్థలో తీవ్ర గందరగోళం
- ఇప్పటికే పలు జిల్లాల్లో ప్రమోషన్లు పూర్తి
- తమకు న్యాయం చేయాలని 'గ్రేడ్-5' గగ్గోలు

పంచాయతీల్లో గ్రేడ్-6కు పదోన్నతులు
వెంటనే డ్రాయింగ్ అధికారాలు అప్పగింత

(అమరావతి/గుంటూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థద్వారా ఉనికిలోకి వచ్చిన గ్రేడ్-5, గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల వ్యవహారం గందరగోళంగా మారింది. కార్యదర్శులకు పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని పంచాయతీరాజ్‌శాఖ నిర్ణయించి కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ క్రమంలో పలు జిల్లాల్లో నిర్వహిస్తున్న గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శి పదోన్నతులు.. గ్రేడ్-5 కార్యదర్శులకు తలనొప్పిగా మారింది. దాదాపు ఐదేళ్లుగా అదే కేడర్‌లో సేవలు అందిస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులకు పదోన్నతుల ప్రక్రియ ఇబ్బందిగా మారింది. మేజర్ పంచాయతీల పరిధిలోని సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులకు ఇప్పటి వరకు కార్యదర్శి అధికారాలు, డ్రాయింగ్ అధికారి హోదా దక్కలేదు. కానీ, గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులైన డిజిటల్ అసిస్టెంట్లకు ఆ అవకాశం దక్కడం వారిని విస్మయానికి గురిచేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు సచివాలయ కార్యదర్శులకు ఎలాంటి జాబ్ చార్ట్ లేకుండానే పని చేయించింది. గత ఏడాది ఎన్నికలకు ముందు హడావుడిగా జీవో 11 ద్వారా అధికారాలు, డ్రాయింగ్ పవర్ ఇస్తున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకొంది. ఆ జీవో ప్రకారమే ప్రస్తుత ప్రభుత్వం గ్రేడ్-5 కార్యదర్శులకు పంచాయతీలను అప్పగించింది. ఈ క్రమంలో మేజర్ పంచాయతీల్లో ఉన్న సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులకు అన్యాయం జరిగింది. మేజర్ పంచాయతీల్లో ప్రధాన సచివాలయంలో గ్రేడ్ 1, 2, 4 కార్యదర్శులు ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తుంటారు. సచివాలయ వ్యవస్థను రూపొందించే సమయంలో జనాభా ఎక్కువగా ఉండే మేజర్ పంచాయతీల్లో 2 నుంచి 5 సచివాలయాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో మెరిట్ అభ్యర్థులందరూ సదుపాయాలు మెరుగ్గా ఉండే మేజర్ పంచాయతీలను ఎంచుకున్నారు. వారంతా గ్రేడ్ 1, 2, 4 కార్యదర్శుల కింద ఉన్న మిగిలిన సచివాలయాల్లో పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తాజాగా గ్రేడ్-5 ఉద్యోగులకు పంచాయతీ అధికారాలు, డీడీవో అధికారాలు అప్పగించింది. ఆ సమయంలో వీరికి నష్టం జరిగింది.



మెరిట్ వచ్చిన వీరంతా గ్రేడ్ 1, 2, 4 కార్యదర్శుల కింద సబార్డినేట్స్‌గానే ఉండిపోయారు. వీరికి డీడీవో అధికారాలు దక్కలేదు. అయితే, మెరిట్లో వీరికంటే వెనుక ఉన్నవారు అప్పట్లో వీరు కాదనుకున్న చిన్న పంచాయతీలు ఎంచుకున్నారు. ఇప్పుడు వారందరికీ పంచాయతీ కార్యదర్శి అధికారాలతోపాటు, డీడీవో హోదా కూడా వచ్చింది. కార్యదర్శి అధికారాలను అప్పగించే సమయంలో ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా అధికారాలు అప్పగించి, పంచాయతీలు కేటాయించలేదని దీంతో తమంతా సబార్డినేట్ ఉద్యోగులుగానే మిగిలిపోయామని వారు వాపోతున్నారు.

గ్రేడ్-5ను కాదని గ్రేడ్-6కు అధికారాలు..

రాష్ట్ర వ్యాప్తంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 6,166 మంది ఉన్నారు. వీరిలో పంచాయతీ కార్యదర్శి అధికారాలు లేకుండా గ్రేడ్ 1, 2, 4 కార్యదర్శుల కింద సచివాలయాల్లో పనిచేస్తున్నవారు రాష్ట్ర వ్యాప్తంగా 1,800 మంది ఉన్నారు. ప్రస్తుతం పదోన్నతుల ప్రక్రియ మొదలైన తూర్పు గోదావరి జిల్లాలో 160 మంది, కృష్ణా జిల్లాలో 79 మంది, శ్రీకాకుళంలో 97 మంది, విజయనగరం జిల్లాలో 57 మంది గ్రేడ్-5 నుంచి గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 8,950 మంది డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు. గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శుల హోదాలో ఎంపికైన వారిని ప్రభుత్వం గ్రేడ్-5 కార్యదర్శులుగా ప్రమోట్ చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 260 మంది, కృష్ణా జిల్లాలో 52 మంది, శ్రీకాకుళం జిల్లాలో 50 మంది, విజయనగరంలో 61 మంది, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 63 మంది గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. అయితే, అసలు సమస్య ఇక్కడే మొదలైంది. ఇలా గ్రేడ్-5గా ఎంపికైన మరుక్షణమే, కేవలం డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా ఉన్న వారికి గ్రామ పంచాయతీలు కేటాయించడం, కార్యదర్శి అధికారాలు కల్పించడంతోపాటు డ్రాయింగ్ అధికారాలను కూడా కట్టబెట్టారు. మొత్తంగా ఈ ఐదు జిల్లాల్లో సుమారు 200 మందికి ఇలా పదోన్నతులు వచ్చాయని తెలుస్తోంది. ఈ పరిణామం పంచాయతీ కార్యదర్శుల్లో అసంతృప్తికి దారితీసింది. తమకు పదే పదే జరుగుతున్న అన్యాయంపై వారు ఆందోళన చెందుతున్నారు.

- చిత్తూరు జిల్లాలోని చిన్నఉప్పరపల్లె గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శి తాజాగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొందాడు. అతడికి మేలుమాయి గ్రామ పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు.
- అదే జిల్లాలో సోమల-1 గ్రామ పంచాయతీలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఉన్న ఒకరు తాజాగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి పదోన్నతి పొందారు. అతనికి అదే జిల్లాలోని అంకంబట్టు పంచాయతీని అప్పగించి డ్రాయింగ్ అధికారాలు కూడా ఇచ్చారు. కానీ, అదే జిల్లాలో ఐదేళ్లుగా గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉన్న అనేక మందికి ఇప్పటి వరకు ఎలాంటి హోదా దక్కలేదు. ఇలా ఈ ఒక్క జిల్లాలోనే కాదు.. పదోన్నతుల ప్రక్రియ మొదలైన అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చిత్తూరు జిల్లాతోపాటు విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఇప్పటికే పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఈ 4 జిల్లాల్లో సుమారు 450 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు సచివాలయం 2, 3, 4, 5లలో విధులు నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉన్నవారిని కాదని, గ్రేడ్-6గా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చి డ్రాయింగ్ అధికారాలు కట్టబెట్టడం వీరిని ఆవేదనకు గురిచేస్తోంది.

పరిపాలన సౌలభ్యం కోసమే

ఆ బదిలీలు

- స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ పోస్టింగ్స్‌ను పరిశీలిస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఈఎస్ఐ డైరెక్టర్ వివరణ

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐలో బదిలీలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే చేపట్టామని ఈఎస్ఐ డైరెక్టర్ వి.ఆంజనేయులు తెలిపారు. 'పలుకుబడికే పదోన్నతి' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. ఈఎస్ఐ విభాగంలో మూడు జాయింట్ డైరెక్టర్ పోస్టులు, మూడు సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ఆర్ఎంవో) పోస్టులున్నాయని తెలిపారు. తిరుపతి, విశాఖపట్నంలో ఉన్న ఇద్దరు సీఎస్ఆర్ఎంవోలు ఐదేళ్ల సేవా కాలాన్ని పూర్తి చేయలేదని, పైగా వారు జేడీ పోస్టులను స్వీకరించడానికి ఆసక్తి చూపలేదని చెప్పారు. విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రిలో సీఎస్ఆర్ఎంవో పోస్టు ఖాళీగా ఉందన్నారు. కాగా, ఈఎస్ఐలో కడప జాయింట్ డైరెక్టర్, విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రిలో సీఎస్ఆర్ఎంవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు సీనియర్ వైద్యులు ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. కనుక ప్రభుత్వ నిబంధనల ప్రకారం లిస్ట్‌లో మొదటి స్థానంలో ఉన్న సీనియర్ వైద్యుడిని కడప బదిలీ చేయాలి. రెండో స్థానంలో ఉన్న వారిని విజయవాడ సీఎస్ఆర్ఎంవోగా లేదా విజయవాడ జేడీగా బదిలీ చేయాలి. కానీ అధికారులు ఎనికేపాడు ఈఎస్ఐ ప్రధాన కార్యాలయంలో ఉన్న జేడీని ఎనికేపాడు జాయింట్ డైరెక్టర్ పోస్టుకు, ఇక్కడ జేడీని ఎనికేపాడులోని ఈఎస్ఐ కార్యాలయానికి బదిలీ చేసేశారు. బదిలీల్లో ఐదేళ్ల సర్వీసు నిబంధనలు ఎక్కడ పాటించారో ప్రభుత్వమే తేల్చాలి!. పైగా పరిపాలన సౌలభ్యం కోసమేనంటూ అధికారులు కప్పదాట్లు పడుతుండడం గమనార్హం. ఇక, ఇటీవల పదోన్నతి పొందిన స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్లు మెడికల్ సూపరింటెండెంట్‌కు పోస్టు నియామకం కోరుతూ సమర్పించిన ప్రతిపాదనను ప్రస్తుత ప్రభుత్వ నియమ, నిబంధనలు, వారి సర్వీసు, పెండింగ్ విచారణల ఆధారంగా పరిశీలిస్తామని డైరెక్టర్ బదులిచ్చారు.

ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న కలెక్టర్

సుభాష్‌నగర్ (కరీంనగర్), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వాసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఆదర్శంగా నిలిచారు. కొన్ని సంవత్సరాలుగా సైనసైటిస్‌తో ఇబ్బంది పడుతున్న ఆమె ఇటీవల జిల్లా జనరల్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వారు పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ రవికాంత్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడి కలెక్టర్‌ను ప్రశంసించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అందుకే పాకిస్థాన్‌లో విడుదల చేయలేదు



ఆమిర్‌ఖాన్

ఆమిర్‌ఖాన్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'దంగల్'. 2016లో విడుదలైన ఈ సినిమా ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రెండు వేల కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. తాజాగా ఓ టెలివిజన్ షో పాల్గొన్న ఆయన 'దంగల్'ను పాకిస్థాన్‌లో విడుదల చేయకపోవడం వెనుకున్న కారణాన్ని వివరించారు. 'గీతా ఫొగట్ విజయం సాధించిన అనంతరం జాతీయ పతాకం నింగిలోకి ఎగురుతూ ఉండగా... జాతీయ గీతం వినిపించే దృశ్యాలు సినిమా నుంచి తొలగించండి లేదంటే చిత్ర ప్రదర్శనకు అంగీకరించం' అని పాకిస్థాన్ సెన్సార్ బోర్డు షరతు విధించింది. ఇదే విషయమై చిత్ర సహ నిర్మాణ సంస్థ డిస్నీ నన్ను సంప్రదించగా నష్టం వచ్చినా సరే.. మనం సినిమాని పాకిస్థాన్‌లో విడుదల చేయడం లేదు అని ఖరాఖండిగా చెప్పేశాను' అని ఆమిర్‌ఖాన్ వివరించారు. 'మీ జాతీయ పతాకాన్ని తొలగించండి, మీ జాతీయ గీతాన్ని తీసివేయండి అనే వారితో నాకు పనేంటి. అలాంటి వ్యాపారం అక్కర్లేదని చెప్పేశాను' అంటూ ఆయన ఆ నాటి విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

'కన్నప్ప'కు రజనీ అభినందనలు



దిగ్గజ నటులు రజనీకాంత్, మోహన్‌బాబు కలసి నటించిన 'పెదరాయుడు' విడుదలై 30 ఏళ్లు పూర్తయ్యాయి. 1995 జూన్ 15న విడుదలైన ఆ చిత్రం సంచలన విజయం సాధించి, వసూళ్ల చరిత్రలో సరికొత్త అధ్యాయం సృష్టించింది. ఈ నేపథ్యంలో ఆదివారం రజనీకాంత్ ఇంట్లో ఆయన్ని కలిశారు మోహన్‌బాబు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ క్రమంలోనే మోహన్‌బాబు నిర్మించిన 'కన్నప్ప' చిత్రాన్ని రజనీకాంత్ చూశారు. విష్ణుని అక్కున చేర్చుకుని సినిమా బాగుందంటూ అభినందించారు. ఈ ఆనందాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు విష్ణు. 'ఈ క్షణం కోసమే 22 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాను. నా నటనని రజనీ అంకుల్ మెచ్చుకోవాలని నా కల. అది ఇప్పుడు నెరవేరింది. ఈ రోజు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది' అని అందులో పేర్కొన్నారు. అలాగే మోహన్‌బాబు కూడా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ 'నేను నిర్మించిన 'పెదరాయుడు' చిత్రానికి 30 ఏళ్లు పూర్తైన రోజునే నా ప్రియ మిత్రుడు రజనీకాంత్ 'కన్నప్ప' చిత్రాన్ని తన కుటుంబ సభ్యులతో కలసి చూశారు. సినిమా చూసిన అనంతరం ఆయన కురిపించిన ప్రేమ, అభిమానం, ప్రశంసలు, ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మరచిపోలేను. థాంక్యూ మిత్రమా' అని పేర్కొన్నారు. 'కన్నప్ప' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది.

నాపై ప్రభాస్‌కు ఉన్న నమ్మకమే 'రాజాసాబ్'






ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ కామెడీ 'రాజాసాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. వింటేజ్ లుక్‌లో ప్రభాస్ చేసిన హంగామా, అదిరిపోయే విజువల్స్, నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ముఖ్యంగా ప్రభాస్ సంభాషణలు, ఆయన చేసిన కామెడీ అభిమానులను ఖుషీ చేశాయి. మారుతి టేకింగ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మారుతి మాట్లాడుతూ 'ఓ రోజు యువీ వంశీ నిన్ను ప్రభాస్ పిలుస్తున్నారు అని చెప్పారు. ఆయన్ని కలిసేందుకు ముంబై వెళ్లా. 'నువ్వు చేసిన 'ప్రేమకథా చిత్రమ్', 'భలేభలే మగాడివోయ్' లాంటి వినోదాత్మక కథ రెడీ చెయ్యి. సినిమా చేద్దాం' అని అన్నారు. 'పక్కా కమర్షియల్' చిత్రం ఫ్లాప్ అవ్వడంతో నాతో సినిమా చెయ్యాలనుకున్న నిర్మాత వెనక్కి వెళ్లారు. అయినా నాపై నమ్మకంతో ప్రభాస్ ఈ సినిమాను చేశారు. ఆయనకు నాపై ఉన్న నమ్మకమే ఈ సినిమా. షూటింగ్ మొదలయ్యాక కూడా 'ఈ టైమ్‌లో ప్రభాస్‌కు మారుతితో సినిమా అవసరమా'.. 'అయినా ప్రభాస్ కామెడీ చేయడమేంటి' వంటి సందేహాలు వినిపించాయి. అన్ని సవాళ్లనూ స్వీకరిస్తూ ఈ సినిమాను మరింత పట్టుదలతో కొనసాగించా. అభిమానులు ఆయన్ని ఎంతగా ప్రేమిస్తారో తెలిసిందే. అంతకు వెయ్యిరెట్లు ఆయన వారిని ప్రేమిస్తారు" అని అన్నారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ "ఆరంభం నుంచి ముగింపు వరకూ సినిమా మీ అందర్నీ ఒక్క క్షణం కూడా చూపు తిప్పుకోనివ్వకుండా ఎంటర్టైన్ చేస్తుంది. 40 నిమిషాల క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ "ఈ చిత్రం మొదలైనప్పుడు ఓ నిర్మాత దీనిపై నెగెటివ్‌గా మాట్లాడారు. సినిమా విడుదలయ్యాక ఆయనే పొగుడుతారు" అని తెలిపారు.

రెగ్యులర్ షూట్ షురూ



రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఇటీవలె ఓ చిత్రం ప్రారంభమైన సంగతి తెలిసిందే. 'ఆర్‌టీ 76' వర్కింగ్ టైటిల్. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సోమవారం రెగ్యులర్ షూట్‌ను మొదలెట్టారు. హైదరాబాద్‌లో నిర్మించిన ఓ ప్రత్యేక సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇందులో రవితేజతో పాటు ఇతర తారాగణం పాల్గొంటున్నారు. ఇది రవితేజ మార్క్ కామెడీతో పూర్తి స్థాయి కుటుంబ కథా చిత్రంగా ఉండనుంది. ఇందులో ఆయన సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, డీఓపీ: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

విభిన్న కథతో...



'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సుహాస్, శివానీ నగరం మరోసారి జంటగా తెరపై కనిపించనున్నారు. వీరిద్దరూ కలసి నటించనున్న కొత్త చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. గోపీ అచ్చర ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తం షాట్‌కు సత్యదేవ్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. వంశీ నందిపాటి ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. విభిన్న కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. షణ్ముఖ ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందించారు.

మళ్లీ వస్తున్న 'హనుమాన్ జంక్షన్'



అర్జున్, జగపతి బాబు, వేణు హీరోలుగా 2001లో వచ్చిన 'హనుమాన్ జంక్షన్' చిత్రం మళ్లీ ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఎడిటర్ మోహన్ నిర్మించిన ఈ చిత్రంతోనే ఆయన తనయుడు మోహన్ రాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. లయ, స్నేహ, విజయలక్ష్మి హీరోయిన్లుగా నటించిన 'హనుమాన్ జంక్షన్' చిత్రాన్ని ఈ నెల 28న మళ్లీ థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్స్ తక్కువగా వస్తున్న ప్రస్తుత తరుణంలో 'హనుమాన్ జంక్షన్' మళ్లీ తన మ్యాజిక్‌తో మెస్మరైజ్ చేస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్



రోహిత్ సహాని, అబిద్ భూషణ్, రియా కపూర్, మేఘనా రాజ్ ప్రధాన పాత్రలు పోషించిన 'మిస్టీరియస్' చిత్రం టైటిల్ పోస్టర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. సినిమా విజయం సాధించాలని ఆయన కోరుకున్నారు. చిత్ర దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ మిస్టరీ కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలు అలరిస్తాయి' అని చెప్పారు. చిత్ర నిర్మాత జయ్ వల్లందాస్ (అమెరికా) మాట్లాడుతూ 'ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించాం.త్వరలో ఆడియో విడుదల చేస్తాం. సినిమాను ఆదరించాలని కోరుతున్నాను' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ్ ఉప్పు.



విజయవాడలో బ్యాంక్ నుంచి డ్రా చేసిన తల్లికి వందనం నగదుతో మహిళ

ఒక్కరోజే 10 వేల కోట్లు జమ అద్భుతం

పవన్ అణుశక్తి స్వభావి -ఎమ్మెల్సీ నాగబాబు



అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అణుశక్తి లాంటి విభిన్న స్వభావాలు కలిగిన నాయకుడు పవన్ కల్యాణ్ అని జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరానికి చెందిన ఎన్ఆర్ఐ జనసైనికులు, వీర మహిళలతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేనపై అభిమానంతో పార్టీకి ఆర్థిక సహకారం అందిస్తున్న పెర్త్ నగరంలోని జనసేన అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలన ఏడాది కాలంలోనే ప్రజలకు చేరువైంది. పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో సఫలీకృతం అవుతున్నారు. తల్లికివందనం పథకంలో భాగంగా 67 లక్షల మంది చిన్నారులకు రూ.10,091 కోట్లు ఒకే రోజు అర్హుల ఖాతాల్లో జమ చేయడం అద్భుతమైన అంశం. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను తీర్చడం కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తోంది' అని నాగబాబు అన్నారు.

తల్లికి వందనంతో ప్రతి ఇంటా ఆనందం

వైసీపీ ఫీజు బకాయిలు 3,400 కోట్లూ చెల్లిస్తున్నాం -నీలాయపాలెం



అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేసింది. లక్షలాది మంది ఇళ్లలో ఆనందాన్ని నింపింది' అని ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ కుమార్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రంలో పాఠశాలలు తెరిచిన తర్వాత విద్యార్థుల కళ్లలో ఆనందం స్పష్టంగా కనిపించింది. మంత్రి లోకేశ్ నాయకత్వంలో విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచింది. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు చదువు మానేశారు. ఇది విద్యారంగంపై వైసీపీకి ఉన్న నిబద్ధత. రాష్ట్రంలో 88 లక్షల మంది విద్యార్థులు ఉంటే కేవలం 42 లక్షల మందికి మాత్రమే 'అమ్మ ఒడి' అందించారు. కూటమి ప్రభుత్వం మాత్రం 67లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' అందిస్తోంది. వైసీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన 3,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలనూ తీరుస్తున్నాం' అని నీలాయపాలెం వివరించారు.



నోవాటెల్ వద్ద బీచ్ వైపు కట్టిన పరదాలు తొలగిస్తున్న హోమ్‌గార్డులు.

పరదాలు తీయించిన మంత్రి లోకేశ్

విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో సీఎం చంద్రబాబు సోమవారం యోగాంధ్రపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు బీచ్ రోడ్డులో ఉన్నవారికి హోటల్ కారిడార్‌లో ఉన్నవారు కనపడకుండా తెల్లటి పరదాలు కట్టారు. సమీక్షకు వచ్చిన మంత్రి లోకేశ్ బీచ్ వైపు చూడగా, అన్నీ పరదాలే కనిపించాయి. దాంతో ఆయన పోలీసు అధికారులను పిలిచి మాట్లాడారు. పరదాల ప్రభుత్వం పోయిందని, ఇప్పుడు పరదాలు వేయాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే వాటిని తీసివేయించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.



మంత్రి మనోహర్ చేతుల మీదుగా భూమి పత్రాలను అందిస్తున్న దాత సువర్చల శశికిరణ్

స్కిల్ ప్రాజెక్ట్ కోసం కోటి స్థలం విరాళం

తెనాలిలో ఓ మహిళ దాతృత్వం

- కూటమి ప్రభుత్వం, మంత్రి మనోహర్‌పై నమ్మకంతో ఇచ్చామన్న దాత సువర్చల శశికిరణ్
- ఆమె స్ఫూర్తితో మంత్రి మనోహర్ 10 లక్షల విరాళం

తెనాలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెనాలి మహిళలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో భారీ విరాళాలు ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. ఇటీవలే పట్టణంలో రూ. 6 కోట్ల విలువైన మహిళా మండలి భవనాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో మహిళలే దాన మివ్వగా.. వారి బాటలోనే తాజాగా మరో మహిళ నడిచారు. ప్రభుత్వానికి రూ. కోటి విలువైన భూమిని దానమిచ్చారు. మహిళల ఆర్థిక ప్రగతికి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలం కొలకలూరుకు చెందిన పొన్నుకంటి సువర్చల శశికిరణ్ తన ఎకరం భూమితో సహా దారి కోసం అవసరమైన మరి కొంత భూమిని కూడా కొని మరీ ప్రభుత్వానికి అందజేశారు. భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను దాత సువర్చల శశికిరణ్ మంత్రి మనోహర్ చేతుల మీదుగా సబ్‌కలెక్టర్ సంజన సింహ, తహసీల్దార్ గోపాలకృష్ణలకు అందించారు. కూటమి ప్రభుత్వంపైన, మంత్రి మనోహర్‌పైన ఉన్న నమ్మకంతో, తమ గ్రామం కొలకలూరులో మహిళల అభివృద్ధి కోసం తన భూమిని విరాళంగా ఇచ్చినట్లు సువర్చల పేర్కొన్నారు. తన భూమి ఔటర్‌రింగ్ రోడ్డుకు సమీపంలో ఉందని, భవిష్యత్‌లో రూ. కోట్లు విలువ చేస్తుందని స్థానికులు కొందరు చెప్పినా కూడా వినకుండా ప్రాజెక్టు భవనాల నిర్మాణాల కోసంముందుకొచ్చానన్నారు. తమ బంధువులు, కుటుంబీకులు దీనికి కలిసి రావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వ కాలంలోనే అభివృద్ధి చేయగలిగితే తన ఆలోచనకు కార్యరూపం వచ్చినట్లు అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

సెర్ప్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు: మంత్రి మనోహర్

దాత ఇచ్చిన భూమిలో స్కిల్ ప్రాజెక్ట్‌ను సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని మంత్రి మనోహర్ తెలిపారు. మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి ఒక విభాగంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, మరో విభాగంలో మహిళలకు స్వయం ఉపాధి, ఇంకో దానిలో సోలార్ పవర్‌కు సంబంధించినవి ఏర్పాటు చేయదలిచామన్నారు. ఓ మధ్య తరగతి మహిళ రూ. కోటి విలువైన భూమిని అప్పగించడం తనకు స్ఫూర్తిని కలిగించిందని చెప్పారు. ప్రాజెక్టు భవన నిర్మాణం వ్యయంలో తన వంతుగా రూ.10 లక్షల విరాళాన్ని ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వరుసగా దాతలు ముందుకు రావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని, వారి ఆశయాలను ఎక్కడా వమ్ముకానివ్వకుండా నెరవేర్చుతామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో నేతల భూ కబ్జాలు, అనేక కుంభకోణాలే చూశామని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వానికి ప్రజలు సహకారం అందించడం చూస్తున్నామని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు.

సూపర్ సిక్స్ అమలుతో వైసీపీ నేతల్లో వణుకు

- సంక్షేమానికి టీడీపీ మారుపేరు: ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సంక్షేమానికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తల్లికి వందనం పథకంతో ప్రతి ఇంట్లో నేడు సంబరాలు చేసుకుంటున్నారు. నాడు జగన్ ఒక్క పిల్లాడినే చదివించుకోండని అంటే నేడు చంద్రబాబు పిల్లలందరినీ చదివించుకోండని అంటున్నారు. జగన్ ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తే మేం ఏడాదికే రూ.10,091 కోట్లు ఖర్చు చేస్తున్నాం. జగన్ రెడ్డి సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. భవిష్యత్తులో పేదరికం లేని సమాజ నిర్మాణానికి నేడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది' అని నసీర్ అన్నారు.

తోక కట్ చేస్తా

అధికారంలో ఉన్నప్పుడు రౌడీయిజం చేశారు

- ఇప్పుడు కూడా చేస్తానంటే కుదరదు
- జగన్‌కు ముఖ్యమంత్రి హెచ్చరిక
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమంపై ముందుకే
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- విశాఖ సహజసిద్ధమైన నగరం
- ముంబైకి దీటుగా అభివృద్ధి చేస్తా: చంద్రబాబు
- ఉమ్మడి విశాఖ టీడీపీ కార్యకర్తలతో భేటీ



విశాఖలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

> జగన్ అధికారంలో ఉండగా పోలీసులను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేశారు. ఇప్పుడూ రౌడీయిజం చేస్తానంటే కుదరదు. ఇక్కడ ఉన్నది సీబీఎన్ అన్న విషయం గుర్తుంచుకోవాలి.
>
> ఎత్తిన జెండా దించకుండా చంద్రయ్యలాంటి కార్యకర్తలు గొంతు మీద కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలేశారు. అటువంటి కార్యకర్తలకు రుణపడి ఉంటాం. వారిని ఆదుకునే బాధ్యత తీసుకుంటాం. దీనికోసం ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తాం.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌కు వత్తాసు పలుకుతూ రాజకీయం చేస్తే సీరియస్‌గా ఉంటుంది. మంచిగా ఉంటే ఏమైనా సమాధానం చెబుతా. దారితప్పి పులివెందుల మార్క్ రాజకీయం చేయాలని చూస్తే తోక కట్ చేస్తా. లా అండ్ ఆర్డర్ చేతుల్లోకి తీసుకుంటే సీరియస్‌గా ఉంటుంది. ఎవ్వరినీ వదిలిపెట్టను'...అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. జగన్ తెనాలి వెళ్లి రౌడీ, గంజాయి బ్యాచ్‌కు వత్తాసు పలుకుతూ రాజకీయం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలోని వీ కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్తలతో సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎంతోమందితో రాజకీయంగా పోరాటం చేశానన్నారు. కానీ, ప్రస్తుతం రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థులతో పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. అటువంటి వారి రాజకీయ ముసుగు తొలగించాలని, నేరస్థులను నేరస్థులుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. తానెక్కడా రాజీపడనన్నారు. తనకెవరిపైనా కక్ష లేదంటూ.. రాష్ట్రంపై ప్రేమ, పేదలపై అభిమానం మాత్రమే ఉన్నాయన్నారు. తప్పు చేసినవారు ఎవరైనా శిక్షార్హులేనని.. ఎప్పుడైనా తప్పకుండా శిక్ష అనుభవిస్తారని తెలిపారు. జగన్ పొగాకు రైతులను పరామర్శించేందుకు పొదిలి వెళ్లి.. ఎదురొస్తే తొక్కేస్తామంటూ ప్లకార్డులు ప్రదర్శించారని, మీకు ఎదురు ఎవరొస్తున్నారని చంద్రబాబు నిలదీశారు. 'పరామర్శలు చేసుకోండి. ఆ పేరుతో రౌడీయిజం, రుబాబు చేస్తామంటే కుదరదు. పోలీసులపై దాడి చేయడం, ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం సరికాదు. నోరు మూయించే సత్తా టీడీపీకి ఉంది' అని స్పష్టంచేశారు. ఇంకా ఏమన్నారంటే..

వ్యవస్థలన్నీ విధ్వంసం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయింది. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేను గతంలో ఎన్నడూ చూడని పరిస్థితులు చూస్తున్నా. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసానికి గురైంది. అన్ని వ్యవస్థలనూ నాశనం చేసేశారు. విశాఖతోపాటు అనేక ప్రాంతాల్లోని తహశీల్దార్ కార్యాలయాలు, కలెక్టర్ ఆఫీసులు, ఆస్పత్రులు, ఐటీఐలు.. ఇలా కనిపించిన ప్రభుత్వ ఆస్తులన్నింటినీ తాకట్టు పెట్టేసి అప్పులు చేసేశారు. మద్యపానం నిషేధిస్తామని చెప్పి.. వచ్చే 25 ఏళ్లకు మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టేశారు.

అమరావతికి అభ్యంతరం లేదని..

రాజధానిగా అమరావతి ఎంపికపై అభ్యంతరం లేదని చెప్పిన వ్యక్తి మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాజకీయాల్లో ఉన్న ఏ వ్యక్తి కూడా ఇటువంటి పనులకు పాల్పడరు. శ్మశానమని, అవసరం లేదని, కేసులు పెట్టి నాశనం చేసే ప్రయత్నం చేశారు. మూడు ముక్కలాట ఆడిన వ్యక్తికి విశాఖ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు. విశాఖ సహజసిద్ధమైన నగరం. రాష్ట్రంలో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన నగరం. రానున్న రోజుల్లో ముంబైకి దీటుగా అభివృద్ధి చేస్తా. విశాఖ అంటే నాకెంతో ఇష్టం. ఇక్కడి ప్రజలు మంచి వాళ్లు. అన్ని వేళల్లో టీడీపీకి అండగా నిలిచారు. విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి నీతి ఆయోగ్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఈ క్రమంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరుగులు పెట్టిస్తున్నాం. సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు కాబోతోంది. దీనివల్ల విమానాల సంఖ్య పెరగడంతో పాటు మన పిల్లలే అందులో పని చేసే పరిస్థితి వస్తుంది. రాష్ట్రం నుంచి ఎన్డీఏ ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో సీట్లను ఇవ్వడం వల్ల ఢిల్లీలో పరపతి పెరిగింది. దీనివల్ల అనేక సమస్యలను పరిష్కరించుకోగలుగుతున్నాం.

రాజకీయ భూతంపై ఆందోళన..

రాష్ట్రానికి రూ.9.5 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయి. పెట్టుబడుల కోసం ఎక్కడకు వెళ్లినా.. మీరున్నారు కాబట్టి వస్తాం.. కానీ రాష్ట్రంలో ఒక భూతం ఉంది. మళ్లీ వస్తే పరిస్థితేంటని ప్రశ్నిస్తున్నారు. ఆ భూతాన్ని రాజకీయంగా శాశ్వతంగా భూస్థాపితం చేశానని.. భయపడాల్సిన అవసరం లేదని చెబుతున్నాను. రాజకీయం అంటే తమాషా కాదు. మోసాలు, నేరాలు చేసి ఎదుటి వాళ్లపై వేయకూడదు. బాబాయిని లేపేసి సాక్షి పేపర్, టీవీలో గుండెపోటు అని స్క్రోలింగ్ వేశారు. నేను కూడా నమ్మేశా. అయితే ఆరోజు నేను కరెక్ట్‌గా వ్యవహరించి ఉంటే ఓడిపోయే వాళ్లం కాదు. సాక్షిలో నారాసుర పేరుతో కథనాలు వండి వార్చారు. కోడి కత్తి డ్రామాలు ఆడాడు.

సూపర్ సిక్స్‌పై జనంలోకి వెళ్లాలి..

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నాం. ఈ విషయాన్ని ప్రజలకు కార్యకర్తలు తెలియజేయాలి. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని చెప్పాం. చెప్పినట్టుగానే ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ డబ్బులు జమచేశాం. రైతుల కోసం మూడు విడతల్లో అన్నదాతా సుఖీభవ కింద సాయం అందిస్తాం. ప్రతినెలా 1న పెన్షన్లు అందిస్తున్నాం. డీఎస్సీపై తొలి సంతకం పెట్టి 16 వేలకుపైగా పోస్టులను భర్తీ చేస్తున్నాం. దీపం పథకం కింద ఉచిత సిలిండర్లు అందిస్తున్నాం. టైట్లింగ్ యాక్ట్ తోపాటు కబ్జాలు, సెటిల్‌మెంట్లకు చెక్ పెట్టాం.

రిపోర్టు బాగా లేకుంటే పక్కకే

- ఎమ్మెల్యేలకు బాబు వార్నింగ్

ప్రజలకు మేలు చేస్తూ 2029 విజయానికి రూట్ మ్యాప్ క్లియర్ చేద్దాం. ఎమ్మెల్యేల పనితీరుపై మొన్న సర్వే చేయించా. ప్రజల్లో రిపోర్టు బాగుంటే జిందాబాద్. లేదంటే నమస్కారం పెట్టి పక్కనపెట్టేస్తా. కార్యకర్తే అధినేత.. దీనిని సాధ్యం చేయడానికి ఎమ్మెల్యేలు పనిచేయాలి. కార్యకర్తల నుంచీ నివేదిక తెప్పించుకుంటా. వాళ్ల మద్దతు లేకపోతే పక్కనపెడతా. మనకు దేశంలో ఏ పార్టీకీ లేనంత సంస్థాగత బలముంది. కోటి సభ్యత్వం ఉంది. 60 ఓట్లు, 20 కుటుంబాలకు ఇద్దరు మనుషులను పెట్టుకున్నాం. కొత్తగా బూత్, యూనిట్, క్లస్టర్ కమిటీలు వేసుకుంటున్నాం. ఇప్పటికే కార్యకర్తలకు పదవులు ఇచ్చాం. ఇంకా ఇస్తాం. రోజులో సగం ప్రజల కోసం, మిగిలిన సగం పార్టీ కార్యకర్తల కోసం పని చేస్తున్నా. గడచిన ఎన్నికల్లో పార్టీ అద్భుత విజయాన్ని నమోదు చేయడానికి వారు ఎంతగానో కృషిచేశారు. వారికి అండగా ఉంటాం.



పల్లా కుటుంబ సభ్యులకు సీఎం పరామర్శ

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి చంద్రబాబు నివాళులర్పించారు. సీతంపేటలోని ఆయన నివాసానికి వెళ్లి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎట్టకేలకు కదిలిన నైరుతి

తిరిగి వేగం పుంజుకున్న రుతుపవనాలు

- మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌కు విస్తరణ
- ముంబైని ముంచెత్తుతున్న వర్షాలు
- రోడ్లు జలమయం, మెట్రో రైళ్లకు అంతరాయం
- కేరళలోనూ భారీ వర్షాలు, జనజీవనం అస్తవ్యస్తం



విశాఖపట్నం/ న్యూఢిల్లీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సుమారు 19 రోజులపాటు నిలిచిపోయిన నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు పుంజుకున్నాయి. మధ్య, ఉత్తర అరేబియా సముద్రం, గుజరాత్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో పలు ప్రాంతాలు.. కొంకణ్, మధ్య మహారాష్ట్ర, తెలంగాణలో మిగిలిన ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో గుజరాత్, మహారాష్ట్ర, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ , జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ విస్తరించనున్నాయి. గుజరాత్ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం మంగళవారానికి అల్పపీడనంగా మారనుంది. ఇంకా వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా కదులుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా.. ఏపీలో సోమవారం పలుచోట్ల వర్షాలు కురిశాయని, రానున్న 24 గంటల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

31 శాతం తక్కువ వర్షపాతం

నైరుతి రుతుపవనాలు సోమవారం నాటికి మహారాష్ట్ర మొత్తం వ్యాపించి, పొరుగున ఉన్న గుజరాత్, మధ్యప్రదేశ్‌లోకి కూడా ప్రవేశించాయని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. సాధారణంగా జూన్ 1న కేరళను తాకాల్సిన రుతుపవనాలు ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందు మే 24నే పలకరించాయి. ఆ తర్వాత దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారతంలోకి ప్రవేశించాయి. కానీ, ఉన్నట్టుండి మే 29 నుంచి రుతుపవనాల్లో స్తబ్దత నెలకొంది. ప్రస్తుతం అవి వేగం పుంజుకున్నాయని, వీటి ప్రభావంతో రాబోయే పది రోజుల్లో పశ్చిమ తీరం, మధ్య, ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రుతుపవనాల్లో కదలిక లేక జూన్ మొదటి అర్ధ భాగంలో భారత్‌లో సగటు కంటే 31 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇప్పుడు నైరుతి వేగం పుంజుకోవడంతో జూన్ రెండో అర్ధభాగంలో సగటు కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని ఐఎండీ పేర్కొంది. రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత వేగంగా పురోగమిస్తాయని, ఈ నెలాఖరులోగా దేశంలోని చాలా ప్రాంతాలకు విస్తరిస్తాయని తెలిపింది.

ముంబైలో విస్తారంగా వర్షాలు

రుతుపవనాల ప్రభావంతో మహారాష్ట్రను వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా ముంబై, శివారు నగరాల్లో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్ల సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకూ ముంబైలో 9.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తూర్పు, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 5.8 సెం.మీ, 7.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 18 మంది మరణించారని, 65 మంది గాయపడ్డారని మహారాష్ట్ర అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో ముంబై నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. సోమవారం కురిసిన భారీ వర్షాలకు ముంబై, థాణే, పాల్ఘర్ తదితర ప్రాంతాలకు 'ఆరెంజ్' అలర్ట్, రాయగడ్‌కు రెడ్ అలర్ట్ జారీచేశారు.

కేరళ అతలాకుతలం..

కేరళలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరాది జిల్లాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. బస్సులు, రైలు ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలకు నదులు, జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో కన్నూర్, కాసర్‌గోడ్ సహా పలు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కన్నూర్‌లోని కక్కడ్ ప్రాంతంలో రహదారిపైకి నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాసర్‌కోడ్ జిల్లాలోని వెల్లరికుండ్ ప్రాంతంలో కనీసం 10 కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. మలప్పురం జిల్లా తెన్నలలో 21 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. కోజికోడ్‌లోని వడకరలో 18 సెం.మీ., కాసరకోడ్, కన్నూర్‌లోని పలు ప్రాంతాల్లో 16 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి: రాఘవులు

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'బీజేపీ పాలనలో రాజ్యాంగ పునాదులపై ఉద్దేశపూర్వక దాడి జరుగుతోంది. ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తం కావాలి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి' అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల (వర్క్‌షాపు)ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందంటూ ఊదరగొడుతున్న కేంద్ర పెద్దలు దేశంలో పెరుగుతున్న అసమానతలు, కార్మికులకు జీవనోపాధి, సంక్షోభం తదితర వాస్తవిక అంశాలను కూడా బయట పెట్టాలి. పాకిస్థాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' విషయంలో అమెరికా అధ్యక్షుడి పాత్రతో కాల్పుల విరమణ జరిగిందన్న విషయంపై వాస్తవాలు చెప్పేందుకు, ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించడానికి మోదీ సర్కార్ నిరాకరిస్తోంది. ఏపీలోని టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా ప్రమాదకరమైన కేంద్ర విధానాలకు వంత పాడుతూ.. లౌకిక, ప్రజాస్వామ్య ఫెడరల్ వ్యవస్థలకు, రాష్ట్ర ప్రయోజనాలకు హాని చేస్తోంది' అని విమర్శించారు. పొలిట్ బ్యూరో మరో సభ్యుడు యు.వాసుకి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, కె.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- బ్రేక్ బైండింగ్‌తో చేలరేగిన మంటలు



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల వద్ద ఆగిన రైలు

ధర్మవరం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌కు (నంబర్ 12769) బ్రేక్ బైండింగ్ కావడంతో మంటలు చేలరేగాయి. ప్రయాణికులు భయంతో కేకలు వేస్తూ చైన్ లాగారు. రైలు ఆగగానే దిగి దూరంగా పరుగులు తీశారు. సోమవారం రాత్రి సుమారు 8.40 గంటల సమయంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు వేగంగా చిగిచెర్ల రైల్వేస్టేషన్ దాటగానే గార్డు ఉన్న బోగీ ముందుభాగం చక్రాల వద్ద బ్రేకు బైండింగ్ అయింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన గార్డు ట్రైన్‌ను ఆపేందుకు బీబీసీ బ్రేకు వేశారు. ప్రయాణికులు కూడా చైన్ లాగారు. రైలు ఆగగానే ప్రయాణికులు కిందకు దూకారు. చీకట్లో కంకర రాళ్లల్లో కేకలు వేస్తూ దూరంగా పరుగులు తీశారు. వెంటనే గార్డు మంటలను అగ్నిమాపక పరికరాలతో ఆర్పివేశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో సుమారు అరగంట పాటు రైలు ఆగిపోయింది. పీలేరుకు చెందిన శ్రీదేవి రైలు దిగగానే ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కుని పారిపోయారు. తోటి ప్రయాణికులు వెంబడించినా దొరకలేదు.

అమరావతిపై కొందరు విషం కక్కుతున్నారు



- తల్లికి, చెల్లికి ఎలాంటి గౌరవం ఇవ్వాలో తెలియని పరిస్థితిలో కొందరున్నారు
- పాకిస్థాన్‌లో ప్రభుత్వం, ఉగ్రవాదం సమాంతరంగా పాలిస్తున్నాయి: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిపై కొందరు విషం కక్కుతున్నారు. అసభ్యకరంగా మాట్లాడుతున్నారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 'తల్లికి, చెల్లికి ఎలాంటి గౌరవం ఇవ్వాలో కూడా తెలియని పరిస్థితిలో కొందరున్నారు. ఇది చాలా బాధాకరం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురావాలనేదే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆలోచన . వికసిత్ భారత్ కలలు సాకారం కావాలంటే వికసిత్ రాష్ట్రాలు కావాలి. పాకిస్థాన్‌లో ప్రభుత్వం, ఉగ్రవాద సంస్థలు సమాంతర పాలన సాగిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్ తీవ్రవాదంపై భారతదేశ వాణిని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో అనేక దేశాలు ఉగ్రవాద కార్యకలాపాలతో బాధపడుతున్నాయి. ఇదే విషయాన్ని దౌత్య పర్యటనలో ఆయా దేశాలకు స్పష్టం చేశాం' అని పురందేశ్వరి అన్నారు. .

రాజీనామా చేసే దమ్ముందా?



- జగన్‌కు మంత్రి సవిత చాలెంజ్

పెనుకొండ టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం పథకంలో అవినీతి జరిగిందని నిరూపిస్తే మంత్రి, ఎమ్మెల్యే పదవికి నేను రాజీనామా చేస్తా. లేకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే దమ్ము మాజీ సీఎం జగన్‌కు ఉందా?' అని మంత్రి సవిత సవాలు విసిరారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కియ వద్ద జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... 'ఉమ్మడి అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేయించారు. అదే కియా సమీపంలో జగన్ సమావేశం పెట్టి, పరిశ్రమలను ఇక్కడి నుంచి తరిమికొడతానని బెదిరించారు. కియా ద్వారా ఈ ప్రాంతంలో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని, దీనికి చంద్రబాబే కారణం. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే జగన్ జీర్ణించుకోలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలనూ నెరవేరుస్తున్నాం' అని మంత్రి సవిత వివరించారు.

చంద్రబాబు ఇంటినే కాదు..
అసెంబ్లీనీ ముట్టడిస్తా: జోగి రమేశ్

ఇబ్రహీంపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే చంద్రబాబు ఇంటినే కాదు.. అసెంబ్లీని కూడా ముట్టడిస్తా' అని వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువైంది. ప్రజల పక్షాన పోరాడతాం. సూపర్ సిక్స్ సంగతేంటని అడుగుతాం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ కొండపల్లి మున్సిపాలిటీలో గెలిచింది. సీల్డ్ కవర్‌లో ఏముందో వారం నుంచి ఎందుకు తెరవలేదు? ప్రజల్లో చంద్రబాబు ప్రభుత్వంపై సానుకూలత ఉందో, వ్యతిరేకత ఉందో కొండపల్లి మున్సిపాలిటీ నుంచే తెలుస్తుంది. మరోసారి ప్రజలు మీకు ఇక్కడ ఓట్లు వేస్తారో లేదో ఎన్నికలు పెడితే తెలుస్తుంది. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఓ బుడంకాయ్. నందిగామలో ఎందుకు ఓడిపోయావో చెప్పు. నీకు రాజకీయ భిక్ష పెట్టింది వైసీపీ, జగన్మోహన్‌రెడ్డి కాదా?' అని ప్రశ్నించారు.

బాబు ఇంటి జోలికొస్తే
నీ ఇల్లు భూస్థాపితం చేస్తాం: ఎమ్మెల్యే వసంత

'జోగి రమేశ్... నోరు అదుపులో పెట్టుకో. నీకు కానీ, నీ నాయకులకు కానీ దమ్ముంటే మరోమారు చంద్రబాబు ఇంటిపైకి వెళ్లు. నీ ఇల్లు భూస్థాపితం చేసి తీరుతాం' అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ హెచ్చరించారు. కొండపల్లి మున్సిపాలిటీలో టీడీపీ విజయం అనంతరం సోమవారం ఆయన మాట్లాడారు. 'ఎవరిపైకి తగవులకు వెళ్లొద్దని, దురుసుగా ప్రవర్తించవద్దని, తప్పుడు పోస్టులు పెట్టొద్దని చంద్రబాబు చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నాం. కొండపల్లి మున్సిపాలిటీలో మాకు సంపూర్ణ బలం ఉంది. అధికారులు అనివార్య కారణాలతో ఒకసారి వాయిదా వేస్తే మేం పారిపోయినట్లు ఎలా అవుతుంది? ఈరోజు మీరు పారిపోయారు. కోర్టు తీర్పునకు మేం కట్టుబడి ఉన్నాం. రాష్ట్రంలో ఘోరంగా ఓడిన నువ్వెక్కడ... మైలవరం చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన నేనెక్కడ..! రోడ్డున నాలాంటి ఏనుగులు వెళ్తుంటే నీలాంటి కుక్కలు మొరుగుతాయ్. వాటికి సమాధానం చెప్పాల్సిన పని లేదు' అని వసంత పేర్కొన్నారు.

సీఎం హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

- అదే చాపర్ కేంద్ర మంత్రి పర్యటనకు కేటాయింపు
- కృష్ణపట్నం పర్యటన రద్దు చేసుకున్న పియూష్ గోయల్
- సాంకేతిక సమస్యలపై సమగ్ర నివేదిక కోరిన డీజీపీ

అమరావతి, తిరుపతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అది ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలకు ఉపయోగించే హెలికాప్టర్. సీఎం చంద్రబాబు దీన్ని తరచూ వాడుతుంటారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు కూడా అధికారులు ఈ హెలికాప్టర్‌నే కేటాయించారు. తిరుపతి నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళ్లేందుకు దీన్ని అందుబాటులో ఉంచారు. మంత్రి పియూష్ గోయల్ హెలికాప్టర్ ఎక్కాక దీనిలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన సిబ్బంది ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన కృష్ణపట్నం పోర్టు పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డాను ఆదేశించారు. హెలికాప్టర్‌ను నిపుణులతో పరిశీలించి, అసలు దీన్ని వినియోగించవచ్చా లేదా అనే అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. వీఐపీలు ప్రయాణించే హెలికాప్టర్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు.

ఏరియల్ సర్వే కూడా రద్దు: తిరుపతి జిల్లాలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ చేపట్టాల్సిన ఏరియల్ సర్వే కూడా హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య వల్ల రద్దయింది. 2 రోజుల పర్యటన నిమిత్తం పియూష్ గోయల్ ఆదివారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. సోమవారం ఉదయం తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి రేణిగుంట విమానాశ్రయం నుంచి



హెలికాప్టర్‌లో బయల్దేరి జిల్లా పరిధిలోని గూడూరు నియోజకవర్గం కోట, చిల్లకూరు మండలాల్లో జరుగుతున్న క్రిస్ సిటీ అభివృద్ధి పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించాల్సి ఉంది. అయితే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ కార్యక్రమం కూడా రద్దయింది.



ఆర్కే బీచ్‌రోడ్డులో యోగా డే ఏర్పాట్లు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



యోగా డే ఏర్పాట్లపై నోవాటెల్ హోటల్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న చంద్రబాబు

ఆరోగ్యాంధ్రే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకారం చుట్టామన్నారు. ఈ వేడుక గిన్నీస్ రికార్డులకు ఎక్కేలా, చరిత్రలో నిలిచిపోయే అతి పెద్ద ఈవెంట్‌గా నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 22 అంశాల్లో రికార్డులు నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండాలనేదే లక్ష్యమని చెప్పారు. 'దేశంలో మొత్తం లక్ష ప్రాంతాల్లో యోగా డే నిర్వహించాలని ప్రధాని చెప్పగా.. ఒక్క మన రాష్ట్రంలోనే లక్ష ప్రాంతాల్లో జరుపుతున్నాం. విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు అందమైన బీచ్ ఉంది. ఈ రోడ్డులో ఐదు లక్షల మందితో యోగా డే నిర్వహిస్తున్నాం. ఇందులో నెల రోజులు యోగా ప్రాక్టీస్ చేసినవారు 3.26 లక్షల మంది ఉన్నారు. వారికి యోగా మ్యాట్లు ఇస్తున్నాం. బీచ్ రోడ్డులో మొత్తం 326 కంపార్టుమెంట్లు పెట్టి, ఒక్కో దాంట్లో వెయ్యి మందితో యోగాసనాలు వేయిస్తాం. అందరికీ క్యూఆర్ కోడ్‌తో సీటింగ్ కేటాయిస్తారు. ప్రతి వంద మందికి ఒక టాయిలెట్, ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 5 లక్షల మందికీ యోగాంధ్ర టీషర్టులు అందిస్తాం. తూర్పు నౌకాదళం 11 యుద్ధ నౌకలపై యోగా దినోత్సవం నిర్వహిస్తుంది. పాడేరులో



సమీక్షా సమావేశంలో చంద్రబాబు, అయ్యన్న, లోకేశ్

శిక్షణ పొందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు విశాఖపట్నం వచ్చి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో యోగాసనాలు వేస్తారు. ఇది కూడా ఒక రికార్డు కానుంది. తొమ్మిదో తరగతి నుంచి ప్రతి విద్యార్థి యోగా నేర్చుకుని, నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి. దీనికి కుల, మత, ప్రాంతీయ, లింగ భేదాలు లేవని ప్రతి ఒక్కరూ చేయవచ్చు. యోగాతో అనారోగ్యాన్ని నివారించవచ్చు. రాష్ట్రంలో మొత్తం రెండు కోట్లతో మందితో యోగా చేయాలని భావించగా.. ఇప్పటికే 2.17 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారు. మూడు రోజులు యోగా చేసిన 25 లక్ష మందికి ప్రభుత్వం తరపున సర్టిఫికెట్లు ఇస్తాం. 21వ తేదీన వర్షం కారణంగా బీచ్ రోడ్డులో కార్యక్రమం నిర్వహించలేని పరిస్థితి వస్తే ప్లాన్-బీ కింద ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాట్లు చేశాం. వర్షం పడకపోతే రెండు వేదికలపైనా కార్యక్రమం జరుగుతుంది. 106 పర్యాటక ప్రాంతాల్లో పది వేల మంది ఈ కార్యక్రమం నిర్వహించడానికి ముందుకొచ్చారు' అని వివరించారు.



అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైన ప్రజలు

పద్ధతి పాటించండి: సీఎం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నేతలు గుంపులుగా రావద్దని, ప్రధాని నరేంద్ర మోదీ దృష్టిలో పడాలని ప్రత్యేక ఆసక్తి చూపవద్దని నాయకులు, అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. కార్యక్రమాన్ని పద్ధతి ప్రకారం గిన్నీస్ బుక్ రికార్డు కోసం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో అంతా యోగా ప్రాక్టీస్ చేసేవారు ఉంటారని స్పష్టంచేశారు. వారిని పక్కనపెట్టి నాయకులు, ఇతరులు వేదిక వద్దకు రావద్దని, అధికారులు సూచించిన విధంగా నడుచుకోవాలని చెప్పారు. ప్రధానికి ఇచ్చిన మాట ప్రకారం ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 1987లో నిర్వహించిన మహానాడును గుర్తు చేసుకున్నారు. అందరికీ పసుపు చొక్కాలు వేసుకొని రమ్మన్నామని, అలా రాని వారి చొక్కాలను పసుపు నీళ్ల డ్రమ్ములో ముంచి ఇచ్చామన్నారు.

యోగా డిక్లరేషన్..

ముఖ్యమంత్రిగా తాను ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలన్నింటిలో ఇదే పెద్దదని, చరిత్రలో నిలిచిపోయేలా చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ఆ రోజు కార్యక్రమం పూర్తయ్యాక ప్రధానితో కలిసి 'విశాఖ యోగా డిక్లరేషన్' ప్రకటిస్తామన్నారు. 'యోగాతో అనారోగ్యం తగ్గించుకోవచ్చు. ఇప్పుడు ఏదైనా వ్యాధి వస్తే మందులు తీసుకుంటున్నాం. అవన్నీ రసాయనాలు. అదే యోగా చేస్తే మందుల అవసరం ఉండదు. దీనివల్ల రూ.వేల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించి యోగా చేయాలి. 21వ తేదీన బీచ్ రోడ్డుకు రాలేని వారు ఇళ్లల్లోనే యోగా చేయండి. త్వరలో రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా టెక్నాలజీ ఉపయోగించుకుని ప్రతి ఒక్కరికీ 'డిజిటల్ హెల్త్ రికార్డులు' ఇస్తాం. 20వ తేదీన విశాఖలో మాక్ ఈవెంట్ నిర్వహించి లోపాలుంటే సరిదిద్దుతాం. 21వ తేదీన ఉద్యోగులు, విద్యార్థులకు సెలవు' అని తెలిపారు.

వారికి ఇబ్బందులు రాకూడదు

ఆర్కే బీచ్ వేదికగా భీమిలి వరకూ జరిగే యోగా వేడుకల్లో ఐదు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్యమంత్రికి వివరించారు. యోగా డేకు హాజరవుతున్న వారిని సమన్వయం చేసే బాధ్యతలు 607 సచివాలయాల సిబ్బందికి అప్పగించామన్నారు. ఉత్సవాల్లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్‌ను, ఇతర అధికారులను సీఎం ఆదేశించారు. యోగా డేలో పాల్గొనే వారితో మాక్ యోగా నిర్వహించాలని సూచించారు. ఆ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, సామాన్య ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధాని సహ ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో భద్రతాపరంగా చేసిన ఏర్పాట్లను పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వాహనాల పార్కింగ్‌కు చేసిన ఏర్పాట్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. సీఎం వెంట మంత్రి పి. నారాయణ, ఎంపీ ఎం. శ్రీభరత్, యోగాంధ్ర-2025 నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జనగణనకు నోటిఫికేషన్

విడుదల చేసిన కేంద్ర హోం శాఖ

- మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో 2026 అక్టోబరు 1 నాటికి పూర్తి
- మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1కి
- 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో నిర్వహణ
- రూ.13 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా
- డేటా లీక్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు
- నోటిఫికేషన్‌లో కుల గణన ప్రస్తావనే లేదు
- ఇది మోదీ సర్కారు యూటర్నా?: జైరాం రమేశ్
- కులగణన కూడా ఇందులో భాగమే: కేంద్ర హోం శాఖ

న్యూఢిల్లీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దేశంలో జనాభా లెక్కింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 16వ జనగణను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు అందులో స్పష్టం చేసింది. మొదటి దశ 'హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్‌ఎల్‌వో)'లో భాగంగా.. ప్రజల ఇంటి పరిస్థితులు, వారి ఆస్తులు, ఇళ్లల్లో ఉండే సౌకర్యాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియను 2026 ఏప్రిల్‌లోనే ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇక, రెండో దశ (పాపులేషన్ ఎన్యూమరేషన్)లో భాగంగా ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను సేకరిస్తారు. మంచు ఎక్కువగా ఉండే జమ్ము, కశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో 2026 అక్టోబరు 1 నాటికి, దేశంలోని మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1 నాటికి జనగణనను పూర్తిచేయనున్నట్లు కేంద్రం తన నోటిఫికేషన్‌లో వివరించింది. అలాగే.. ప్రజలు తమ వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో, యాప్‌లో స్వయంగా నమోదు చేసుకునే (సెల్ఫ్ ఎన్యూమరేషన్) వీలునూ కల్పిస్తున్నట్లు తెలిపింది. 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో.. ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించే ఈ భారీ కార్యక్రమానికి రూ.13 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. సమాచార సేకరణకు సంబంధించి ఈ ఏడాది అక్టోబరు నుంచే ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే సిబ్బందికి, సూపర్‌వైజర్లకు 45 వేల మందికి పైగా ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. వారికి 1800 మంది మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. వారికి శిక్షణ ఇవ్వడానికి జాతీయస్థాయిలో 100 మంది శిక్షకులు ఉంటారు. జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు 30కి పైగా ప్రశ్నలు అడిగి పౌరుల నుంచి సమాధానం రాబడతారు. వారు ఎలాంటి ఇంట్లో ఉంటున్నారు? ఇంట్లో ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉందా? వాడే వాహనాలేంటి? తినే తిండి, నీటి వనరులేంటి? ఇంటి పెద్ద స్త్రీయా? పురుషుడా? తదితర వివరాలను ఈ గణనలో భాగంగా సేకరించనున్నారు. ప్రజల నుంచి సమాచారం సేకరించే సమయంలోగానీ, ప్రసార సమయంలోగానీ, భద్రపరిచాకగానీ.. ఎక్కడా లీక్ కాకుండా అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

2020లో వాయిదా..

సాధారణంగా కేంద్రం పదేళ్లకొకసారి జనాభా లెక్కింపు కార్యక్రమాన్ని చేపడుతుంది. అలా స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటిదాకా ఏడుసార్లు జనగణన చేపట్టారు. చివరిసారిగా 2011లో.. జనాభాను లెక్కించారు. ఆ తర్వాత పదేళ్లకు.. అంటే 2021లో మళ్లీ జనగణన చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో 2020లో అందుకు సంబంధించిన సన్నాహాలు చేశారు. ఆ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొన్ని రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పనులు చేపట్టడానికి ప్రణాళికలు కూడా రూపొందించారు. కానీ.. కొవిడ్ కారణంగా జనగణన కార్యక్రమం వాయిదా పడింది. కాగా.. 2021 జనాభా లెక్కల ఆధారంగా.. జాతీయ జనాభా పట్టికను (ఎన్‌పీఆర్) సైతం నవీకరించాలని 2020లో నిర్ణయించిన సర్కారు.. తాజా నోటిఫికేషన్‌లో దాని గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇక .. జనగణనలో భాగంగానే కులగణన కూడా చేపట్టనున్నట్టు కేంద్ర మంత్రివర్గం గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా.. జనాభా లెక్కల సన్నాహాలపై ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం జరిగింది. అందులో కేంద్ర హోం కార్యదర్శి, రిజిస్ట్రార్ జనరల్, భారత్ జనాభా లెక్కల కమిషన్ (ఆర్జీ, సీసీఐ), ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ భేటీ దరిమిలా సోమవారం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.



ఆంగ్లేయుల పాలనలో..

మనదేశంలో సమగ్ర కుల గణనను బ్రిటిషర్లు 1881-1931 నడుమ రెగ్యులర్‌గా నిర్వహించారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చాక జనగణన నుంచి కులాన్ని మినహాయించారు. కులగణన నిర్వహించాలంటూ విపక్షాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రధాని మోదీ నేతృత్వంలో నిర్వహించిన రాజకీయ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో.. ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి.. కులగణన అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని 2010లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభకు హామీ ఇచ్చారు. దీనిపై చర్చించేందుకు మంత్రుల బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. మెజారిటీ రాజకీయ పార్టీలు కులగణకు మద్దతిచ్చాయి. అయితే.. 2011లో యూపీఏ హయాంలో నిర్వహించిన జనగణనలో కులాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో ప్రచురించలేదు. ఇటీవలికాలంలో బిహార్, తెలంగాణ రాష్ట్రాలు కులగణన నిర్వహించడంతో కేంద్రంపై ఒత్తిడి పెరిగింది.

ఇది మరో యూ టర్నా?

జనగణనకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఎక్కడా కుల గణన ప్రస్తావనే లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రస్తావన లేకపోవడమంటే.. మోదీ ప్రభుత్వం యూ టర్న్ తీసుకోవడమేనని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. కుల గణన చేయాలన్న కాంగ్రెస్ నాయకులను మోదీ అర్బన్ నక్సల్స్‌గా అభివర్ణించారని.. పార్లమెంటులో, సుప్రీంకోర్టులో కుల గణనను తిరస్కరించారని గుర్తుచేశారు. వాటన్నింటి నేపథ్యంలో ఇది మరో యూ టర్న్ అవుతుందా? లేక వివరాలు తర్వాత ప్రకటిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. జనభా లెక్కింపు కేవలం కుల గణనే కాకుండా కులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయలతో కూడిన వివరణాత్మ సమాచారంతో ఉండాలని, తెలంగాణ నమూనాను అనుసరించాలని సూచించారు. కేవలం కులాల వివరాలు సేకరించడంతో సరిపెట్టకుండా.. తెలంగాణ తరహాలో కులాలవారీగా సామాజిక, ఆర్థిక వివరాలు కూడా సేకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కాగా.. జైరామ్ రమేశ్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి స్పందించారు. కులగణన కూడా జనగణనలో భాగంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 30న, జూన్ 4న, జూన్ 15న వెల్లడించినట్టు గుర్తుచేశారు.



షార్‌కు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

షార్‌కు బాంబు బెదిరింపు

- చెన్నై పోలీసు కంట్రోల్ రూమ్స్‌కు అర్ధరాత్రి ఫోన్‌కాల్
- తమిళనాడు అధికారుల సమాచారంతో విస్తృత తనిఖీలు
- ఫేక్ కాల్‌గా నిర్ధారణ.. పోలీసుల అదుపులో నిందితుడు

సూళ్లూరుపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో తీవ్రవాదులు ఉన్నారంటూ వచ్చిన కాల్‌తో సోమవారం తెల్లవారుజామున కలకలం రేగింది. విస్తృత తనిఖీలు చేశాక ఉత్తుత్తిదేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు కాల్‌చేసిన వ్యక్తి.. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన బాలకృష్ణన్ విజయ్‌బాబుగా సూళ్లూరుపేట పోలీసులు గుర్తించారు. దీంతో సేలం వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వివరాలు ఇవి.. షార్‌లో తీవ్రవాదులు ఉన్నారని, బాంబు పెట్టారంటూ ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చెన్నై పోలీస్ కంట్రోల్ రూంకు ఫోను చేశాడు. తమిళనాడు పోలీసు అధికారులు ఏపీ పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే తిరుపతి జిల్లా పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, పోలీసులు సోమవారం తెల్లవారుజామున షార్‌కు చేరుకుని విస్తృతంగా తనిఖీలు చేశారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందం షార్ ప్రధాన రహదారులు, మొదటి గేటు, రెండో గేటు, షార్ ఉద్యోగుల కాలనీ, లేబర్ కాలనీల్లో అణువణువూ గాలించారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఆధ్వర్యంలో 80 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి షార్ కేంద్రం లోపల రాకెట్ ప్రయోగ వేదికలతోపాటు చుట్టుపక్కల అడవుల్లోనూ జల్లెడ పట్టారు. సముద్ర మార్గంలో మెరైన్ పోలీసులు, కోస్టల్ గార్డులు కూంబింగ్ చేశారు. తెల్లవారు జామున నుంచి 11 గంటల వరకు ఇటు పోలీసులు, అటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేశారు. షార్ కేంద్రంలోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. షార్ లోపలకు వెళ్లే అన్ని వాహనాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అంతా ఉత్తిదేనని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

షార్‌కు బెదిరింపు కాల్‌చేసిన వ్యక్తిని తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన బాలకృష్ణన్ విజయ్‌బాబుగా గుర్తించిన సూళ్లూరుపేట పోలీసులు.. సేలం వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అతడు కాల్ చేసిన ఫోన్ నంబరు ఆధారంగా.. పోలీసులు విజయబాబును గుర్తించారు.

పోలవరం-బనకచర్లకు పర్యావరణ అనుమతి ఇవ్వొద్దు

- పోలవరం విస్తరణ గోదావరి ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధం
- కేంద్రానికి తెలంగాణ మంత్రి ఉత్తమ్ లేఖ...

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధానం కోసం చేపట్టిన ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లో పర్యావరణ అనుమతి ఇవ్వరాదని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని తెలంగాణ కోరింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు సోమవారం లేఖ రాశారు. మంగళవారం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతికి అవసరమైన విధి విధానాల (టీవోఆర్)పై చర్చించేందుకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నిపుణుల కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశం అజెండాలో పోలవరం-బనకచర్ల (గోదావరి-బనకచర్ల అనుసంధానం) ప్రాజెక్టు ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. 200 టీఎంసీల సామర్థ్యంతో ఏపీ చేపట్టదలిచిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు గోదావరి ట్రైబ్యునల్-1980 తీర్పునకు విరుద్ధమని, ఈ ప్రాజెక్టు చేపట్టే అధికారం ఏపీకి లేదని ఉత్తమ్ తన లేఖలో పేర్కొన్నారు. గోదావరి నదిపై తెలంగాణ హక్కులను కాలరాసేలా ఉన్న ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించడానికి కూడా వీల్లేదని గతంలో తాము లేఖలు రాయగా.. బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు అనుగుణంగానే వ్యవహరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని ఉత్తమ్ లేఖలో తెలిపారు. ఈ ప్రాజెక్టులో వరద నీటి పేరుతో గోదావరి జలాలను అక్రమంగా తరలించడానికి నిర్ణయం తీసుకున్నారని, వరద జలాలపై ఎటువంటి హక్కులు లేవని పేర్కొన్నారు. గోదావరిలోనే కాకుండా కృష్ణాలోనూ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. 'పోలవరం ప్రాజెక్టుకు 2005 అక్టోబరు 25న పర్యావరణ అనుమతి లభించింది. ఆ మేరకే పనులు చేపట్టాలి. ప్రాజెక్టు విస్తరణ చేపట్టడం అనేది పర్యావరణ అనుమతుల కోసం జారీ చేసిన ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుంద'ని పేర్కొన్నారు. 'పోలవరం ప్రాజెక్టుతో ముడిపడిన పర్యావరణ అంశాలను ప్రభావిత రాష్ట్రాలతో సమావేశమై పరిష్కరించాలని 2022 సెప్టెంబరు 6న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. నాలుగుసార్లు సమావేశాలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా పోలవరం విస్తరణకు అనుమతిపై నిపుణుల మదింపు కమిటీ సమావేశం జరగడం అభ్యంతరకరమ'ని స్పష్టం చేశారు. కాగా, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కూడా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి మరో లేఖ రాశారు.

మళ్లీ మొదలెట్టారు!

(మొదటి పేజీ తరువాయి)

యోచించింది. దీనిపై ఉప్పందుకున్న కొందరు పెద్దలు విశాఖ నగర శివారునున్న ఆనందపురం, పెందుర్తి, భీమిలి, పద్మనాభం, విశాఖ రూరల్‌లో వాలిపోయారు. రైతుల నుంచి డీ పట్టా భూముల కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. కొంతసొమ్మును వారికి అడ్వాన్స్‌గా ఇచ్చేశారు.

ఫ్రీహోల్డ్ అవుతాయని తెలుసుకుని..

పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురం గ్రామంలో సుమారు 150 ఎకరాల డీ పట్టా భూమి ఉంది. ఇందులో 50 ఎకరాల వరకు పెద్ద రైతులు, 100 ఎకరాలు చిన్న, సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్నారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జీవో గత ప్రభుత్వం ఇవ్వనుందని తెలుసుకుని కీలక ఉన్నతాధికారి ఒకరు రంగంలోకి దిగారు. ఈ గ్రామానికి చెందిన వైసీపీ నేత (ఇప్పుడు జనసేనలో ఉన్నారు)తోపాటు మరికొందరు మండల నాయకుల సాయంతో పావులు కదిపారు. ఆయన తరఫున త్రిలోక్, ఇతర వ్యక్తులు ఎకరా రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల రేటు చొప్పున సుమారు 50 ఎకరాలకు అడ్వాన్స్‌లు ఇచ్చి అగ్రిమెంట్లు రాయించుకున్నారు. వైసీపీకి చెందిన పెద్ద నాయకులు, కొందరు చోటా నాయకులు కూడా ఇదే ధరకు 60 ఎకరాల వరకు కొనుగోలుకు ఒప్పందాలు చేశారు. వీరంతా ఎకరాకు రూ.5-6 లక్షల చొప్పున అడ్వాన్స్‌లు ఇచ్చి అనధికారికంగా ఒప్పందాలు చేసుకున్నారు. ఇంతలో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీకి జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిని పరిశీలించే సమయంలోనే ఫ్రీహోల్డ్ భూముల వివాదం చెలరేగడం, ఆ తరువాత 2024 ఫిబ్రవరిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పటి కలెక్టర్... ఎస్ఆర్.పురం భూముల ఫైల్‌ను పక్కన పెట్టేశారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది.

రంగంలోకి సీనియర్ అధికారి..

వైసీపీ హయంలో సుమారు 50 ఎకరాలకు అడ్వాన్స్‌లు ఇచ్చిన అప్పటి ఉన్నతాధికారి (తరువాత పదవీ విరమణ చేశారు) ఇటీవల తనకు పరిచయం ఉన్న సీనియర్ అధికారి వద్దకు తన మనుషులకు పంపారని ప్రచారం సాగుతోంది. గతంలో అడ్వాన్స్‌లు ఇచ్చిన భూములను విక్రయించేలా చేసి తన డబ్బులు తనకు వచ్చేలా సాయపడాలని కోరినట్టు సమాచారం. దీంతో సదరు ఉన్నతాధికారి రంగంలోకి దిగారు. సదరు భూములను పూలింగ్ చేయాలని వీఎంఆర్‌డీఏకు (విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ అథారిటీ) సూచించారు. దీనివల్ల వీఎంఆర్‌డీఏకు ప్రయోజనం చేకూరుతుందని పైకి చెబుతూ, పరోక్షంగా రిటైర్డ్ ఉన్నతాధికారికి మేలుచేసేలా పావులు కదిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఆర్ పురం డీ పట్టా రైతులు ఆగ్రహిస్తున్నారు. తమ భూములను వీఎంఆర్‌డీఏ తీసుకునే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేస్తే సర్వహక్కులు తమకు దఖలు పడతాయని, అప్పుడు ఎకరా రూ.5-6 కోట్లు పలుకుతుందని చెబుతున్నారు. అదే వీఎంఆర్‌డీఏకు ఇస్తే అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఎకరాకు 900 గజాల చొప్పున ఇస్తే రూ.2 కోట్లకు మించి రాదని అంటున్నారు. అయితే గతంలో ఈ భూములకు అడ్వాన్స్‌లు ఇచ్చిన వ్యక్తుల (రిటైర్డ్ ఉన్నతాధికారి కాకుండా.. వైసీపీకి చెందిన స్థానిక నాయకులు) తరఫున ఇటీవల కొందరు బ్రోకర్లు రంగంలోకి దిగారు. అమరావతి కేంద్రంగా రెవెన్యూలో కొందరు పెద్దలతో వారు సంప్రదింపులు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. వీరంతా కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలుస్తోంది.



ఆర్‌బీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ గవర్నర్ టి.రబిశంకర్

రాష్ట్రం నుంచే ఇకపై ఆర్‌బీఐ సేవలు

- విజయవాడలో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి సేవలు అందించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం సిద్ధమైంది. విజయవాడ బందరు రోడ్డులోని స్టాలిన్ సెంట్రల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యాలయాన్ని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టి.రబిశంకర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చాంబర్లకు రాష్ట్రంలో ప్రవహించే నదుల పేర్లను పెట్టారు. ఒక చాంబర్‌కు తుంగభద్ర, మరో చాంబర్‌కు గోదావరిగా నామకరణం చేశారు. అలాగే, అత్యాధునిక సమావేశ మందిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. రెండంతస్తుల్లో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం కొలువుదీరింది. విభాగాలవారీగా కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ అత్ ఒమర్ బషీర్, సీజీఎం పునీత్ పంచోలి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐబీడీ, ఎఫ్ఐడీడీ, ఫెడ్, రాజ్‌భాష సెల్, ఆడిట్ బడ్జెట్ అండ్ కంట్రోల్ సెల్ తదితర విభాగాలు విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో ప్రారంభమయ్యాయని ఓ ప్రకటనలో ఆర్‌బీఐ తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన నగదు నిర్వహణ హైదరాబాద్ ఆఫీసు నుంచి కొనసాగుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది.

ప్రజా రవాణాకు 'ఎగిరే బస్సులు'

- ఒకేసారి 135 మంది ప్రయాణం
- బెంగళూరు, ఢిల్లీల్లో పైలట్ ప్రాజెక్టు



న్యూఢిల్లీ, జూన్ 16: దేశంలోని ప్రధాన నగరాల్లో రోజురోజుకు ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోతున్నాయి. దీనికి చెక్ పెట్టడానికి, భవిష్యత్‌లో ప్రజా రవాణాలో కొత్తతరం బస్సులు ప్రవేశపెట్టడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది. ఎగిరే బస్సులుగా పిలిచే ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొచ్చే యోచనలో ఉంది. మెట్రో రైళ్లలాగా ఎలివేటెట్ కారిడార్లలో నడిచే ఈ బస్సులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రజా రవాణాకు సంబంధించి సౌకర్యం, వేగం, పర్యావరణ అనుకూల అంశాలపై దృష్టి పెట్టామని చెప్పారు. అంతర్జాతీయ సంస్థల నుంచి ఇప్పటికే పలు ప్రతిపాదనలు వచ్చాయని, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో పైలట్ ప్రాజెక్టు గురించి చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. "మొత్తం 360 ప్రతిపాదనలు వచ్చాయి. కాలుష్యం లేని ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టాం. ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ఏరియల్ పాడ్ ట్యాక్సీలు లేదా ఫ్లయింగ్ బస్‌ల ప్రతిపాదన చేశాం. ఇవి విమానాలు కాదు. కానీ, డ్రైవర్ లేకుండా ఎలివేటెడ్ ట్రాక్‌లపై నడిచే ఎలక్ట్రిక్ పాడ్‌లు. వీటిని డబుల్ డెక్కర్ బస్సుల్లాంటి పాడ్స్ అనవచ్చు. ఒక్కో బస్సులో 135 మంది ప్రయాణించవచ్చు. ఇప్పటికే 13 సాంకేతిక ప్రతిపాదనలు వచ్చాయి. ఇది ప్రజారవాణాకు సంబంధించినది కాబట్టి తక్కువ రేట్లకే ప్రజలకు సౌకర్యం కల్పించాలి. ఆ ప్రతిపాదనలు ఆర్థికంగా లాభదాయకమా, కాదా? అనేది పరిశీలిస్తున్నాం. బస్సు స్టేషన్‌లో ఆగినప్పుడు అర నిమిషంలో ఫ్లాష్ చార్జింగ్ సిస్టంతో చార్జి అవుతుంది. 40 కి.మీ. సునాయాసంగా ప్రయాణిస్తుంది. విమానంలోలాగా టీ, కాఫీ ఇతర సదుపాయాలు కూడా బస్‌లో అందించే అవకాశం ఉంది" అని గడ్కరీ తెలిపారు.

మద్యం స్కాంలో మిథున్‌రెడ్డిదే కీలకపాత్ర



(మొదటి పేజీ తరువాయి)

ఆర్డర్లు ఇచ్చారని పేర్కొన్నారు. అక్రమంగా ఆర్జించిన సొమ్మును వివిధ మార్గాలు, నకిలీ కంపెనీల ద్వారా మళ్లించారన్నారు. ఈ మేరకు హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. "ప్రభుత్వ ఖజానాకు రూ.3,500 కోట్ల మేరకు నష్టం చేశారు. మద్యం ముడుపుల ద్వారా వచ్చిన రూ.5 కోట్ల సొమ్మును డీకార్ట్ లాజిస్టిక్స్ నుంచి మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు చేరాయి. పీఎల్ఆర్ సంస్థలో వందశాతం షేర్లు మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులవే. పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదన్న మిథున్‌రెడ్డి వాదనలో అర్థం లేదు. ముడుపుల వసూళ్ల గురించి పత్రికల్లో వార్తలు రావడంతో డీకార్ట్ లాజిస్టిక్స్ నుంచి వచ్చిన సొమ్మును తిరిగి ఆ సంస్థకే చెల్లించారు. అయితే, ఆ సొమ్మును నగదు రూపేణా వివిధ మార్గాల్లో తిరిగి పిటిషనర్ ఖాతాలకే చేరింది. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ము అంతిమంగా ఎవరి ఖాతాలోకి చేరిందనే విషయాన్ని వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. వాస్తవాలు రాబట్టాలంటే పిటిషనర్ కస్టోడియల్ విచారణ అవసరం. పిటిషనర్‌కు పూర్వ నేరచరిత్ర ఉంది. తనపై ఉన్న కేసులకు సంబంధించి పూర్తి వివరాలను పిటిషనర్ కోర్టు ముందు ఉంచలేదు. మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన కొందరు నిందితులు అప్రూవర్లుగా మారేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ అంశం పరిశీలనలో ఉంది. పిటిషనర్ మొదటిసారి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసేనాటికే మద్యం కుంభకోణంలో ఆయన పాత్రపై ఆధారాలు ఉన్నాయి. కుంభకోణంలో పిటిషనర్ పాత్రపై పలువురు నిందితులు, సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. ఆధారాలు లభించిన తర్వాత నిందితుడిగా చేరుస్తూ సంబంధిత కోర్టులో ఏప్రిల్ 22న మెమో దాఖలు చేశాం." అని సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. పూర్తిస్థాయి వాదనల కోసం తగినంత సమయం లేకపోవడంతో కొనసాగింపు కోసం విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆ అధికారిని విచారించాలి: నిరంజన్‌రెడ్డి

మద్యం కుంభకోణం వ్యవహారంపై గత ఏడాది సెప్టెంబరు 23న సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "ముందస్తు బెయిల్ కోసం గతంలో మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా దర్యాప్తు అధికారి పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచకుండా తప్పుదోవపట్టించారు. దర్యాప్తు అధికారిని ప్రాసిక్యూట్ చేయాలి. గత బెయిల్ పిటిషన్ విచారణ నాటికే 104 మంది సాక్షులను విచారించి, వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌తో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదు. డీకార్ట్ లాజిస్టిక్స్ నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు వచ్చిన రూ.5 కోట్ల సొమ్మును తిరిగి ఆ సంస్థకు చెల్లించారు. ఈ లావాదేవాలపై పిటిషనర్ ఇప్పటికే సిట్‌కు వివరణ ఇచ్చారు. ముడుపుల సొమ్ము పిటిషనర్‌కు చేరినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. మద్యం పాలసీ రూపకల్పనలో పిటిషనర్‌కు ఎలాంటి పాత్ర లేదు. అరెస్ట్ చేసి వేధించేందుకు పోలీసులు పిటిషనర్‌ను వెంటాడుతున్నారు. కేసులో ఏ2గా ఉన్న డి. వాసుదేవ రెడ్డి, ఏ3 సత్యప్రసాద్, ఏ5 మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి జోలికి పోలీసులు వెళ్లడం లేదు." అని కోర్టుకు వివరించారు.

సజ్జల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా



అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంకరజాతి తెగ అంటూ రాజధాని ప్రాంత ప్రజలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయంలో అమరావతి రాజధాని రైతు దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వేసిన వ్యాజ్యంపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, సజ్జల తరఫున న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇదే వ్యవహారంపై శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారని, దాని ఆధారంగా ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ఈ ఫిర్యాదు ఆధారంగా ఇప్పటివరకు ఎలాంటి కేసూ నమోదు కాలేదని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లి కార్జునరావు పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని ఆదేశించారు.

పేర్ని నానికి వారెంట్

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత పేర్ని నానిపై సోమవారం బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ కేసులో కోర్టుకు హాజరు కానందున నానికి వారెంట్ జారీ చేశారు. 'సినీ నటుడు చిరంజీవే నన్నేం చేయలేకపోయారు. నాకు చిరంజీవి కులానికి చెందిన ఓట్లు అక్కర్లేదు' అని ఒక యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో పేర్ని నాని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలోనే పవన్ ఏం చేస్తాడంటూ మాట్లాడారు. దీనిపై స్థానికులు తుమ్మల చందు, చిలంకుర్తి శ్రీహర్ష చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో 2019 మే 2న ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తోంది.

అసభ్య పదజాలం వాడొద్దు

- కేసు విషయాలు మాట్లాడరాదు
- సాక్షులను ప్రభావితం చేయడం బెదిరించడం వంటివి చేయొద్దు
- అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లొద్దు
- కొమ్మినేనికి షరతులతో మంగళగిరి కోర్టు బెయిల్



జైలు నుంచి బయటకు వచ్చిన కొమ్మినేనికి స్వాగతం పలుకుతున్న అంబటి రాంబాబు

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మంగళగిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని స్పష్టం చేసింది. ప్రతి నెలా రెండు, నాలుగు శనివారాల్లో తుళ్లూరు ఎస్‌హెచ్‌ఓ ఎదుట హాజరై సంతకం చేయాలని, పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడం, బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించింది. కేసుకు సంబంధించిన విషయాలు మాట్లాడరాదని, అసభ్యకరమైన పదజాలం వాడరాదని సూచించింది. ఎదుటివారిని కించపరిచే వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేసింది. రూ.20 వేలు చొప్పున రెండు షూరిటీలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. సోమవారం రాత్రి గుంటూరు జిల్లా జైలు నుంచి కొమ్మినేని విడుదలయ్యారు. వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, వైసీపీ లీగల్ సెల్ న్యాయవాదులు తదితరులు జిల్లా జైలు వద్దకు వచ్చారు. కొమ్మినేనికి వైసీపీ నాయకులు పూలమాలలు వేశారు. కోర్టు షరతుల నేపథ్యంలో తానేమి మాట్లాడలేనని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అంటూ కొమ్మినేని ముగించారు. జైలు వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నెల 6న సాక్షి చానల్‌లో యాంకర్ కొమ్మినేని లైవ్ డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎనలిస్టు కృష్ణంరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ.. ఏపీ రాజధానిని సీఎం చంద్రబాబు దేవతల రాజధానిగా కొనియాడుతున్నారని, కానీ అది దేవతల రాజధాని కాదని, వేశ్యల రాజధాని అని వ్యాఖ్యానించారు. రాజధాని చుట్టూ వేశ్యలు, ఎయిడ్స్ రోగులు ఎక్కువగా ఉన్నారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు వ్యాఖ్యలను ఖండించకపోగా అవును తాను కూడా ఇంగ్లిష్ పత్రికలో చూశానంటూ ప్రోత్సహించేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో కొమ్మినేనిని పోలీసులు అరెస్టు చేశారు. 10న మంగళగిరి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అప్పటి నుంచి కొమ్మినేని గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. కొమ్మినేని తరఫు న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణలో ఉన్న సమయంలో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 13న షరతులకు లోబడి బెయిల్ మంజూరు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆయన తరఫు న్యాయవాదులు సోమవారం మంగళగిరిలోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొమ్మినేనికి షరతులతో కూడిన బెయిల్‌ను మేజిస్ట్రేట్ ఎం ప్రసన్నలక్ష్మి మంజూరు చేశారు.



ఆమెను చెట్టుకు కట్టేసి... అప్పు తీర్చాలంటూ వేధింపులు

- భర్త తీసుకున్న రుణానికి భార్యకు శిక్ష
- చిత్తూరు జిల్లా కుప్పంలో దారుణం

కుప్పం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చేసిన అప్పు భర్త తీర్చలేదని భార్యను చెట్టుకు కట్టేసిన ఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం ప్రకారం.. కుప్పం మండలం దాసేగానూరు పంచాయతీ నారాయణపురం గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప, శిరీష దంపతులు. గ్రామానికి చెందిన మునికన్నప్ప దగ్గర సుమారు మూడేళ్ల క్రితం తిమ్మరాయప్ప రూ.80 వేలు అప్పు తీసుకుని తీర్చలేకపోయారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ బిడ్డలతో కలిసి బతకడానికి ఊరు వదిలి వెళ్లిపోయారు. అయితే తన కుమారుడి స్టడీ సర్టిఫికెట్ కోసం శిరీష సోమవారం గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న మునికృష్ణప్ప ఆమెపై దాడి చేశారు. శిరీషను చెట్టుకు తాడుతో బంధించారు. అప్పు తీర్చాలంటూ దాదాపు గంట సేపు వేధింపులకు గురిచేశాడు. స్థానికులు కొందరు సమాచారం అందించడంతో కుప్పం అర్బన్ పోలీసులు నారాయణపురం చేరుకుని శిరీషను విడిపించారు. మునికృష్ణప్పతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

జగన్ సహా వందమందికే అనుమతి

- ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు: పల్నాడు ఎస్పీ
- రేపు రెంటపాలలో విగ్రహావిష్కరణకు వైసీపీ నేత



నరసరావుపేట లీగల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాల గ్రామంలో ఈ నెల 18న నిర్వహించే వైసీపీ కార్యకర్త నాగ మల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహా వందమందికి మాత్రమే అనుమతి ఇస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జగన్ పర్యటనకు అనుమతి కోరుతూ సత్తెనపల్లి వైసీపీ ఇన్‌చార్జి సుధీర్ భార్గవ్ రెడ్డి దాఖలు చేసిన అభ్యర్థన పత్రాన్ని పరిశీలించిన ఎస్పీ సోమవారం తన కార్యాలయంలో ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. విగ్రహావిష్కరణకు 30 వేల మంది వచ్చే అవకాశం ఉందని వైసీపీ అంచనా వేసిందని ఎస్పీ చెప్పారు. అయితే, విగ్రహావిష్కరణ జరిగే ప్రాంతానికి పది అడుగుల రోడ్డు మాత్రమే ఉందని, రోడ్డుకు ఇరువైపులా గృహాలున్నాయని, ఆ ప్రదేశానికి వంద మంది కంటే ఎక్కువమంది వెళ్లటానికి అవకాశం లేదని తెలిపారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి సందర్భాల్లో జరిగిన దుర్ఘటనలను దృష్టిలో పెట్టుకుని జగన్ సహా వంద మంది ప్రజలకు, జగన్ కాన్వాయ్‌తోపాటు మరో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వగలుగుతామని చెప్పారు. శాస్త్రీయంగా సూచించిన మేరకే అనుమతినిస్తామని, ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.